

ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ పిచ్చేశ్వరరావు భార్య వెంకటదుర్గకు రూ.కోటి చెక్కు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి కోటి పరిహారం

- చెక్కు అందజేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు 12
- ఉద్యోగుల కోసం ప్రభుత్వం ప్రత్యేక బీమా పథకం
- రూపాయి ప్రీమియం లేకుండానే భారీ పరిహారం

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



మంగళవారం | 30-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 294 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: దశమి ఉ.7:51, ఏకాదశి తె.5:00 వరకు, నక్షత్రం: భరణి తె.3:58 తదుపరి కృత్తిక, వర్జ్యం: మ.2:49-4:17, దుర్ముహూర్తం: ఉ.9:00-9:44, రా.10:03-10:54, అమృతఘడియలు: రా.11:35-1:02, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 6:48, సూర్యాస్తమయం: 5:46 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

28 జిల్లాలు ఖరారు

కొత్త జిల్లాలు రెండే.. మార్కాపురం, పోలవరానికి క్యాబినెట్ ఓకే

17 జిల్లాల్లో మొత్తం 25 మార్పులకు ఆమోదం

- అన్నమయ్య జిల్లా కేంద్రం ఇక మదనపల్లె
- ఆ జిల్లా పూర్తిగా పునర్వ్యవస్థీకరణ
- రాయచోటి నియోజకవర్గం అందులోనే
- కడపకు రాజంపేట.. తిరుపతికి రైల్వే కోడూరు
- నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోనూ మార్పులు
- అద్దంకి నియోజకవర్గం ప్రకాశంలోకి
- అద్దంకి సబ్ డివిజన్‌లోకి దర్శి
- ఆదోని మండలం 1, 2గా విభజన
- రెవెన్యూ డివిజన్‌గా మడకశిర
- పలు మండలాల మార్పు
- సబ్ డివిజన్లుగా బనగానపల్లె, అద్దరోడ్డు జంక్షన్
- పెనుగొండకు వాసవీ పెనుగొండగా నామకరణం
- రేపు తుది నోటిఫికేషన్.. జనవరి 1 నుంచే అమలు
- మంత్రులు అనగాని, నాదెండ్ల, సత్యకుమార్ వెల్లడి



రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు



అమరావతి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలకు మాత్రమే పచ్చజెండా ఊపింది. ప్రస్తుతం ఉన్న అన్నమయ్య జిల్లాను పూర్తిగా పునర్వ్యవస్థీకరించి.. జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మార్చాలన్న ప్రతిపాదనను మంత్రివర్గంలో చర్చించి ఆమోదించారు. అయితే రాయచోటి నియోజకవర్గం అన్నమయ్య జిల్లాలోనే కొనసాగుతుంది. కానీ రాజంపేటను కడప జిల్లాలో, రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో విలీనం చేయాలన్న ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మార్కాపురం, పోలవరం జిల్లాల ఏర్పాటులో

మిగతా 13వ పేజీలో...



క్యాబినెట్‌లో మంత్రి మండిపల్లి కన్నీరు

- జిల్లా కేంద్రంగా రాయచోటిని తీసేయడంపై ఆవేదన
- మంత్రిమండలిలో స్తబ్దత.. ఓదార్చిన సీఎం
- నియోజకవర్గ అభివృద్ధిపై హామీ



వైకుంఠ ద్వార దర్శనాల ప్రారంభం నేపథ్యంలో సోమవారం శ్రీవారి ఆలయ మహాద్వారం వద్ద ప్రత్యేక అలంకరణ

అమరావతిలో మౌలిక వసతులకు నాబార్డు నుంచి 7,387 కోట్లు

- మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్‌లో భూగర్భ డ్రైనేజీకి రూ.1,673 కోట్లు
- ఐఐపీఎం ఏర్పాటుకు నూజివీడులో 9.96 ఎకరాల ప్రభుత్వ భూమి 13
- దగదర్తి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు అభివృద్ధికి దామవరంలో 418 ఎకరాల సేకరణ
- అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు
- మోటారు వాహనాలపై లైఫ్ ట్యాక్స్‌లో 10% రోడ్డు భద్రత సెస్ వసూలుకు ఆర్డినెన్స్
- క్యాబినెట్ భేటీలో మరిన్ని నిర్ణయాలు

ప్రపంచ స్థాయికి క్వాంటమ్ వ్యాలీ

- రాజధానిలో అంతర్జాతీయ కాన్ఫరెన్సులు
- జనవరిలో క్వాంటమ్ కంప్యూటర్ పని ప్రారంభం
- ప్రతి కోస్తా జిల్లాలో ఓడరేవు ప్రభుత్వ లక్ష్యం
- 2025లో సంతృప్తికరంగా ప్రభుత్వ పాలన
- మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ కంప్యూటింగ్‌లో అమరావతిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు దిశగా

మిగతా 13వ పేజీలో...

భూ సర్వేల్లో తప్పిదాలు దొర్లకూడదు 11

- రెవెన్యూ సేవలు సులభంగా ప్రజలకు అందాలి
- అన్ని ఆలయాల్లోనూ తిరుమల తరహా సేవకులు
- ప్రజారోగ్యం బాగుపడేలా పంటలు పండించాలి
- వ్యవసాయం-ఆరోగ్య శాఖలు కలిసి పనిచేయాలి
- ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖలపై సీఎం సమీక్ష



శ్రీధర్

12

ప్రభుత్వ సలహాదారులుగా కార్టూనిస్టు శ్రీధర్, మంతెన

దేవదాయ శాఖకు చుండూరి



14

మద్యం సొమ్ము తరలింపులో చెవిరెడ్డిది ముఖ్య పాత్ర

- హైకోర్టుకు సిట్ నివేదన
- కంపెనీల నుంచి ప్రతి నెలా 60-70 కోట్లు వసూలు
- ఆధారాలు లభించాకే నిందితుడిగా చేర్చాం
- సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు

తీరు మారిన 'ఈశాన్యం'

- రోజుల తరబడి వర్షాభావం
- సాగుకు సహకరించని రుతుపవనాలు 3
- తుఫాన్ల ప్రభావంతోనే వానలు

మంటల్లో బోగీలు

టాటానగర్-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లోని 2 ఏసీ కోచ్‌లు బుగ్గి.. ఒకరి మృతి

- ఎలమంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో ఘటన
- బీ1లో పొగలు, వేగంగా అలుముకున్న మంటలు.. ఎం2కూ అవి విస్తరణ
- ప్రమాదాన్ని మొదట్లోనే గుర్తించి రైలు నిలిపివేత
- దీంతో తప్పిన పెనుప్రమాదం
- మృతుని బ్యాగులో 5.8 లక్షల నగదు, బంగారం
- నగదులో సగం కాలిబూడిద

ఎలమంచిలి, సామర్లకోట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా దువ్వాడ మీదుగా ఎర్నాకుళం వెళ్లే టాటానగర్-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మంటల్లో చిక్కుకుంది. ఈ ఘటనలో రెండు ఏసీ బోగీలు పూర్తిగా కాలిపోగా, ఒకరు సజీవ దహనమయ్యారు. ఆ బోగీల లోపలి భాగంలో ఇనుప ఊచలు మాత్రమే కనిపిస్తున్నాయి. అయితే ప్రమాదాన్ని వెంటనే గుర్తించి రైలును నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. రైలు మరో ఐదు నిమిషాల్లో అనకాపల్లి జిల్లా ఎలమంచిలి స్టేషన్‌కు చేరుకుంటుందనగా, బీ1 కోచ్‌లో మంటలు రేగాయి. అవి వేగంగా ఎం2 కోచ్‌కు వ్యాపించాయి. అయితే, పొగలు కమ్ముకోవడాన్ని గుర్తించిన లోకో పైలట్లు రైలును ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో

మిగతా 14వ పేజీలో...



మంటల్లో తగలబడుతున్న ఏసీ బోగీలు (ఇన్‌సెట్) పూర్తిగా తగలబడిన బోగీ లోపల భాగం



వార్షిక నివేదికను విడుదల చేస్తున్న డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, అధికారులు

పక్కాగా పోలీసింగ్

ప్రజలకు మరింత చేరువ

- మారుతున్న నేర స్వరూపంపై జనవరిలో అధికారులతో వర్క్‌షాప్
- గంజాయి, డ్రగ్స్ అనర్థాలపై ప్రజల్లో చైతన్యం తెస్తున్నాం 14
- 2025లో 6.17% మేర నేరాలు తగ్గాయి.. 54% అల్లర్లు కూడా
- 154 మందిపై కొత్తగా రౌడీషీట్లు.. పెరుగుతున్న సైబర్ నేరాలు
- ఆర్థిక మోసాల కట్టడికి చర్యలు.. పోలీసుల పనితీరుపై డీజీపీ గుప్తా

పంచాయతీల పునర్విభజన ఇప్పట్లో లేనట్లే!

- ఏప్రిల్ 2 దాకా ప్రస్తుత పాలక వర్గాలు
- ఈలోపు మార్పులకు అవకాశం లేదు
- పైగా జనవరి 2 నుంచి జనగణన ప్రక్రియ
- సెన్సస్ కమిషనర్ అనుమతితోనే చేపట్టడానికి ఆస్కారం
- ఇప్పటికే గ్రేటర్ తిరుపతి, గ్రేటర్ విజయవాడపై నిర్ణయం



అమరావతి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ శాఖకు సంబంధించి గ్రేటర్ తిరుపతి, గ్రేటర్ విజయవాడలే కాకుండా.. పంచాయతీరాజ్ శాఖలో గ్రామ పంచాయతీల పునర్విభజన కూడా ఇప్పుడు సాధ్యం కాదని అధికారులు పేర్కొంటున్నారు. జనగణన ప్రక్రియ వచ్చే ఏడాది జనవరి 2 నుంచి ప్రారంభమవుతున్నందున ఈ లోపు పంచాయతీల పునర్విభజన ప్రక్రియ పూర్తి చేయాలని పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ భావించి దానిని చేపట్టింది. పునర్విభజనపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియ చేపట్టాలని భారీస్థాయిలో విజ్ఞప్తులు అందాయి. ఇప్పటికే సుమారు 150 గ్రామ పంచాయతీలను విభజించాలని, విలీనం చేయాలని, పునర్విభజన

మిగతా 11వ పేజీలో...



సెంగార్ బెయిల్‌పై స్టే

- ఉన్నావ్ రేప్ దోషికి సుప్రీంకోర్టులో చుక్కెదురు
- ఢిల్లీ హైకోర్టు తీర్పుపై నిలుపుదల ఉత్తర్వులు
- పదిహేనేళ్ల మైనర్‌పై అత్యాచారం ఘోరం
- బాధితురాలికి మనం అండగా నిలవాలి: సీబీఐ
- ఉరిశిక్ష పడే వరకూ పోరాటం ఆగదు: బాధితురాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన 2017 ఉన్నావ్ రేప్ కేసులో నిందితుడు, బీజేపీ మాజీ ఎమ్మెల్యే కులదీప్ సింగ్ సెంగార్‌కు ఇటీవల ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన బెయిలును సుప్రీంకోర్టు సోమవారం నిలిపివేసింది. బాధితురాలి తండ్రి కస్టోడియల్ మరణం, ఆమె బంధువులు, న్యాయవాది అనుమానాస్పద మృతి, చివరికి

మిగతా 2వ పేజీలో...

ఆరావళిపై మరింత అధ్యయనం

- నవంబరు 20 నాటి తన తీర్పును నిలిపేసిన సుప్రీం
- కమిటీ నివేదిక, గత తీర్పుపై స్పష్టత అవసరమని వ్యాఖ్య
- లోతైన అధ్యయనానికి కమిటీ వేయాలని సూచన

సచివాలయ సంఘ అధ్యక్షుడిగా.. రామకృష్ణ విజయ దుందుభి

- 9 పదవుల్లో 7 ఆయన ప్యానెల్‌కే..
- ట్రెజరర్‌గా భాగ్యలక్ష్మి విజయం
- రాజేశ్ ప్యానెల్ నుంచి ప్రధాన కార్యదర్శిగా 6 ఓట్లతో నాతా ప్రసాద్ గెలుపు 12



రామకృష్ణ

వెండి ఉత్థాన పతనం

- ఆరంభ ట్రేడింగ్‌లో ఆల్‌టైం రికార్డు
- రూ.2.54 లక్షలకు పెరిగిన కిలో ధర
- ఆ తర్వాత గంటకే రూ.21,000 పతనం
- ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటంతో తగ్గిన ధర 10



చైనీయుడివా అంటూ.. త్రిపుర విద్యార్థిపై మూకదాడి

- తీవ్ర గాయాలతో 17 రోజులు మృత్యువుతో పోరాడి మరణించిన విద్యార్థి
- ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో దారుణం
- మృతుడు ఎంబీఏ ఫైనలియర్.. తండ్రి జవాన్ 2
- బీజేపీ అగ్ర నేతల వల్లే ఈ విద్వేషాలు: రాహుల్

రాౖక్రేల బాటలో పవార్‌లు!

» మహారాష్ట్ర మున్సిపోల్స్ కోసం అజిత్, శరద్ పొత్తు



ముంబై, డిసెంబరు 29: మహారాష్ట్రలో విడిపోయిన రాజకీయ కుటుంబాలు స్థానిక ఎన్నికల వేళ ఒక్కటవుతున్నాయి. ముంబై కార్పొరేషన్‌పై పట్టు నిలబెట్టుకునేందుకు ఇప్పటికే ఉద్ధవ్ శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రే, ఆయన సోదరుడు, మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధినేత రాజ్ ఠాక్రే ఒక్కటయ్యారు. ఇప్పుడు అదే బాటలో ఎన్సీపీ వర్గాల అధినేతలు అజిత్ పవార్, ఆయన బాబాయి శరద్ పవార్ జట్టుకట్టారు. పింప్రి-చించ్వాడ్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ, ఆయన బాబాయి శరద్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ(ఎస్పీ) పొత్తు కుదుర్చుకున్నాయి. కుటుంబమంతా ఒక్క చోటకు చేరిందని అజిత్‌పవార్ ఆదివారం ప్రకటించారు. తమ గుర్తు గడియారం, పవార్ పార్టీ గుర్తు బాకా కలిసిపోయాయన్నారు. పొత్తుపై పలు సందేహాలు రేగాయని.. మహారాష్ట్ర అభివృద్ధి కోసం కొన్నిసార్లు నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుందన్నారు. పుణే కార్పొరేషన్‌లోనూ రెండు పార్టీలూ కలిసి పోటీచేయడంపై చర్చలు జరిగాయి. అయితే పవార్ ఎన్సీపీ ఎక్కువ డివిజన్లు డిమాండ్ చేయడంతో అజిత్ ఇంతవరకు పొత్తు ఖరారుచేయలేదు. ఈ రెండు సహా 29 కార్పొరేషన్లకు నామినేషన్ల దాఖలుకు మంగళవారం వరకు గడువుంది.

బంగ్లా చొరబాటుదారులను పంపించేస్తాం

» అసోంలోనే కాదు, దేశంలో ఎక్కడున్నా గుర్తిస్తాం: అమిత్ షా

గువాహటి, డిసెంబరు 29: బంగ్లాదేశ్ చొరబాటుదారులను కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకుగా పరిగణిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విమర్శించారు. అస్సామీల భూములకు, అస్థిత్వానికి, సంస్కృతికి ముప్పుగా మారిన వీరిని కాంగ్రెస్ వెనుకేసుకు వస్తోందని ఆరోపించారు. అసోంలో మాత్రమే కాదు దేశంలో మిగతా ప్రాంతాల్లో ఉన్న చొరబాటుదారులను గుర్తించి, వెనక్కి పంపిస్తామని స్పష్టం చేశారు. అసోంలోని బోర్దువాలో సోమవారం ఆయన పర్యటించారు. ఇక్కడ వైష్ణవ గురువు శ్రీమంత శంకర్‌దేవ పుణ్య తీర్థం అయిన బాటాద్రావ థాన్ ప్రాజెక్టు పునరుద్ధరణకు రూ.227 కోట్లతో తలపెట్టిన పనులను ఆయన ప్రారంభించారు. వలసల నుంచి మరింత రక్షణ కోసం మరో ఐదేళ్లపాటు బీజేపీ ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలని అస్సామీలను ఆయన కోరారు.

రూ.79వేల కోట్ల రక్షణ కొనుగోళ్లకు ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబరు 29: భారత రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేసేలా.. త్రివిధ దళాలకు కొత్త శక్తినిచ్చేలా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. సాయుధ దళాల కోసం రూ.79వేల కోట్ల విలువైన రక్షణ పరికరాలు, ఆయుధాలు, మిలిటరీ హార్డ్‌వేర్ కొనుగోలుకు సోమవారం ఆమోదం లభించింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అధ్యక్షతన సోమవారం జరిగిన రక్షణ సేకరణ మండలి(డీఏసీ) సమావేశంలో ఈ కొనుగోళ్లకు ఆమోదం లభించింది. ఆర్మీకి సంబంధించి ఆర్టిలరీ రెజిమెంట్ల కోసం లోయిటర్ మ్యూనిషన్ సిస్టమ్స్, తేలికపాటి రాడార్లు, పినాకా రాకెట్ వ్యవస్థ కోసం దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్ మందుగుండు సామగ్రి.. నావికా దళం కోసం హై ఫ్రీక్వెన్సీ సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియోలు, హై ఆల్టిట్యూడ్ లాంగ్ రేంజ్ రిమోట్లీ పైలెటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్‌లు.. వైమానిక దళం కోసం ఆటోమ్యాటిక్ టేకాఫ్, ల్యాండింగ్ రికార్డింగ్ సిస్టమ్, అస్త్ర ఎంకే-2 క్షిపణులు, తేజస్ యుద్ధ విమానాల కోసం ఫుల్ మిషన్ సిమ్యులేటర్లు, స్పైస్-1000 లాంగ్ రేంజ్ గైడెన్స్ కిట్ల కొనుగోలుకు ఆమోదం తెలిపారు.

ముంబై వృద్ధురాలికి రూ.3.71 కోట్ల టోకరా

ముంబై, డిసెంబరు 29: ముంబైలో డిజిటల్ అరెస్టు పేరుతో జరిగిన ఓ భారీ సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. అంధేరి వెస్ట్ ప్రాంతానికి చెందిన 68 ఏళ్ల వృద్ధురాలిని సుప్రీంకోర్టు మాజీ సీజేఐ పేరు చెప్పి భయపెట్టిన నేరగాళ్లు, ఆమె నుంచి ఏకంగా రూ.3.71 కోట్లు కొల్లగొట్టారు. ఈ కేసులో ముంబై సైబర్ పోలీసులు ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఆగస్టు 18న బాధితురాలికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. తాము ముంబై కొలాబా పోలీస్ స్టేషన్ అధికారులమని, ఆమె బ్యాంకు ఖాతా ద్వారా మనీలాండరింగ్ జరిగిందని నిందితులు నమ్మించారు. ఆపై నిందితులు ఆన్‌లైన్‌లో నకిలీ కోర్టు విచారణను సృష్టించారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ లాగా వేషం వేసిన వ్యక్తి ముందు ఆమెను వీడియో కాల్‌లో ప్రవేశపెట్టారు. విచారణ పూర్తయ్యే వరకు నిరంతరం వీడియో కాల్‌లోనే ఉండాలని, ఎవరితోనూ మాట్లాడకూడదని ఆమెను ఆగస్టు 18 నుంచి అక్టోబరు 13 వరకు డిజిటల్ అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఇన్వెస్ట్‌మెంట్ల వెరిఫికేషన్ పేరుతో ఆమె నుంచి రూ.3.71 కోట్లను వివిధ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు.

భారతీయుల వర్క్ పర్మిట్లన్నీ రద్దు చేయాలి

» బంగ్లా సర్కారుకు ఇంకిలాబ్ మోంచా డిమాండ్

ఢాకా, డిసెంబరు 29: బంగ్లాదేశ్‌లో ఇటీవలి తిరుగుబాటుకు నేతృత్వం వహించిన ఇంకిలాబ్ మొంచా భారత్‌పై అక్కసు వెళ్లగక్కింది. ఆ దేశంలో భారతీయులందరికీ వర్క్ పర్మిట్లు రద్దు చేయాలని బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తమ నాయకుడు హాదీ హత్యతో సంబంధమున్న వారిని 24 రోజుల్లో పట్టుకుని శిక్షించాలని కోరింది. హాదీ హంతకులు మేఘాలయలోకి వెళ్లారని బంగ్లాదేశ్ పోలీసులు ఇటీవల పేర్కొన్న సంగతి తెలిసిందే. కాగా, బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరి 12న నిర్వహించనున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) నేత, మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు.. తరీఖ్ రెహ్మాన్ ఢాకా-17, బొగురా-6 నియోజకవర్గాల్లో నామినేషన్ వేశారు. ఇదిలా ఉండగా, బంగ్లాదేశ్‌లో మైనారిటీలు అయిన హిందువులపై దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి తర్వాత పిరోజ్‌పూర్ జిల్లా దుమ్రిటల గ్రామంలో కొందరు హిందువులకు చెందిన ఇళ్లకు బయటి నుంచి గడియపెట్టి మరీ నిప్పంటించారు.

వృద్ధాశ్రమంలో అగ్నిప్రమాదం..16మంది మృతి

జకార్తా, డిసెంబరు 29: ఇండోనేషియాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. సులవేసీ ద్వీపంలోని ఓ వృద్ధాశ్రమంలో ఆదివారం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో 16మంది వృద్ధులు సజీవ దహనమయ్యారు. తీవ్రంగా గాయపడ్డ ముగ్గురు వ్యక్తులు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి 8:30గంటలకు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందింది. వారు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. భారీ ఎత్తున మంటలు ఎగిసిపడటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకుంది. రాత్రి సమయం కావడంతో వృద్ధులంతా తమ గదుల్లో నిద్రిస్తున్నారని, మంటలు వేగంగా వ్యాపించడంతో చాలామంది బయటకు రాలేక అక్కడికక్కడే మృతి చెందారని అధికారులు తెలిపారు. అధికారులు, స్థానికులు సకాలంలో స్పందించి 12మందిని బయటకు తీసుకురాగలిగారు.

ఐదేళ్లుగా చీకటి గదుల్లో తండ్రి, కూతురు!

» తండ్రి మృతి.. ఎముకల గూడులా 27 ఏళ్ల కుమార్తె

» వారి కేర్‌టేకర్ల రాక్షసత్వం.. ఉత్తరప్రదేశ్‌లో ఘటన

లఖ్‌నవూ, డిసెంబరు 29: ఒకప్పుడు దర్జాగా బతికిన ఆ 70 ఏళ్ల పెద్ద మనిషి, ఆమె 27 ఏళ్ల కుమార్తెను వారి సంరక్షులు(కేర్ టేకర్లు) ఐదేళ్లుగా చిత్రహింసలు పెట్టారు. సరైన తిండి పెట్టకుండా, కనీస అవసరాలు తీర్చకుండా చీకటి గదుల్లో బంధించారు. చిక్కిశల్యమైపోయిన ఇద్దరిలో ఆ తండ్రి చివరికి ప్రాణాలొదిలాడు. ఆ కుమార్తె ఎముకలగూడుగా మారిన శరీరంతో కొన ఊపిరితో మిగిలింది. యూపీలోని మహోబా జిల్లాలో ఈ ఘోరం వెలుగుచూసింది. మృతిచెందిన ఆ 70 ఏళ్ల వృద్ధుడు ఓంప్రకాశ్ సింగ్ రాథోడ్. ఆయన కూతురు పేరు రష్మీ. ఓంప్రకాశ్ రిటైర్డ్ రైల్వే ఉద్యోగి. 2016లో ఆయన భార్య మృతిచెందాక.. తండ్రీకూతుళ్లు మరో ఇంటికి మారారు. అక్కడ వారి కేర్ టేకర్లుగా రాంప్రకాశ్ కుశ్వాహా, రామ్‌దేవి దంపతులను నియమించుకున్నారు. అయితే, ఆ కేర్‌టేకర్లు తండ్రీకూతుళ్లను సెల్లార్‌లోని చీకటి గదుల్లో బందీలుగా ఉంచేసి.. అన్ని సౌకర్యాలున్న ఇంట్లో విలాసవంతంగా జీవిస్తున్నారు. ఓంప్రకాశ్, రష్మీలను చూసేందుకు అప్పుడప్పుడూ బంధుమిత్రులు వచ్చినా, వారు ఎవర్నీ కలిసేందుకు ఇష్టపడటం లేదని ఆ కేర్‌టేకర్లు తిప్పిపంపేవారు.

సెంగార్ బెయిల్‌పై స్టే

(మొదటి పేజీ తరువాయి)

బాధితురాలిని కూడా చంపే ప్రయత్నం చేసిన సంఘటనల క్రమంలో ఢిల్లీ హైకోర్టు నిందితుడికి బెయిలు ఇవ్వడంపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో బెయిలును సవాలుచేస్తూ సీబీఐ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరిస్తూ సెంగార్ బెయిలును నిలిపివేసింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా ఒక నిందితుడికి కింది కోర్టు బెయిలు ఇచ్చినపుడు అతని వాదన వినకుండా బెయిలు రద్దు చేయరాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అయితే, ఈ కేసులో బెయిలు వచ్చినప్పటికీ వేరే కేసులో అతను ఇప్పటికీ జైల్లోనే ఉన్నందున ఈ కేసులో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో బెయిలు నిలిపివేత నిర్ణయం తీసుకుంటున్నట్లు వెల్లడించింది. సీబీఐ పిటిషన్‌పై 4వారాల్లో సమాధానం ఇవ్వాలని సెంగార్‌ను ఆదేశించింది. విచారణను జనవరి 20కి వాయిదా వేసింది. సీబీఐ తరఫున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ.. బాలిక మీద జరిగిన ఘోర అత్యాచారమని, బెయిలు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. పదిహేను సంవత్సరాల 10 నెలల వయస్సులో ఈ ఘాతుకానికి బలయిన బాలిక విషయంలో మనమంతా జవాబుదారులమేనని వ్యాఖ్యానించారు. సంఘటన జరిగినపుడు ఆ ప్రాంత ఎమ్మెల్యేగా ఉన్న సెంగార్ అక్కడ శక్తివంతుడైన వ్యక్తి అని చెప్పారు. ఢిల్లీ హైకోర్టు ఈ నెల 23న సెంగార్‌కు బెయిలు ఇచ్చినపుడు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(సి) కింద ఆయన మీద కేసు పెట్టారని, ఆ సెక్షన్‌లో పేర్కొన్న పబ్లిక్ సర్వెంట్ కిందకు ఎమ్మెల్యే రాడని అభిప్రాయపడింది. 5(సి) సెక్షన్ ప్రకారం పబ్లిక్ సర్వెంట్ తన అధికారాన్ని అడ్డం పెట్టుకొని బాలికపై అత్యాచారానికి పాల్పడితే తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. బీఎన్ఎస్ 21 ప్రకారం పబ్లిక్ సర్వెంట్ అంటే న్యాయమూర్తులు, పోలీసులు, ఇతర భద్రతా సిబ్బంది వస్తారు. ఇప్పుడు ఎమ్మెల్యే మీద 5(సి) సెక్షన్ పెట్టారు. ఎమ్మెల్యేకు 5సీ వర్తించదన్న వాదనను హైకోర్టు అంగీకరించింది. బాధితురాలు మైనర్ అయినందున పబ్లిక్ సర్వెంట్ అంటే ఎవరు అనే సాంకేతిక అంశాల జోలికి పోవద్దన్నది సీబీఐ వాదన అంతే కదా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అవునని సీబీఐ తరఫున తుషార్ మెహతా బదులిచ్చారు. పోక్సో చట్టానికి ఇతర చట్టాలేవైనా విరుద్ధంగా ఉంటే పోక్సో చట్టమే చెల్లుబాటు కావాలని అన్నారు. కేవలం 7 ఏళ్లు జైలులో ఉన్నారనే కారణాన్ని చూపుతూ హైకోర్టు బెయిల్ ఇవ్వడం సరికాదని చెప్పారు. సవరించిన చట్టం ప్రకారం 20 ఏళ్ల జైలు శిక్ష విధించాలని కోరారు. నేరం జరిగినప్పటికి ఆ చట్ట సవరణ రాలేదు కదా? అని సీజేఐ ప్రశ్నించారు. "ఆర్మీ అధికారి విధుల్లో ఉండి తప్పు చేస్తే ఎలా శిక్షార్హుడో, ఎమ్మెల్యే కూడా అంతే. సెంగార్ బయటకు వస్తే సాక్షులను ప్రభావితం చేస్తారు. బాధితురాలి తండ్రి, బంధువుల హత్య కేసులోనూ సెంగార్ దోషిగా తేలారు. శిక్ష అనుభవిస్తున్నాడు. బయటికి వస్తే బాధితురాలికి తీరని అన్యాయం జరిగినట్లే. బాధితురాలికి మనం అండగా ఉన్నామని చెప్పడం ఎంతో ముఖ్యం" అని తుషార్ మెహతా వాదించారు.



సెంగార్



సుప్రీంకోర్టు ఆవరణలో ఉన్నావ్ బాధితురాలు

పట్వారీ పబ్లిక్ సర్వెంట్... ఎమ్మెల్యే కాదా?

సెంగార్ తరఫు న్యాయవాదులు బెయిలును రద్దు చేయొద్దని కోరారు. సెంగార్ న్యాయవాదుల వాదనలోనూ బలం ఉందని, అయితే, ఇప్పుడు బెయిలు రద్దు చేస్తున్నది కూడా ఈ అంశాన్ని నిశితంగా పరిశీలించేందుకేనని సుప్రీంకోర్టు చెప్పింది. అయితే, సెంగార్ న్యాయవాదులు చెప్పినట్లు చట్టాన్ని సాంకేతికంగానే తీసుకుంటే ఊళ్లో పట్వారీ, స్టేషన్లో కానిస్టేబుల్ కూడా పబ్లిక్ సర్వెంట్‌గా ఈ సెక్షన్ పరిధిలోకి వస్తున్నారని, ఎంపీ, ఎమ్మెల్యే రావడం లేదని, ఇది ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించింది. హైకోర్టులో తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులిద్దరూ భారత న్యాయవ్యవస్థలోని శ్రేష్ఠమైన న్యాయమూర్తుల్లో భాగమని, వాళ్లు లోతైన విశ్లేషణ చేశారని, అయితే, అందరం మానవమాత్రులమేనని, ఎవరైనా పొరపాటు చేసే అవకాశం ఉందని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు తీర్పు మీద బాధితురాలికి కూడా స్పెషల్ లీవ్ పిటిషన్ వేసే అధికారం ఉందని చెప్పింది. హైకోర్టు న్యాయమూర్తులను లక్ష్యంగా చేసుకొని, జాతీయ మీడియాలో, సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తున్నారని, దీన్ని ఆపాలని సెంగార్ తరఫు న్యాయవాది సూచించారు. ఈ కేసులో రాజకీయ లబ్ధి కోసం కొందరు ప్రయత్నిస్తున్నారని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

అద్వానీ కేసు ప్రస్తావన

సీబీఐ పిటిషన్‌లో అద్వానీ కేసును, అప్పట్లో సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక ఉత్తర్వులను ప్రస్తావించింది. 1997లో రాజకీయ నాయకులపై వచ్చిన జైన్ డైరీ అవినీతి ఆరోపణల కేసులో ఎంపీలు, ఎమ్మెల్యేలు పబ్లిక్ సర్వెంట్లు అవుతారా? కాదా? అనే ప్రశ్న తలెత్తింది. అప్పుడు సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు(ఎంపీలు, ఎమ్మెల్యేలు) అవినీతి నిరోధక చట్టం ప్రకారం కచ్చితంగా పబ్లిక్ సర్వెంట్ల కిందికే వస్తారని తేల్చి చెప్పింది. అవినీతి వంటి ఆర్థిక నేరాలకే ఎమ్మెల్యేలను పబ్లిక్ సర్వెంట్లుగా పరిగణిస్తున్నప్పుడు చిన్న పిల్లలపై జరిగే లైంగిక దాడుల వంటి తీవ్రమైన నేరాల విషయంలో వారిని ఆ పరిధి నుంచి ఎలా మినహాయిస్తారని సీబీఐ తన పిటిషన్‌లో ప్రస్తావించింది.

మరణశిక్ష పడే వరకూ పోరాటం ఆగదు..

సెంగార్‌కు మరణశిక్ష పడే వరకూ తన పోరాటం ఆగదని బాధితురాలు తెలిపారు. సెంగార్‌కు ఉరిశిక్ష పడినప్పుడే తన తండ్రికి, తనకు న్యాయం జరుగుతుందని తెలిపారు. దేశ అత్యున్నత న్యాయస్థానంపై తనకు అపారమైన నమ్మకం ఉందన్నారు. మరోవైపు, తన తండ్రికి న్యాయం కావాలని కోరుతూ సెంగార్ కుమార్తె ఇషిత ఎక్స్ వేదికగా బహిరంగ లేఖ విడుదల చేశారు. తన తండ్రి ఎదుర్కొంటున్న విచారణ కారణంగా తన కుటుంబానికి బెదిరింపులు వస్తున్నాయని లేఖలో స్పష్టం చేశారు. ఒక కూతురిగా ఎంతో అలసిపోయానని, ఇంకా చిన్న ఆశ ఏదో మిగిలివుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సుప్రీం నిర్ణయాన్ని మహిళా కాంగ్రెస్ స్వాగతించింది. ఇది న్యాయానికి దక్కిన విజయమని మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబా అన్నారు. సెంగార్‌ను రక్షించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాగా, హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ నిరసన తెలిపేందుకు వచ్చిన వందల మంది మహిళా కాంగ్రెస్ కార్యకర్తలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

లోకం తీరు



ఆరావళిపై మరింత అధ్యయనం

» నవంబరు 20 నాటి తీర్పును నిలిపేసిన సుప్రీం

న్యూఢిల్లీ, డిసెంబరు 29: దేశంలోనే అత్యంత పురాతనమైన ఆరావళి పర్వతాలకు సరికొత్త నిర్వచనం ఇస్తూ గత నవంబరు 20వ తేదీన ఇచ్చిన తన సొంత తీర్పును సుప్రీంకోర్టు నిలుపుదల చేసింది. ఆరావళి పర్వతాల ఎత్తు, శ్రేణిపై ప్రభుత్వం నియమించిన కమిటీ నివేదికలోనూ.. దానిపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోనూ మరింత స్పష్టత అవసరమని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సెలవు కాల ధర్మాసనం సోమవారం అభిప్రాయపడింది. ఆరావళి పర్వతాలకు ఇచ్చిన కొత్త నిర్వచనం, దాని వల్ల ఏర్పడే పర్యావరణ ప్రభావంపై మరింత లోతుగా అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీని నియమించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 21వ తేదీకి వాయిదా వేసింది. గుజరాత్, హరియాణా, రాజస్థాన్, ఢిల్లీలో విస్తరించిన ఆరావళి పర్వతాల్లో మైనింగ్‌కు అనుమతులు ఇచ్చే అంశంపై స్పష్టత కోసం కేంద్రం గతంలో ఉన్నతాధికారులతో ఓ కమిటీని వేసిన విషయం తెలిసిందే. ఆ కమిటీ తన నివేదికలో ఆరావళిలో 100 మీటర్ల కంటే ఎత్తులో ఉన్న వాటిని మాత్రమే 'కొండలు' అని నిర్వచనం ఇచ్చింది. 500 మీటర్ల పరిధిలో ఇలాంటి కొండలు రెండు.. అంతకంటే ఎక్కువ ఉంటేనే దానిని 'ఆరావళి పర్వత శ్రేణి' అని పిలవాలని సూచించింది. 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న గుట్టల్లో మైనింగ్‌కు అనుమతి ఇచ్చుకోవచ్చని తెలిపింది. ఈ కమిటీ నివేదికకు సుప్రీంకోర్టు ఆమోదం తెలపటంతో పర్యావరణ వేత్తలు, ప్రతిపక్ష పార్టీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నిర్వచనం వల్ల ఆరావళి పర్వతాల్లో విచ్చలవిడిగా మైనింగ్‌కు అనుమతులు ఇచ్చే ప్రమాదం ఉందని విమర్శలు వచ్చాయి. దీంతో ఈ అంశాన్ని సుమోటో కేసుగా స్వీకరించిన సుప్రీంకోర్టు.. తన ఆదేశాలను తానే నిలిపివేసింది.

వలస కార్మికుడిపై కత్తులతో టీనేజర్ల దాడి

బాధితుడు మహారాష్ట్ర వాసి..చెన్నై వద్ద ఘటన

చెన్నై, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాజధాని చెన్నై సమీపంలో ఒక వలస కార్మికుడిపై నలుగురు టీనేజర్లు దాడి చేశారు. విషయం వెలుగులోకి రావడంతో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై నుంచి తిరుత్తణికి వెళ్తున్న సబర్బన్ రైలులో నలుగురు బాలుర బృందం ఒక వలస కార్మికుడిని వేదిస్తూ, దాడి చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ఇటీవల వైరల్ అయ్యాయి. నిందితుల్లో ఒకరు కత్తి చూపిస్తూ, ఒక తమిళపాటను బ్యాక్‌గ్రౌండ్ సౌండ్‌గా ఉపయోగించాడు. మరో వీడియోలో నిందితులు ఒక ఇంటి సమీపంలో బాధితుడిపై కత్తులతో దాడి చేయడం కనిపించింది. దాడి చేసిన వారిలో ఒకరు బాధితుడి పక్కన విక్టరీ గుర్తు చూపిస్తూ పోజు ఇచ్చాడు. ఈ దాడిలో బాధితుడు తీవ్రంగా గాయపడి, రక్తస్రావంతో ఉన్నాడు. అతడు ప్రస్తుతం తిరువళ్లూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు మహారాష్ట్రకు చెందిన కూలీగా పోలీసులు గుర్తించారు. కాగా, 17 ఏళ్ల వయసుగల నలుగురు నిందితులను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారిలో ముగ్గురిని చెంగల్పట్టులోని బాలల సంరక్షణ గృహానికి పంపగా, నాలుగో నిందితుడిని అతడి చదువును దృష్టిలో ఉంచుకుని కోర్టు బెయిల్‌పై విడుదల చేసింది. ఈ వ్యవహారంపై ప్రతిపక్ష నేతలతో పాటు కాంగ్రెస్ నేత కార్తి చిదంబరం స్పందించారు. తమిళనాడు పోలీసులు తమ సత్తాను నిరూపించుకోవాల్సిన సమయం వచ్చిందని, రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే 'శక్తి ప్రదర్శన' ఆపరేషన్ అవసరమని అభిప్రాయపడ్డారు.

చైనీయుడివా అంటూ.. త్రిపుర విద్యార్థిపై మూకదాడి!

తీవ్ర గాయాలతో 17 రోజులు మృత్యువుతో పోరాడి మరణించిన చక్మా



అంజెల్ చక్మా(ఫైల్)

» డెహ్రాడూన్‌లో దారుణం

» మృతుడు ఎంబీఏ ఫైనలియర్ విద్యార్థి

» అతడి తండ్రి బీఎస్ఎఫ్ జవాన్

న్యూఢిల్లీ, డిసెంబరు 29: ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో త్రిపురకు చెందిన 24 ఏళ్ల విద్యార్థి అంజెల్ చక్మా మూకదాడికి గురై తీవ్ర గాయాలతో మరణించిన ఘటనపై తీవ్ర నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఆది, సోమవారాల్లో వేలాదిమంది విద్యార్థులు ఢిల్లీతోపాటు త్రిపుర తదితర ఈశాన్య రాష్ట్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఎంబీఏ ఫైనలియర్ విద్యార్థి అయిన అంజెల్ చక్మా తన సోదరుడు మైఖేల్ చక్మాతో కలిసి ఈ నెల 9వ తేదీన డెహ్రాడూన్‌లో రోడ్డు పక్కన ఉన్న ఓ దుకాణం వద్ద ఉన్నప్పుడు.. ఆరుగురు దుండగులు ఆయనను చైనీయుడు, చింకీ, మొమో అంటూ గేలి చేశారు. దీనిని అంజెల్ ప్రతిఘటించటంతో.. అతడి మీద కత్తితో, ముంజేయి కడియంతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అంజెల్‌ను స్థానికంగా ఆస్పత్రిలో చేర్పించారు. 17 రోజులపాటు మృత్యువుతో పోరాడి ఆ యువకుడు ఈ నెల 26వ తేదీన మరణించాడు. అంజెల్ తల, కాళ్లు, చేతుల మీద తెగిన గాయాలున్నాయని, వెన్నెముక తీవ్రంగా దెబ్బతిన్నదని, శరీరం కుడివైపు పూర్తిగా స్పందన లేకుండా పోయిందని వైద్యులు నివేదికలో తెలియజేశారు. జరిగిన దారుణంపై అంజెల్ చక్మా తండ్రి, బీఎస్ఎఫ్ జవాను అయిన తరుణ్ ప్రసాద్ చక్మా స్పందిస్తూ.. తన కుమారుడిని చైనీయుడు అని అవమానిస్తూ దాడి చేసి కొట్టారని, ఈ ఘటనలో అతడి మెడ విరిగిపోయిందని, దానివల్లే మరణించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత దారుణం జరిగినా కూడా, తన చిన్నకుమారుడు మైఖేల్ ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ దాఖలు చేయటానికి ఉత్తరాఖండ్ పోలీసులు తొలుత నిరాకరించారని, జరిగిన ఘటన చిన్నది అంటూ తోసిపుచ్చారని తెలిపారు. తాము త్రిపుర నుంచి వచ్చి పోలీసులతో మాట్లాడిన తర్వాత, 'ఆలిండియా చక్మా విద్యార్థుల సంఘం' ఒత్తిడి తెచ్చిన అనంతరం ఎఫ్ఐఆర్ దాఖలు చేశారని చెప్పారు. 'అనేక మంది ఈశాన్య రాష్ట్రాల నుంచి విద్య, ఉద్యోగాల కోసం ముంబై, ఢిల్లీ, బెంగళూరు తదితర నగరాలకు వెళ్తుంటారు. వారిని అవమానించటం తగదు. మనమంతా భారతీయులం' అని తరుణ్ ప్రసాద్ పేర్కొన్నారు. తరుణ్ ప్రసాద్‌తో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి మాట్లాడారు. జరిగిన ఘటనపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటనలో ఇప్పటికే ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారని, మరొకడు నేపాల్‌కు పారిపోయినట్లు తెలుస్తోందన్నారు.

విద్వేషం సాధారణమైపోయింది: రాహుల్

అంజెల్ చక్మా మృతిపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ స్పందిస్తూ.. 'ఇది అత్యంత భయానకమైన విద్వేషపూరిత నేరం. విద్వేషం అనేది రాత్రికి రాత్రే మొదలు కాదు. గత కొన్నేళ్లుగా ప్రతి రోజూ దేశ ప్రజలకు ముఖ్యంగా యువతకు విషపూరిత, బాధ్యతారహిత సమాచారాన్ని ఆహారంలాగా అందిస్తున్నారు. దేశాన్ని పాలిస్తున్న బీజేపీ అగ్రనేతలు స్వయంగా ఈ విద్వేష ప్రచారం చేస్తూ దీనిని ఒక సాధారణ పరిస్థితి అన్నట్లు తయారుచేశారు' అని విమర్శించారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ స్పందిస్తూ.. మన దేశ వైవిధ్యతను గౌరవించుకోలేని అజ్ఞానం, తప్పుడు అభిప్రాయాల కారణంగానే ఈ ఘటన జరిగిందని, ఇది విషాదం మాత్రమే కాదు.. దేశానికే సిగ్గుచేటైన దారుణమని అభివర్ణించారు. అంజెల్ హత్యను త్రిపుర, అస్సాం, మేఘాలయ రాష్ట్రాల సీఎంలు తీవ్రంగా ఖండించారు.

పురాతన శిల్పంలా.. ఐఎన్ఎస్‌వీ కౌండిన్య



పోర్‌బందర్, డిసెంబరు 29: హైలెస్సో.. హైలోస్సా.. అని పదం కలిపి తెడ్లు వేస్తూ, గాలి వాలుతో తెరచాపల ఆధారంగా నడిచే ఓడను ఇప్పుడు తయారు చేస్తే ఎలా ఉంటుంది. అది అచ్చం ఐఎన్ఎస్‌వీ కౌండిన్యలా ఉంటుంది. ఎలాంటి ఇంజిన్ లేకుండా పురాతన కాలం నాటి సంప్రదాయ నౌకాయాన విధానంలో నడిచే కౌండిన్య నౌకను మన నౌకాదళం తయారు చేసింది. ఈ నౌక తొలి ప్రయాణం గుజరాత్ తీరం నుంచి మస్కట్‌కు సోమవారం ప్రారంభమైంది. పురాతన కాలంనాడు ఓడలను తయారు చేసిన స్ఫూర్తి, అల్లిక పరిజ్ఞానం, ప్రకృతి సిద్ధమైన వస్తుసామగ్రితో ఈ నౌకను రూపొందించారు. భారతీయ నౌకా చరిత్ర, కళాత్మక తయారీ, ఆధునిక నౌకా నైపుణ్యం కలయికే ఐఎన్ఎస్ కౌండిన్య. 18 మంది నావికులతో ప్రయాణం ప్రారంభించిన ఈ నౌక 1400 కి.మీ. ప్రయాణించి 15 రోజుల అనంతరం ఒమన్ తీరానికి చేరుతుంది.

కౌండిన్య ప్రత్యేకతలు ఇవీ..

- అజంతా గుహల్లో సామాన్య శకం 5వ శతాబ్దంలో తీర్చిదిద్దిన ఓడ చిత్రం ఆధారంగా కేరళకు చెందిన కార్మికులు చెక్క పలకలతో కౌండిన్యను తయారు చేశారు.
- ఎక్కడా మేకులు లాంటివి వాడకుండా తాళ్లతో చెక్కలను జత చేసినందుకు దీనిని 'స్టిచ్‌డ్ షిప్' అని పిలుస్తున్నారు. చెక్క పలకలను జత చేయడానికి కొబ్బరి తాళ్లు, పీచు, సహజసిద్ధ జిగురును వాడారు. నౌక పొడవు 65అడుగులు, వెడల్పు 22అడుగులు,ఎత్తు 13 అడుగులు.
- భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, నేవీ, హోడీ ఇన్నోవేషన్స్ మధ్య త్రైపాక్షిక ఒప్పందం మేరకు 2023లో దీని తయారీ ప్రారంభించారు.
- పూర్వ కాలంలో మన దేశం నుంచి ఆగ్నేయాసియా దేశాలకు ఓడలను నడిపిన దిగ్గజ నావికుడు కౌండిన్య పేరును ఈ నౌకకు పెట్టారు.
- నౌక తెరచాపలపై గండభేరుండ పక్షి, సూర్యుడి రూపాలను చిత్రించారు. ముందు భాగంలో సింహ యాళి ప్రతిరూపాన్ని తీర్చిదిద్దారు. హరప్పా శైలికి ప్రతి రూపంగా ఉండే లంగరు బొమ్మను డెక్‌పై ఉంచారు.

తైవాన్ చుట్టూ చైనా విన్యాసాలు

జస్టిస్ మిషన్-2025 డ్రిల్‌తో పెరిగిన ఉద్రిక్తతలు

తైపీ, బీజింగ్, డిసెంబరు 29: జస్టిస్ మిషన్-2025 పేరిట తైవాన్ జలసంధి చుట్టూ చైనా వైమానిక, నౌకాదళ భారీ విన్యాసాలు చేపట్టింది. పెద్ద ఎత్తున బలగాలను తరలించడంతో పాటు యుద్ధ నౌకలను, ఫైటర్ జెట్ విమానాలను మోహరించింది. సముద్ర, గగనతల యుద్ధ సన్నద్ధతలో భాగంగా ఈ విన్యాసాలు చేపట్టినట్లు చైనాకు చెందిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ప్రకటించింది. తమ ద్వీపానికి సమీపంగా చైనా మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, నౌకలు వస్తున్నట్లు గుర్తించామని తైవాన్ తెలిపింది. బీజింగ్ దుందుడుకు చర్యలకు పాల్పడుతోందని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అవసరమైతే తైవాన్‌కు సైనికపరంగా అండగా ఉంటామని జపాన్ ప్రధాని తకాయిచి ఇటీవల వ్యాఖ్యానించడం చైనాకు ఆగ్రహం తెప్పించింది. దీనికి తోడు తైపీకి 11 బిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన ఆయుధాలను సరఫరా చేస్తామన్న అమెరికా ప్రకటనతో ఉద్రిక్తతలు పెరిగాయి.

పుతిన్ నివాసాలపై దాడికి ఉక్రెయిన్ ప్రయత్నం!

మాస్కో, డిసెంబరు 29: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసాలపై దాడికి ఉక్రెయిన్ ప్రయత్నించినట్టు సోమవారం ప్రభుత్వం ప్రకటించింది. మాస్కో, సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని నివాసాలపై దాడులకు యత్నించిందని తెలిపింది. మాస్కో ఉత్తర భాగంలోని నొవ్‌గొరొడ్‌లో ఉన్న పుతిన్ నివాసంపై ఆదివారం-సోమవారం మధ్యరాత్రి దాడి చేసేందుకు 91 లాంగ్ రేంజ్ డ్రోన్లను ఉపయోగించిందని విదేశాంగ శాఖ మంత్రి సెర్గీ లావ్రోవ్ వెల్లడించారు. అయితే ఎలాంటి నష్టం జరగలేదని, అన్ని డ్రోన్లను కూల్చివేశామని తెలిపారు. శాంతి చర్చలను భగ్నం చేయడానికే ఈ చర్యకు పాల్పడిందని ఆరోపించారు. దాడి విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు పుతిన్ ఫోన్ చేసి చెప్పారని విదేశీ విధానాల సహాయకుడు యూరీ ఉషాకోవ్ చెప్పారు. అయితే, దాడి ఆరోపణలను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఖండించారు.

తిరుమలలో తెరుచుకున్న వైకుంఠ ద్వారాలు

నేటి నుంచి పది రోజులు కొనసాగనున్న దర్శనాలు

తిరుమల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి(ముక్కోటి) సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దాటాక వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. సోమవారం రాత్రి 11.30 గంటలకు ఏకాంత సేవ నిర్వహించి తలుపులు మూసివేశారు. తిరిగి అర్ధరాత్రి 12.05 గంటల సమయంలో తిరుప్పావై పాశురాలతో ఆలయంలోని బంగారువాకిలి తలుపులు తెరిచారు. అనంతరం 12.30 గంటల సమయంలో వైకుంఠ ద్వారం వద్ద అర్చకులు పూజలు, హారతి సమర్పించి తోమాలపటంతో ప్రదక్షిణగా గర్భాలయానికి చేరుకుని మూలవిరాట్టుకు పుష్ప సమర్పణ చేశారు. తర్వాత ధనుర్మాస ప్రత్యేక కైంకర్యాలు, నిత్య కైంకర్యాలు నిర్వహించిన అనంతరం 1.30 గంటలకు వీఐపీ బ్రేక్ దర్శనాలు ప్రారంభించారు. ఉదయం 5.30-6 గంటల మధ్య స్లాటెడ్ సర్వ దర్శనాలు మొదలుకానున్నాయి. ఇక, మంగళవారం ఉదయం ఆలయ మాడవీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి స్వర్ణ రథంపై దర్శనమివ్వనున్నారు. జనవరి 8వ తేదీ అర్ధరాత్రి వరకు పదిరోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు కొనసాగుతాయి. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో చేసిన విద్యుత్, పుష్పాలంకరణలు కనువిందు చేస్తున్నాయి.



సోమవారం సాయంత్రం ఆలయం వద్ద మోస్తరుగా ఉన్న భక్తులు



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, చిత్రంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు తదితరులు

తిరుమల చేరుకున్న తెలంగాణ సీఎం

శ్రీవారి దర్శనార్థం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా కుటుంబ సమేతంగా తిరుపతి ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆయనకు రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్ స్వాగతం పలికారు. అనంతరం రేవంత్‌రెడ్డి మంత్రులతో కలిసి తిరుమలలోని గాయత్రి అతిథి గృహానికి చేరుకోగా టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. కాగా, రేవంత్‌రెడ్డి మంగళవారం వేకువజామున శ్రీవారిని దర్శించుకుని అనంతరం వైకుంఠ ద్వార ప్రవేశం చేయనున్నారు.

మోస్తరుగానే రద్దీ

సాధారణంగా వైకుంఠ ఏకాదశి ముందు రోజు మధ్యాహ్నం నుంచే తిరుమలకు భక్తులు పోటెత్తుతారు. అయితే ఈసారి తిరుమలలో భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. గతేడాది చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటన నేపథ్యంలో టోకెన్లు ఆన్‌లైన్‌లో జారీ చేయడం, టోకెన్లు ఉన్నవారికే తొలి మూడురోజుల దర్శనం ఉంటుందని విస్తృత ప్రచారం కల్పించిన నేపథ్యంలో తిరుమల కొండ సోమవారం సాయంత్రం వరకు నిర్మానుష్యంగా కనిపించింది. సాయంత్రం తర్వాత మంగళవారం ఏకాదశి టోకెన్లు పొందిన భక్తులు చేరుకోవడంతో మోస్తరు రద్దీ నెలకొంది. ఇక, సోమవారం మధ్యాహ్నానికే క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు ఖాళీ కావడంతో గంటలోనే భక్తులకు దర్శనం పూర్తయింది.



మెర్లిన్ యోయిస్ రేయ్ రిచర్డ్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామకృష్ణారెడ్డి, ఏపీ మాజీ అడ్వొకేట్ జనరల్ డి.శ్రీనివాస్, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కెఎస్ హేమలేఖ, బాంబే హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ డీ ధనుక, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజాసింగ్, జపనీస్ కౌన్సులేట్ హెడ్ చెన్నై మెర్లిన్ యోయిస్ రేయ్ రిచర్డ్, కర్ణాటక మంత్రి మల్లికార్జున్ తదితరులున్నారు.

వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు

- పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించడానికి, కాలుష్య రహిత నగరాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే సూచించారు. సోమవారం విజయవాడలోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంలో భాగంగా జరిగిన వాయు నాణ్యత పర్యవేక్షణ కమిటీ 5వ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాంతిలాల్ దండే మాట్లాడుతూ విజయనగరం, శ్రీకాకుళం, అనంతపురం, కర్నూలు, చిత్తూరు నగరాల్లో కాలుష్య నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలని ఆయా మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. వాయు నాణ్యత తక్కువగా ఉన్న మున్సిపాలిటీల్లో గాలి నాణ్యతకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు.

అంటువ్యాధుల నియంత్రణకు టాస్క్‌ఫోర్స్

- 24 మందితో ఏర్పాటు: మంత్రి సత్యకుమార్
- ముందస్తు చర్యల ప్రణాళిక రూపకల్పన బాధ్యత

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అంటువ్యాధుల నియంత్రణ చర్యలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ టాస్క్‌ఫోర్స్‌కు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ చైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. కమిటీలో మొత్తం 24 మంది సభ్యులుంటారు. సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధరబాబు, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ, మున్సిపల్ శాఖ కమిషనర్ సంపత్‌కుమార్, వ్యవసాయ శాఖ కమిషనర్ మంజీర్ జిలానీ, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రీజనల్ డైరెక్టర్ అనురాధ, అంటువ్యాధుల నిపుణులు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఇతర అధికారులు టాస్క్‌ఫోర్స్‌లో సభ్యులుగా ఉంటారు. డెంగీ, మలేరియా, డయేరియా, టీబీ, లెప్రసీ, ఐతార లాంటి అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు, అకస్మాత్తుగా వ్యాధులు వ్యాప్తి చెందినప్పుడు తక్షణ చర్యలపై టాస్క్‌ఫోర్స్ కమిటీ అధ్యయనం చేసి, వ్యూహాత్మక ప్రణాళిక రూపొందిస్తుంది. ఆస్పత్రుల సన్నద్ధత, ప్రభుత్వ శాఖల సమన్వయం, కేంద్ర మార్గదర్శకాల అమలు, ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ల విధులు ఈ ప్రణాళికలో ఉంటాయి. కమిటీ ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై అంటువ్యాధులపై సమీక్ష చేస్తుంది.

తుంగభద్ర గేట్ల బిగింపు జూన్ నాటికి పూర్తి

- బోర్డు సమావేశంలో నిర్ణయం
- నెలకు ఐదు లేదా ఆరు గేట్లు ఏర్పాటు

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జూన్ నాటికి తుంగభద్ర డ్యామ్ 33 గేట్లనూ బిగించడం పూర్తి చేయాలని తుంగభద్ర బోర్డు నిర్ణయించింది. చైర్మన్ డీఎం రాయపూరే అధ్యక్షతన సోమవారం నిర్వహించిన బోర్డు సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. గతేడాది ఆగస్టు 10న భారీ వరదకు తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకు పోయింది. దీంతో కృష్ణా జలాలు వృథాగా కిందకుపోయాయి. డ్యామ్‌గేట్ల తయారీ, బిగింపులో నిపుణుడైన కన్నయ్యనాయుడి సహాయం కోరడంతో హైదరాబాద్ నుంచి ఆయన హుటాహుటిన డ్యామ్ వద్దకు చేరుకుని మరమ్మతులు చేపట్టారు. వరద సమయంలోనే తాత్కాలిక గేటును బిగించారు. తర్వాత డ్యామ్ 33 గేట్లనూ మార్చాలని బోర్డు నిర్ణయం తీసుకుంది. వెనువెంటనే టెండర్లు పిలిచి తయారీ సంస్థకు బాధ్యత అప్పగించారు. కాగా, వచ్చే ఏడాది జూన్ నాటికి గేట్ల బిగింపు పూర్తి చేయాలని సోమవారం బోర్డు సమావేశంలో తీర్మానించారు. సమావేశానికి రాష్ట్రం తరఫున జల వనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి హాజరయ్యారు. అలాగే, సోమవారం ఒక గేటును బిగించే కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. నెలకు ఐదు లేదా ఆరు గేట్ల చొప్పున 33 గేట్లనూ జూన్ నాటికి బిగించడం ద్వారా గరిష్ఠ సామర్థ్యంలో 105.78 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. కొత్త గేట్లతో డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వతో పటిష్ఠంగా ఉంటుందని జల వనరుల శాఖ అధికారులు తెలిపారు.


ముగిసిన భారతీయ విజ్ఞాన సమ్మేళనం



సైన్స్ ఎక్స్‌పోకు తరలివచ్చిన విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహించిన ఏడవ భారతీయ విజ్ఞాన సమ్మేళనం సోమవారం ముగిసింది. నాలుగు రోజుల పాటు వివిధ ప్రాంతాల శాస్త్రవేత్తలు, నిపుణులు, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రతినిధులు పోస్టర్, ఓరల్, పేపర్, పీపీటీ ప్రజెంటేషన్స్ ఇచ్చారు. ఇందులో ఉత్తమమైన వాటికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ సమ్మేళనంలో పాల్గొన్న ప్రతినిధులకు జ్ఞాపికతో నిర్వాహకులు సత్కరించారు. నాలుగు రోజుల పాటు నాలుగు సమాంతర వేదికలపై 1500 మంది ప్రతినిధులు ప్రసంగాలు, పరిశోధన పత్రాల సమర్పణ చేశారు. 80 ప్రముఖ పరిశోధన, విజ్ఞాన సంస్థలు నిర్వహించిన ప్రత్యేక ప్రదర్శన అందరికీ ఎంతో విజ్ఞానాన్ని పంచింది. దేశంలోని 60 మంది ప్రముఖ యూనివర్సిటీలు, రీసెర్చ్ సెంటర్స్ నుంచీ వీసీలు, ఇతర అధికారులు ప్రతినిధులుగా పాల్గొన్నారు. మన దేశంలోని అన్ని రంగాల్లో భారతీయ జ్ఞాన పరంపరను కొనసాగించేందుకు చేపట్టవలసిన చర్యలపై ఈ సమ్మేళనంలో అర్థవంతమైన చర్చ సాగింది. చివరి రోజున 'శాస్త్ర సాంకేతిక విద్యలోనూ భారతీయ జ్ఞానపరంపరపై ప్రత్యేక చర్చాగోష్ఠి నిర్వహించారు. భారతీయ జ్ఞాన పరంపర భూమికతో, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన సమన్వయంతో సరికొత్త ఆవిష్కరణలు జరగాలని వక్తలు అభిప్రాయపడ్డారు. సంస్కృతంలో ఉన్న శాస్త్ర జ్ఞానాన్ని ఆధునిక టెక్నాలజీని సమన్వయం చేస్తూ ముందుకు పోవాలని నిపుణులు సూచించారు. చివరి రోజున సైన్స్ ఎక్స్‌పో వీక్షణకు విద్యార్థులు తరలివచ్చారు.

శ్రీకాకుళంలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం



శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి అవమానం జరిగింది. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేశారు. స్థానికులు సోమవారం ఉదయం విగ్రహానికి చేయి పాక్షికంగా విరిగి ఉండడాన్ని గమనించి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ పైడిపునాయుడు, ఎస్ఐ హరికృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. దగ్గరలో ఉన్న సీసీ పుటేజ్‌ల ఆధారంగా ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తులు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మద్యం మత్తులో విగ్రహంపై దాడి చేసి ఉంటారా? ఉద్దేశపూర్వకంగా చేసి ఉంటారా? అన్న అనుమానంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు విగ్రహం చేతిని ధ్వంసం చేయడం గుర్తించారు.

తీరు మారిన 'ఈశాన్యం'

- రోజుల తరబడి వర్షాభావం
- సాగుకు సహకరించని రుతుపవనాలు
- తుఫాన్ల ప్రభావంతోనే కుమ్మరింత
- కనిపించని ముసురు వర్షాలు
- జాడలేని తూర్పు గాలులు
- దీర్ఘకాలం కొనగుతున్న చలి తీవ్రత
- రేపటితో ముగియనున్న సీజన్



విశాఖపట్నం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలోని ఐదు వాతావరణ సబ్‌డివిజన్‌లలో వర్షాలకు దోహదపడే ఈశాన్య రుతుపవనాలు విఫలమయ్యాయా? అంటే అవుననే చెబుతున్నారు కొందరు వాతావరణ నిపుణులు. బంగాళాఖాతంలో తుఫాన్ల సమయంలో మినహా మిగిలిన రోజుల్లో వర్షాల జాడ కనిపించలేదు. దక్షిణ తమిళనాడులోని డెల్టా ప్రాంతంలో కొన్ని రోజులు మోస్తరు వర్షాలు కురిశాయి తప్ప ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా, రాయలసీమ, దక్షిణ కర్ణాటకల్లో ముసురువర్షాలు కురవలేదు. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో తుఫాన్ల తర్వాత ఎక్కువగా వర్షాలకు కారణమైన తూర్పు గాలుల ప్రభావం ఒకటి, రెండు వారాలు తప్ప మిగిలిన రోజులు కనిపించలేదు. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల సీజన్ తీరుమారిందని నిపుణులు అంటున్నారు. ఈ సీజన్‌లో కురిసే వర్షాలతోనే తమిళనాడు, రాయలసీమలోని కొన్ని జిల్లాలు, దక్షిణ కోస్తాలోని నెల్లూరు, దక్షిణ ప్రకాశం జిల్లాలు, కేరళ, కర్ణాటకలోని దక్షిణ ప్రాంతంలో ఎక్కువగా వ్యవసాయం జరుగుతుంది. ఇంకా తాగునీటికి అవసరమైన చెరువులు, రిజర్వాయర్లు నీటితో కళకళలాడాలి. అటువంటిది ఒకేసారి తుఫాన్లతో నీళ్ల కుమ్మరింత మినహా రైతులకు ఉపయోగపడే వర్షాలు కురవలేదు. ఈ ఏడాది తుఫాన్లు లేకపోతే ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో తీవ్ర వర్షాభావం కొనసాగి ఉండేది. అక్టోబరు నెల రెండో వారం వరకు నైరుతి రుతుపవనాలు కొనసాగడం కూడా ఈశాన్య రుతుపవనాలపై ప్రభావం చూపిందని నిపుణులు అంటున్నారు. ఈ ఏడాది అక్టోబరు 16న దక్షిణాదిలో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించాయి. వాతావరణ శాఖ లెక్కల మేరకు డిసెంబరు 31తో ఈశాన్య రుతుపవనాల సీజన్ ముగియనున్నది. అక్టోబరు చివరి వారంలో వచ్చిన మొంథా, నవంబరు చివరిలో వచ్చిన దిత్వా తుఫాన్ల ప్రభావంతో ఏపీ, తమిళనాడుల్లో వర్షాలు కురిశాయి. ఆ తర్వాత డిసెంబరు తొలివారం నుంచి వర్షాలు నిలిచిపోయాయి. ఈ నెల మూడో వారంలో తమిళనాడు డెల్టా ప్రాంతంలో కొన్ని రోజులు వర్షాలు కురిశాయి. ఆ తర్వాత వర్షాల జాడలేదు. ఏపీ వరకు చూస్తే ఈ నెల తొలివారంలో తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో రెండుమూడు రోజులు వర్షాలు కురిశాయి. అప్పటి నుంచి రాష్ట్రంలో వర్షాలు లేకపోవడంతో చలితీవ్రత పెరిగింది. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో బంగాళాఖాతం నుంచి వీచే తూర్పు గాలులు ఈ సీజన్‌లో దాదాపుగా లేవని చెప్పాలి. తూర్పుగాలులు ప్రతిసారి వారం వరకు ప్రభావం చూపడంతో వర్షాలు కురుస్తుంటాయి. అటువంటిది ఈ ఏడాది తూర్పు గాలుల జాడలేకపోవడంపై వాతావరణ నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కారణాలపై అధ్యయనం చేయాల్సి ఉందని వాతావరణ అధికారి సముద్రాల జగన్నాథకుమార్ తెలిపారు. ఈనెలలో దక్షిణ తమిళనాడులోని డెల్టా ప్రాంతంలో కొన్ని రోజులు తూర్పుగాలులతో వర్షాలు కురిశాయి తప్ప ఉత్తర తమిళనాడు, రాయలసీమ, దక్షిణ కోస్తాలో చినుకు లేదన్నారు. ఈ సీజన్‌లో ఆదివారం వరకు 285.9 మి.మీ.లకు గాను 357.6 మి.మీ.లు (25 శాతం అధికం) వర్షపాతం నమోదైంది. అయితే తుఫాన్ల సమయంలో కురిసిన వర్షాలతోనే ఏపీలో మిగులు వర్షపాతం నమోదైందని జగన్నాథకుమార్ పేర్కొన్నారు. దఫదఫాలుగా మోస్తరు వర్షాలు కురిసే వాతావరణం ఈ ఏడాది కనిపించలేదని, దీనిపై అధ్యయనం చేయాలని తెలిపారు.

దక్షిణ కోస్తాలో ఉపరితల ఆవర్తనం

- వర్షం పడే అవకాశం లేదు: ఐఎండీ

దక్షిణ కోస్తా పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. అయితే దీని ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం లేదని వాతావరణ శాఖ తెలిపింది. పొడి వాతావరణమే కొనసాగుతుందని పేర్కొంది. కాగా, సోమవారం చలితీవ్రత, పొగమంచు కొనసాగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. రానున్న రెండు, మూడు రోజులు చలితీవ్రత కొనసాగుతుందని, వచ్చే నెల నాలుగైదు తేదీల తర్వాత కొంతవరకు తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

షెల్టర్ హోమ్‌లపై ఏం చేస్తున్నారు?

- ఫుట్‌పాత్‌లపై అనాథలు నిద్రించే పరిస్థితి పోవాలి
- వారిని నైట్‌షెల్టర్‌లకు తరలించే ఏర్పాట్లు చేయండి
- విజయవాడ మున్సిపల్ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం
- జిల్లా కేంద్రాల్లో షెల్టర్ల ఏర్పాటుపై రెండువారాల్లో అఫిడవిట్
- పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శికి నిర్దేశాలు
- మహిళలకూ షెల్టర్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి సూచన

అమరావతి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనాథలు, నిరాశ్రయులు రాత్రివేళల్లో ఫుట్‌పాత్‌ల మీద నిద్రించడంపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం పై తక్షణం దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిరాశ్రయుల కోసం విజయవాడతోపాటు అన్ని జిల్లా కేంద్రాలలో షెల్టర్ హోమ్స్ ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలపై రెండు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న వారిని షెల్టర్ హోమ్‌లకు తరలించేలా తక్షణమే డ్రైవ్ నిర్వహించాలని విజయవాడ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించింది. విజయవాడ నగరంలో మహిళలకు ప్రత్యేకంగా ఒక్క నైట్ షెల్టర్ కూడా లేకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు స్పష్టం చేసింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు న్యాయవాది ఎన్.ఆది రామకృష్ణుడు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)పై విచారణలో ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. న్యాయవాది ఆది రామకృష్ణుడు వాదనలు వినిపిస్తూ.. నైట్ షెల్టర్లు ఉన్నప్పటికీ నిరాశ్రయులను అక్కడకు తరలించేందుకు కార్పొరేషన్ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. తీవ్ర చలిలో వణుకుతూ అభాగ్యులు ఇబ్బంది పడుతున్నారన్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ వాదనలు వినిపిస్తూ.... కార్పొరేషన్ ఇప్పటికే కొన్ని షెల్టర్ హోమ్స్ నిర్వహిస్తోందని, మరికొన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసిందన్నారు.

గత ప్రభుత్వంలో బిల్లులు చెల్లించలేదు: అమికస్ క్యూరీ

అనాథలు, నిరాశ్రయుల కోసం అన్ని జిల్లా కేంద్రాల్లో షెల్టర్ హోమ్స్ ఏర్పాటు విషయంలో కోర్టుకు సహాయ సహకారాలు అందించేందుకు సీనియర్ న్యాయవాది కేఎస్‌మూర్తి ని అమికస్ క్యూరీగా ధర్మాసనం నియమించింది. అంతకు ముందు కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ.... గతంలో నైట్ షెల్టర్లను ఎన్‌జీవోలు నిర్వహించేవని, గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో వాటి నిర్వహణను అవి వదిలేశాయన్నారు. దీంతో నైట్ షెల్టర్ల నిర్వహణలో అనుభవం ఉన్న ఎన్జీవోల సహకారం తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

విజయవాడలో సహకార ఉద్యోగుల ధర్నా

- దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

విజయవాడ (గాంధీనగర్), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖజానాపై ఎటువంటి భారంపడని తమ దీర్ఘ కాల సమస్యలు పరిష్కరించాలని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు విజయవాడ ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా చేపట్టారు. జనవరి 5 నుంచి రోజుకో జిల్లా చొప్పున 26 జిల్లాలు పూర్తయ్యే వరకు ధర్నాచౌక్‌లో 26 రోజులు రిలే నిరాహార దీక్షలు చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేడతామని జేఏసీ నాయకుడు బొల్లినేని రఘురామ్ స్పష్టం చేశారు. 36 జీవోను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రాజకీయ కోణంలోనే జిల్లాల పునర్విభజన!

- నిరసనలను దృష్టిలో ఉంచుకుని పునఃపరిశీలించాలి: సీపీఐ

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజన ప్రక్రియను ఇష్టానుసారంగా ముక్కలు చెక్కలుగా చేయడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తప్పుబట్టారు. ఇది స్థానిక ప్రజల మనోభావాలను కించపర్చమేనని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు మంత్రి లోకేశ్.. ఇద్దరూ కలిసి రాజకీయ కోణంలోనే జిల్లాలను పునర్విభజన చేసినట్లు స్పష్టమవుతోందని ఆరోపించారు. ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న నిరసనలు, ఉద్యమాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాల పునర్విభజనపై పునఃపరిశీలన చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

హక్కులను కాలరాస్తున్న కేంద్రం: సీపీఐ

శ్రీకాకుళం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, ఉద్యమాల అణచివేతకు కుట్ర పన్నుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. సోమవారం శ్రీకాకుళంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'ప్రధానమంత్రి మోదీ.. దేశాన్ని తిరోగమనం వైపు తీసుకెళ్తున్నారు. గత 50 ఏళ్లుగా సాగుతున్న ఉద్యమాలు, వాటి ఫలితాలు, ఆయా పోరాటాలకు నాయకత్వం వహించిన వ్యక్తుల వివరాలు కావాలంటూ డీజీపీలకు లేఖలు రాయడం ఉద్యమాలను అణిచివేసే వ్యూహంలో భాగమే. ఎర్రజెండాలన్నీ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైంది' అన్నారు.

సాయిబాబా మృతి టీడీపీకి తీరని లోటు

- ప్రజలకు, దివ్యాంగులకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం
- నివాళులర్పించిన నందమూరి రామకృష్ణ, బక్కని నర్సింహులు, మంద కృష్ణ మాదిగ
- హైదరాబాద్‌లో ముగిసిన అంత్యక్రియలు



సాయిబాబా పాడె మోస్తున్న నందమూరి రామకృష్ణ, కట్టా రాములు

హైదరాబాద్, అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ అభిమాన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిన్నమనేని సాయిబాబా ఆకస్మిక మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. హైదరాబాద్, బేగంపేటలో సాయిబాబా నివాసం నుంచి ఆయన పార్థివ దేహాన్ని ఎన్‌టీఆర్ అభిమానులు, టీడీపీ శ్రేణుల దర్శనార్థం టీడీపీ నగర కార్యాలయానికి సోమవారం మధ్యాహ్నం తీసుకువచ్చారు. పలువురు ప్రముఖులు, జనం పెద్ద సంఖ్యలో హాజరై అశ్రునయనాలతో నివాళులు అర్పించారు. ఎన్‌టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరావు, తెలంగాణ టీడీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ, ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కోటేశ్వరరావు, మోత్కుపల్లి నర్సింహులు, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ మంత్రి కృష్ణ యాదవ్, వివిధ పార్టీల, సంఘాల నేతలు సాయిబాబా పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 'టీడీపీ అధికారంలో ఉన్నా లేకపోయినా సాయిబాబా నిత్యం ప్రజల హక్కులు, సంక్షేమం, దివ్యాంగుల హక్కుల కోసం ఉద్యమించేవారు. సాయిబాబా కుటుంబానికి అండగా ఉంటాం' అని పేర్కొన్నారు. అనంతరం టీడీపీ నగర కార్యాలయం నుంచి అంతిమ యాత్ర నిర్వహించారు. సాయిబాబా పాడెను నందమూరి రామకృష్ణ, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, టీడీపీ నేత కట్టా రాములు మోశారు. అంబర్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

కుటుంబానికి చంద్రబాబు పరామర్శ

సాయిబాబా మృతి పార్టీకి, వ్యక్తిగతంగా తనకు తీరని లోటని సీఎం చంద్రబాబు అన్నారు. సోమవారం సాయిబాబా కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పరామర్శించి, ధైర్యం చెప్పారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్టీఆర్‌తో, తనతో సాయిబాబాకు ఉన్న సాన్నిహిత్యాన్ని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ భవన్‌కు వెళ్లిన సమయంలో ముందుగా వచ్చి స్వాగతం పలుకుతారని, అటువంటి నేతను కోల్పోవడం బాధాకరమని అన్నారు. సాయిబాబా కుటుంబ సభ్యులకు అన్ని వేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

వలస కార్మికుడిపై కత్తులతో టీనేజర్ల దాడి

- బాధితుడు మహారాష్ట్ర వాసి.. ఆస్పత్రికి తరలింపు
- వీడియో ఇన్‌స్టాలో పోస్టు చేసిన నిందితుడు
- తమిళనాడులో వీడియో వైరల్.. నిందితుల పట్టివేత

చెన్నై, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాజధాని చెన్నై సమీపంలో ఒక వలస కార్మికుడిపై నలుగురు టీనేజర్లు దాడి చేశారు. విషయం వెలుగులోకి రావడంతో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై నుంచి తిరుత్తణికి వెళ్తున్న సబర్బన్ రైలులో నలుగురు బాలుర బృందం ఒక వలస కార్మికుడిని వేధిస్తూ, దాడి చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ఇటీవల వైరల్ అయ్యాయి. నిందితుల్లో ఒకరు కత్తి చూపిస్తూ, ఒక తమిళపాటను బ్యాక్‌గ్రౌండ్ సౌండ్‌గా ఉపయోగించాడు. మరో వీడియోలో నిందితులు ఒక ఇంటి సమీపంలో బాధితుడిపై కత్తులతో దాడి చేయడం కనిపించింది. దాడి చేసిన వారిలో ఒకరు బాధితుడి పక్కన విక్టరీ గుర్తు చూపిస్తూ పోజు ఇచ్చాడు. ఈ దాడిలో బాధితుడు తీవ్రంగా గాయపడి, రక్తస్రావంతో ఉన్నాడు. అతడు ప్రస్తుతం తిరువళ్లూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు మహారాష్ట్రకు చెందిన కూలీగా పోలీసులు గుర్తించారు. కాగా, 17 ఏళ్ల వయసుగల నలుగురు నిందితులను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారిలో ముగ్గురిని చెంగల్పట్టులోని బాలల సంరక్షణ గృహానికి పంపగా, నాలుగో నిందితుడిని అతడి చదువును దృష్టిలో ఉంచుకుని కోర్టు బెయిల్‌పై విడుదల చేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మయన్మార్‌లో మాయ

మయన్మార్‌లో ఆదివారం జరిగిన తొలిదశ ఎన్నికల్లో మన విజయం సాధించినట్టు యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ (యుఎస్‌డిపి) ప్రకటించుకుంది. ఎన్నికలు జరిగిన స్థానాల్లో మూడింట రెండువంతులు దీనికే దక్కాయట. ఈ సైన్యం అనుకూల పార్టీ ప్రకటనను బట్టి జనవరి 11, 28 తేదీల్లో జరగబోయే మిగతా రెండు దశల పోలింగ్‌లోనూ అదే మనవిజయం సాధిస్తుందని, మొత్తం ఫలితాలు ఎప్పుడు వెలువడినా అవి పరోక్షంగా జుంటాకే జై కొడతాయని అర్థం.

మయన్మార్ ఎన్నికల గురించి ఒక్కరూ మంచిమాట అనడం లేదు. ఎన్నికల పరిశీలకులను పంపడానికి ఆసియాన్ తిరస్కరిస్తే, ఓ నాలుగైదు దేశాలు మాత్రమే సరేనన్నాయి. జుంటాకు అండగా ఉంటున్న రష్యా, చైనాలు అధికారికంగానే ఎన్నికల పరిశీలకులను పంపాయి. భారత్ నుంచి కూడా పరిశీలకులు వచ్చారని ఆ దేశ సైనిక ప్రభుత్వం చెబుతుంటే, అది పూర్తి ప్రైవేటు వ్యవహారం అని మన ప్రభుత్వం తేల్చేసింది. అంతమాత్రాన భారత్ ఈ ఎన్నికలకు వ్యతిరేకమేమీ కాదు. ఎన్నికలకు అక్కడి సైనిక ప్రభుత్వం సిద్ధపడుతున్నప్పుడే ప్రజాస్వామ్యం దిశగా మయన్మార్ అడుగులు వేస్తున్నదంటూ భారత్ మెచ్చుకుంది. ఒక మాజీ సైనికాధికారి ఎన్నికల పరిశీలకుడుగా వెళ్లడం వ్యక్తిగత హోదాలో జరిగినా, ప్రభుత్వం అనుమతి లేనిదే సాధ్యంకాదు. సైనిక ప్రభుత్వంతో సత్సంబంధాలు కోరుకుంటున్నప్పుడు ఇటువంటి విన్యాసాలు తప్పవు. ఎన్నికలు స్వేచ్ఛగా, స్వచ్ఛంగా జరుగుతాయని, ప్రజలు నచ్చినవారిని ఎన్నుకోవచ్చునని, వారు ఎన్నుకున్న వారికే పాలన అప్పగిస్తామని దేశాన్ని గత ఐదేళ్లుగా ఏలుతున్న సైనిక పాలకుడు అదేపనిగా హామీ ఇస్తున్నాడు. అధికారానికి దూరంగా ఉండాలని తాము కోరుకుంటున్నామని అంటున్నాడు. దేశం అంతర్యుద్ధంలో మునిగివున్నప్పుడు, పట్టుబట్టి సైనిక ప్రభుత్వం ఈ ఎన్నికలు నిర్వహిస్తోంది. బరిలో యాభైఐదు పార్టీలు ఉన్నప్పటికీ, ప్రధాన పార్టీలు ఆరింటిలో మాజీ సైనికాధికారులతో నిండిన యుఎస్‌డిపి మాత్రమే మనవిజయం సాధిస్తుందని ఈ పోలింగ్‌కు ముందే అక్కడి ప్రజలకూ మిగతా ప్రపంచానికీ తెలుసు. ప్రజాస్వామ్యవాది, నోబెల్ విజేత ఆంగ్‌సాన్‌సూకీని గృహనిర్బంధంలో ఉంచి, పలు కేసుల్లో ఏళ్లతరబడి శిక్షలు వేసి, 2023లో ఆమె పార్టీ 'నేషనల్ లీగ్ ఫర్ డెమొక్రసీ' (ఎన్‌ఎల్‌డి)ని రద్దుచేసిన సైన్యం ప్రస్తుతం ఆ పార్టీ లేకుండా ఈ ఎన్నికల తతంగం నిర్వహిస్తోంది కనుక మయన్మార్ ప్రజలకే కాదు, అంతర్జాతీయ సమాజానికి కూడా వీటిపై నమ్మకం లేదు. ఎంతో స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగాయని మిగతా ప్రపంచమంతా మెచ్చుకున్న గత ఐదేళ్లనాటి ఎన్నికలను మయన్మార్ సైన్యం ఏడాదిలోనే తప్పుబట్టి, మనవిజయం సాధించిన సూకీని నిర్బంధంలోకి నెట్టింది. అప్పుడున్న పార్టీల్లో ఇప్పుడు సగం కూడా అక్కడ మిగల్లేదు.

సూకీని అధికారం నుంచి దింపివేసిన తరువాత రేగిన అంతర్యుద్ధాన్ని నియంత్రించడం సైనిక ప్రభుత్వానికి సాధ్యపడటం లేదు. చైనా ఆర్థిక, ఆయుధసాయంతో ఇప్పుడిప్పుడే కాస్తంత పైచేయి సాధిస్తున్న జుంటాకు పాశ్చాత్య ప్రపంచం నుంచి కాకున్నా పొరుగుదేశాల నుంచి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోవడానికి ఈ అబద్ధాల ఎన్నికలు ఉపకరిస్తాయి. సైనిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న త్రీ బ్రదర్‌హుడ్ అలయెన్స్ (టీబీఏ) కూడా చైనా ఒత్తిడికి లొంగి, తన అధీనంలో ఉన్న ప్రాంతాలను క్రమంగా వదులుకుంటోందని వార్తలు వస్తున్నాయి. అయినా, రఖైన్, కరేన్, చిన్ తదితర రాష్ట్రాల్లో జుంటాకు ఇప్పటికీ పట్టులేదు. ఒక లెక్క ప్రకారం దేశంలో సగం మాత్రమే దాని అధీనంలో ఉన్నది. ఈ నేపథ్యంలో, ప్రజాస్వామ్యం ముసుగులో తామే మళ్ళీ అధికారంలోకి వస్తున్నందున తిరుగుబాటుదారులను అణచివేయడం సైనిక ప్రభుత్వానికి ఇకపై మరింత సులభమవుతుంది. చట్టసభలో నాలుగోవంతు స్థానాలు తమ అధీనంలోనే ఉండేలా రాజ్యాంగాన్ని ఎప్పుడో తిరగరాసుకున్న సైన్యానికి తమకు వ్యతిరేకంగా తలెగరేసినవారిని గద్దెదించేయడం ఏ క్షణమైనా సాధ్యమే. ఈ ఎన్నికలు దేశంలో శాంతిని ప్రతిష్ఠించబోవని, యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేస్తాయని కెచిన్ వంటి సాయుధగ్రూపులు విస్పష్టంగా చెబుతున్నాయి. ఐదేళ్ల క్రితం సూకీ ఎన్నికల బరిలో ఉన్నప్పటికీ, ఇప్పటికీ ప్రజల భాగస్వామ్యంలో హస్తిమశకాంతరం కనిపిస్తోంది. ప్రజల సహకారం లేని ఇటువంటి బూటకపు ఎన్నికలు మరింత విధ్వంసాన్ని, వినాశనాన్ని సృష్టించిన చరిత్ర మయన్మార్ సైనిక పాలకులకు తెలియనిదేమీ కాదు.

ఉర్దూ భాషకు అసలైన స్వర్ణోత్సవాలు కావాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమి ఏర్పడి 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా 'సురూర్-ఏ-ఉర్దూ' (ఉర్దూ ఆనందోత్సవ హేల) పేరుతో ప్రభుత్వం స్వర్ణోత్సవాలు నిర్వహించడం స్వాగతించదగ్గ విషయం. ఉర్దూను పరిరక్షించడంతో పాటు ఉర్దూ సాహిత్యాన్ని అభివృద్ధి చేయాలన్న ఉన్నత ఆశయంతో 1975 డిసెంబర్ 31న నాటి ప్రభుత్వం జీవోను తెచ్చింది. దీని ద్వారా స్వతంత్ర ప్రతిపత్తి గల ఉర్దూ అకాడమిని ఏర్పాటు చేసింది. అకాడమి జీవో ప్రతిపాదనల ప్రకారం, రాష్ట్రంలో ఉర్దూను రెండో అధికార భాషగా అమలు చేయాలి. ఉర్దూ భాషాభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టాలి. కానీ అకాడమి ఏర్పాటు చేసినంత ఉత్సాహాన్ని దాని పాలనలో ప్రభుత్వం చూపలేకపోయింది. నిధుల కేటాయింపుల్లో కోత విధించడంతో, పలు పథకాలు అమలు కాలేదు.

ఇటీవల ఉర్దూ మహోత్సవాలను ప్రభుత్వం తలపెట్టి నిర్వహించిన సందర్భంగా రాష్ట్రంలో ఉర్దూ భాషా అకాడమి తీరు తెన్నులను ఓసారి చూద్దాం. భాష అనేది ఏ మతానికీ సంబంధించినది కాదు. ఉర్దూ భాషలో రాణించిన కవులు మతాలకు అతీతంగా ఉన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో ఉర్దూ ద్వారా లభించిన ప్రోత్సాహం ప్రతి ఉద్యమకారుడికీ స్ఫూర్తినిచ్చింది. కానీ స్వాతంత్ర్యానంతరం, దేశ భాషల కంటే ఎక్కువగా ఆంగ్లం అభివృద్ధి చెందింది. ఈ దశలో, ప్రాంతీయ భాషలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సైతం అంతంత మాత్రమేనన్నది అక్షర సత్యం. డా. సినారాయణరెడ్డి, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఉర్దూ భాషలో ఎంతో నిష్ణాతులుగా గర్వంగా చాటుకోవచ్చు.



> **ఉర్దూ భాష ఏ మతానికీ సంబంధించినది కాదు. ఆ భాషలో రాణించిన కవులు మతాలకు అతీతంగా ఉన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో ఉర్దూ భాష ద్వారా లభించిన ప్రోత్సాహం ప్రతి ఉద్యమకారుడికీ స్ఫూర్తినిచ్చింది. ఉర్దూ వంటి ప్రాంతీయ భాషలను పరిరక్షించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి.**

రాష్ట్రంలో ఉన్న ముస్లిం జనాభాలో 80శాతం మందికి ఉర్దూ మాతృభాషగా ఉంది. రాజ్యాంగంలోని 350 అధికరణ మేరకు వారికి మాతృభాషలో విద్యనభ్యసించే ప్రాథమిక హక్కు ఉన్నా, అది అమలు కావడం లేదు. వారిలో ఉర్దూ మాధ్యమంగా విద్యనభ్యసిస్తున్నవారు పదిశాతం మాత్రమే. ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు అతి తక్కువగా ఉండటం, ఉన్న కొద్ది ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు, ఉపాధ్యాయుల కొరత కూడా ఓ ప్రధాన కారణం. ఈ మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉర్దూ ఉపాధ్యాయులను నియమించడం హర్షణీయం. నాలుగు దశాబ్దాలుగా అంతో ఇంతో అమలవుతూ వచ్చిన ఉర్దూ భాషాభివృద్ధి పథకాలకు గత ప్రభుత్వం చరమగీతం పాడింది. నిధుల కొరత సాకుతో ఏకంగా ఉర్దూ అకాడమి మూతపడేలా చేసింది.

ఉర్దూ అకాడమి నూతన చైర్మన్‌గా ఇటీవల ఫరూక్ శుబ్లీ నియమితులు కావడం సంతోషకరం. ఉర్దూ భాషాభివృద్ధికి తగిన ప్రణాళికలతో అకాడమి ముందుకు సాగాలి. భాషతో పాటు, సాహిత్యాన్ని వ్యాప్తి చేసేందుకు వీలుగా సెమినార్లు, మషాయిరాలు (కవి సమ్మేళనాలు) నిర్వహించాలి. ఉర్దూ భాషను ప్రోత్సహించే సంస్థలను, ఉర్దూ కవులను, రచయితలను ప్రోత్సహించాలి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజముద్రలో ఆంగ్లం, తెలుగు భాషలతో పాటు ఉర్దూ భాషకూ స్థానం కల్పించాలి. ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్టీసీ బస్సులపై ఉర్దూలో పేర్లు లేకపోవడం శోచనీయం. గతంలో మాదిరిగా ఉర్దూ డీటీపీ సెంటర్లను ప్రభుత్వం బాధ్యతతో నిర్వహించాలి. అకాడమి ఆధ్వర్యంలో 'ఖౌమీ జబాన్' మ్యాగజైన్‌ను పునరుద్ధరించాలి. ఉర్దూ విద్యార్థులకు ప్రోత్సాహకంగా స్కాలర్‌షిప్‌ల రూపంలో ఆర్థిక సాయం అందజేయాలి. ఉర్దూ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలి.

గత రెండేళ్లుగా నామమాత్రంగా జరుపుతున్న జాతీయ ఉర్దూ దినోత్సవం (నవంబర్ 9)ను ఉర్దూ అకాడమి ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఘనంగా నిర్వహించాలి. ఉర్దూ విశ్వవిద్యాలయానికి దశాబ్దం క్రితం శంకుస్థాపన జరిగినా, నేటికీ భవన సముదాయాలు పూర్తికాలేదు. ఉర్దూ విశ్వవిద్యాలయం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. ఉర్దూ భాషలో ప్రావీణ్యులైన వీసీ, ప్రొఫెసర్లను నియమించాలి. విశ్వవిద్యాలయం అభివృద్ధికి బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలి. యూజీసీ తదితర కేంద్ర సంస్థల నుంచి నిధులు రాబట్టుకునే కృషి జరగాలి. ఉర్దూ యూనివర్సిటీకి అనుబంధంగా ఉర్దూ మీడియం కళాశాలలు ఏర్పాటు చేసి, వివిధ గ్రూపుల్లో విద్యా బోధన జరిగేలా చూడాలి.

ప్రతి జిల్లాకు ఒక ఉప విద్యాధికారి హోదా కలిగిన ఉర్దూ అధికారిని, ప్రతి డివిజన్‌కు ఒక డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ రేంజ్ అధికారిని నియమించాలి. ఉర్దూ అకాడమి ఆధ్వర్యంలో ఉర్దూ పాఠ్యపుస్తకాలు, డైరీలు ముద్రించాలి. రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ అంగన్వాడీ సెంటర్లు, బాల్వాడీలు, సిరీస్ సెంటర్లను పునరుద్ధరించాలి. ఉర్దూ అకాడమి వార్షిక ప్రణాళికను రూపొందించి క్షేత్ర స్థాయి వరకు అమలయ్యే విధంగా కార్యాచరణ చేపట్టాలి. ఈ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకున్నప్పుడే ఉర్దూ అకాడమి స్వర్ణోత్సవాలకు సార్థకత. ఆ అభివృద్ధి దిశలో ఏపీ ఉర్దూ అకాడమి రాణించి, దేశంలోనే ఉత్తమ ఉర్దూ అకాడమిగా నిలవాలని ఆశిద్దాం.

● షేక్ అబ్దుల్ సమద్

పదేపదే అదే ప్రశ్న..‘దేవుడున్నాడా?’

‘దేవుడు ఉన్నాడా?’ అనేది ఒక అనాది ప్రశ్న, కొనసాగుతున్న మీమాంస. ప్రముఖ కవి, మేధావి జావేద్ అఖ్తర్– ఇస్లాం పండితుడు ముఫ్తీ షామైల్ నాద్వి మధ్య ఇటీవల ఆ ఎడతెగని ప్రశ్నపై చర్చ జరిగింది. ఆ చర్చలో పాల్గొనవలసిందిగా నన్నూ ఆహ్వానించారు. నేను నిరాకరించాను. ఆ సమయంలో నేనేమీ వేరే వ్యాపకాలలో తలమునకలై లేను. అసలు ఆ అంశంపై చర్చ అర్థరహితమని నా సునిశ్చితాభిప్రాయం. న్యూస్ చానెల్ ‘ది లల్లన్‌టాప్’లో యాంకర్ సౌరభ్ ద్వివేది నిర్వహించిన ఆ చర్చ చాలా ఆసక్తికరంగా జరిగింది. విశేష ప్రతిస్పందనలకు ఆస్కారమిచ్చిన అసాధారణ చర్చ అది, సందేహం లేదు. అయితే ప్రజాదరణ అనేది ఔచిత్యానికి రుజువు కాదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే మౌలిక మార్పులకు దోహదం చేసేది కాదు.



■ యోగేంద్ర యాదవ్


ముఫ్తీ సాహెబ్‌తో నాకు పరిచయం లేదు. దైవం ఉనికిపై చర్చలో పాల్గొనేందుకు ఒక మతాచార్యుడికి సహేతుకమైన కారణాలు ఉంటాయి. అయితే జావేద్ సాహెబ్ అటువంటి చర్చలో పాల్గొనేందుకు ఎందుకు అంగీకరించారో నేను అర్థం చేసుకోలేకున్నాను. జావేద్ నాకు తెలుసు. ఆయన పట్ల నాకు గౌరవాదరాలు ఉన్నాయి. అయితే దేవుడికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ లౌకికవాద ధర్మయుద్ధంలో తన సృజనాత్మక శక్తి సామర్థ్యాలను ఎందుకు వినియోగించదలుచుకున్నారు? ఉత్కృష్టమైన రసానందాన్ని కలిగించే సినిమా పాటల స్రష్టగానే కాకుండా, అభ్యుదయ కవిగా కూడా ఆయన నాకూ, ఎంతో మందికి అభిమానపాత్రుడు. హిందీ, ఉర్దూ సాహిత్య ప్రపంచాలను ప్రగతిశీల భావకాంతులతో ప్రకాశవంతం చేసిన అభ్యుదయ సాహిత్య సంప్రదాయాలకు ఆయన సమున్నతమైన ప్రతినిధి. మత విద్వేషాలు, జాతీయవాద సంకుచితత్వాలకు వ్యతిరేకంగా జరుగుతోన్న పోరాటంలో ఆయనది ప్రభావశీలమైన గొంతుక. జాతి జనులు తమ ‘గుండెలలో ఘూర్ణిల్లగ... పాడుకుంటున్న’ ఆయన ‘ఏక్ హమారి ఔర్ ఏక్ ఉన్కి/ ముల్క్ మే హై ఆవాజెయిన్ దో’ గీతం నాకు నిరంతర స్ఫూర్తి. ముస్లింల మత సంకుచితత్వం, హిందూ దురహంకారానికి వ్యతిరేకంగా స్థిర వైఖరితో, సాహసోపేతంగా పోరాడుతున్న కవి, మేధావి జావేద్ సాహెబ్.

ఈ కారణంగానే ‘దేవుడు ఉన్నాడా?’ అన్న అంశంపై ఆయన చర్చలో పాల్గొనడం నాకు నిరుత్సాహాన్ని కలిగించింది. నేనూ ఆయన వలే అవిశ్వాసుల సమూహంలోని వాణ్ణే. ఆయనవలే రెండోతరం అజ్ఞేయతావాదిని. మా నాన్నగారు హేతువాది. మతపరమైన ఎలాంటి ప్రమేయం లేకుండా తన జీవిత వ్యవహారాలను నడుపుకున్న మనిషి. మా అమ్మగారు కూడా మతపరమైన ఆచారాల పట్ల తీవ్ర విముఖత చూపేవారు. వ్రతాలు, పూజలకు మా అమ్మమ్మ ఇచ్చే ప్రాధాన్యం ఆమెకు ఎంత మాత్రం నచ్చేది కాదు. నా పెంపకంలో మతపరమైన ప్రభావం లేదని మరి చెప్పనవసరం లేదు. నా సతీమణి హిందూ మతాచారాలను నిష్ఠగా పాటిస్తుంటుంది. అయినా నా అజ్ఞేయతావాద (భౌతికంగా కనిపించిందే తెలుసుకోదగినదని నమ్మే వాదం) విశ్వాసాలు ఏ మాత్రం సడల లేదు.

ఈ నాటి భారతదేశంలో ‘దేవుడు ఉన్నాడా?’ అన్న విషయమై బహిరంగ చర్చకు అర్థవంతమైన ప్రాధాన్యమున్నదని నేను భావించడం లేదు. అటువంటి చర్చలో ఒకవైపు తరచూ దైవ విశ్వాసుల మూఢ వాదం, మరోవైపు నాస్తికుల అజ్ఞానం, అహంకారం వ్యక్తమవడం పరిపాటిగా ఉన్నది. మరింత ఘోరమైన విషయమేమిటంటే ‘దేవుడు ఉన్నాడా?’ అన్న చర్చ వర్తమాన భారతదేశంలో మతం, మతతత్వంపై జరగవలసిన చర్చల నుంచి మన దృష్టిని మళ్లించేదిగా ఉంటోంది. భగవంతుడి ఉనికిపై చర్చలు ఎల్లప్పుడూ అల్పమైనవిగానూ, అప్రధానమైనవిగానూ లేవు. ఆ ప్రశ్న ప్రగాఢమైన తాత్విక ప్రశ్నలకు దారితీసిన సందర్భాలు చరిత్రలో చాలా ఉన్నాయి. దేవుడు ఉన్నాడు అంటే అర్థమేమిటి? దేవుడు ఉన్నట్టయితే మన జీవితాలలో ఇంత చెడు ఎందుకు ఉంది? దేవుని రూపం ఏమిటి? లేక ఆయన నిరాకారుడా? అన్న ప్రశ్నలు సహజంగానే చర్చకు వస్తాయి. ప్రాచీన భారతీయ దార్శనికులు ఈ ప్రశ్నలపై లోతైన చర్చ జరిపారు.. సాంఖ్య, న్యాయ దర్శనాలే అందుకు నిదర్శనాలు. అసలు దేవుడే లేడని చార్వాకులు వాదించారు. ఐరోపాలోని ప్రజలు ఆధునిక యుగారంభం నుంచి హేతుబద్ధంగా దేవుడి ఉనికిని, మత విశ్వాసాలను ప్రశ్నించారు. తర్కబద్ధంగా వాద ప్రతివాదాలు జరిగాయి. ఇవి ఆధునిక రాజకీయ, సామాజిక చింతనను పురిగొల్పాయి. నవీన భావాలకు, జ్ఞాన వికాసానికి విశేషంగా తోడ్పడ్డాయి. ఇందుకు కారణం పరస్పరం విభేదించుకుంటున్న వారి భాగస్వామ్య తాత్విక అంచనాలు. ఉమ్మడిగా ప్రగాఢ తాత్విక భావనలు లేని ఆస్తికులు, నాస్తికుల మధ్య చర్చలు ఆవేశపరుస్తాయేగానీ ఆలోచనాత్మకంగా జరగవు. వాడీ వేడిగా జరుగుతాయేగానీ వెలుగునివ్వని చర్చలుగానే అవి ఉండిపోతాయి.

> **‘దేవుడు ఉన్నాడా?’ అన్న విషయమై బహిరంగ చర్చకు అర్థవంతమైన ప్రాధాన్యమున్నదని నేను భావించడం లేదు. అటువంటి చర్చలో ఒకవైపు తరచూ దైవ విశ్వాసుల మూఢవాదం, మరోవైపు నాస్తికుల అజ్ఞానం, అహంకారం వ్యక్తమవడం పరిపాటి. ఉమ్మడిగా ప్రగాఢ తాత్విక భావనలు లేని ఆస్తికులు, నాస్తికుల మధ్య చర్చలు ఆవేశపరుస్తాయేగానీ ఆలోచనాత్మకంగా జరగవు.**

అయితే ఇటువంటి వాద ప్రతివాదాలు విప్లవాత్మకంగా పరిణమించిన సందర్భాలు కూడా చరిత్రలో ఉన్నాయి. విశ్వానికి భూమే కేంద్రం అన్న చర్చి నిర్దేశానికి వ్యతిరేకంగా గెలీలియో సహేతుకమైన వాదనలు చేసి సూర్య కేంద్ర విశ్వ భావనను నెలకొల్పారు. హిందూ దేవతల



గాథలను జ్యోతిబాఫూలే నిశితంగా ప్రశ్నించారు. దైవ భావనపై రామస్వామి నాయకర్ తిరుగుబాటు సామాజిక నిరంకుశత్వాలను కూల్చివేసింది. నేడు దైవ భావనపై దాడి అటువంటి ప్రగతిశీల ప్రయోజనాలను సాధించలేదు. ఎందుకంటే వర్తమాన ప్రపంచంలో మతానికి సామాజిక పరపతిగానీ, సత్యంపై గుత్తాధిపత్యంకానీ లేవు. నేడు విజ్ఞానశాస్త్రం, హేతువాదం ఆలంబనకు మతం ఆరాటపడుతోంది. భగవంతుడిపై విమర్శలు నేటి అమానుష సామాజిక, రాజకీయ అసమానతలను ప్రశ్నించేవిగా లేవు, ఉండడం లేదు.

దేవునికి వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న విమర్శలు, మన కాలంలో మతం, మతతత్వం మూలంగా ప్రబలుతున్న నిజమైన, తక్షణ సమస్యల నుంచి మన దృష్టిని మళ్లిస్తున్నాయి. దేవుడి గురించి కాకుండా దేవ పురుషులు లేదా దేవ స్త్రీల గురించి మనం చర్చించాల్సిన అవసరమున్నది. నిజానికి మన దేశంలో మతపరమైన నాయకత్వ (మేధా, నైతిక) ప్రమాణాలు అన్ని మతాలలోను పతనమవుతున్నాయి. వివిధ మతాలు, మత శాఖలు ఉత్తమోత్తమ నాయకత్వాన్ని సమకూర్చగల ఉదాత్త వ్యక్తులను ఎందుకు ఆకర్షించలేకపోతున్నాయో; దొంగ బాబాలు, మోసకారి సాధువులు, ఆధ్యాత్మిక వ్యవహారాల నిర్వహణకు పూర్తిగా అయోగ్యులైనవారే మతపరమైన వ్యవహారాలలో ప్రభావశీలురు ఎందుకు అవుతున్నారో మనం చర్చించాలి. మతపరమైన పండుగల, కార్యక్రమాల నిర్వహణ వాటి పరమార్థం, ప్రాముఖ్యతకు ఎందుకు విరుద్ధంగా ఉంటోంది? ఆధ్యాత్మిక పురుషులుగా గౌరవాదరాలు పొందుతున్న వారు వివాదాస్పద దృక్కోణాలను ప్రోత్సహించేందుకు మత సంబంధిత వేదికలను ఉపయోగించుకోవడం ఎందుకు జరుగుతున్నదో మనం చర్చించాలి. ప్రగాఢ మతభావం, దైవారాధన సందర్భాలు సిరిసంపదల ప్రదర్శనకు ఎలా ఆలంబన అవుతున్నాయో మనం చర్చించాలి. మతపరమైన వ్యవహారాలు రాజకీయాలతో ఎలా, ఎందుకు కలగలసిపోతున్నాయో మనం చర్చించాలి. దేవుని చుట్టూ కేంద్రీకృతమైన మతం కాదు, రాజ్యాధికార ప్రేమపై కేంద్రీకృతమైన మతతత్వమే మన నిజమైన సమస్య.

ప్రజలు ఎందుకంతగా భగవంతుడిపై విశ్వాసాన్ని కలిగివున్నారు? అనేది కాకుండా దైవ విశ్వాసులు తమ నిజ జీవితంలో దైవభక్తి లోపించిన విషయాలకు, ఇతరులకు హాని కలిగించే చర్యలకు ఎందుకు పాల్పడుతున్నారనే విషయమై మనం అత్యవసరంగా చర్చించాలి. అటువంటి విపరీత ప్రవర్తన నేడు సర్వసాధారణమైన లోకంపోకడగా లేదూ? తమను తాము ప్రగాఢ దైవ విశ్వాసులుగా చెప్పుకుంటున్నవారు తమ తోటి పౌరులు భగవంతుడిని వేరే పేరుతో ఆరాధించడాన్ని ఎందుకు సహించలేకపోతున్నారో మనం చర్చించాలి. విశ్వాసులు, అవిశ్వాసుల మధ్య చర్చలు కాకుండా వివిధ మతాలను అనుసరిస్తున్న వారి మధ్య, సంభాషణలు జరగాలి. పరస్పర సంభాషణలు ప్రయోజనకరమైన ఫలితాలను సాధిస్తాయి. విశ్వాసులు, అవిశ్వాసుల మధ్య వాద ప్రతివాదాలు ఎంత ఉత్తమంగా జరిగినా అవి అసంగతమైనవే. అటువంటి చర్చలు ఇప్పుడు అవసరం లేదు. మన కాలపు కీలక అంశాలపై చర్చలకు ఆ అసంబద్ధ సంభాషణలు తోడ్పడవు. సమస్యలను పరిష్కరించగల ఆవశ్యక ఫలితాలను అవి ఇవ్వలేవు.

అటువంటి అసంగత చర్చలు దేశంలో లౌకికవాద విలువల, సంప్రదాయాల సమున్నతికి అపకారమే చేస్తాయి. ఎందుకంటే ఆ చర్చలు లౌకికవాదాన్ని నాస్తికవాదంతో సమానం చేస్తాయి. ఆ రెండిటినీ ఒకే వైఖరి గల వాదాలుగా ఏకీకరణ చేస్తాయి. నిజానికి ఇప్పుడు అజ్ఞేయతావాదం లేదా నాస్తికవాదం పూర్తిగా న్యాయ సమ్మతమైన విశ్వాసం. నేను ఈ విధంగా అభిప్రాయపడుతున్నానంటే ప్రతి లౌకికవాదీ తప్పనిసరిగా ఆదర్శప్రాయమైన నాస్తికవాది కావాలని అభిలషిస్తున్నట్టుగా భావించకూడదు. అందుకు విరుద్ధంగా దైవ విశ్వాసులలో అత్యధికులు ఆమోదించినప్పుడే భారతీయ లౌకికవాదం ప్రయోజనకరంగా వర్ధిల్లుతుంది.

మతం పట్ల తమ అలక్ష్యాన్ని, వ్యతిరేకతను విడనాడడాన్ని లౌకికవాద ప్రతిపాదకులు, అనుయాయులు నేర్చుకోవాలి. తమ దురహంకారం మతం అనే మహాసాగరం విషయమై తమ అజ్ఞానంలో వేళ్లూని ఉన్నదనే సత్యాన్ని లౌకికవాదులు గుర్తించాలి. దానిని విపులంగా అర్థం చేసుకోవాలి. మతం ఒక భాష. దైవం ఒక భావన. వాటి దుర్వినియోగాన్ని ప్రతిఘటించేందుకు ఉత్తమ మార్గం ఘర్షణపడడం కాక ఆ భాషను, భావనను సృజనాత్మకంగా ఉపయోగించుకోవడమే. మతం అనేది అంధ విశ్వాసం, వివేచనా రాహిత్యం, మూఢ భక్తి అనే ఆలోచన నిజానికి ఆధునిక కాలపు ఒక భ్రమ మాత్రమే.

(వ్యాసకర్త ‘స్వరాజ్ ఇండియా’ అధ్యక్షుడు)

గూగులమ్మ బలం

అమెరికా పొమ్మంటుంది
ఆంధ్రా రమ్మంటుంది
ఒకప్పుడు చెన్నపట్నం వైపు
మరొకప్పుడు హైదరాబాద్ వైపు
నేడు విశాఖపట్నం వైపు
గూగులమ్మ వస్తుందంటే ఆనందం
దారి చూపే దిక్సూచి
ఎందరికో ఉపాధి
నీరసించిన నిరుద్యోగులకు
ఊపిరులూదే గూగులమ్మ
మోదీ గారి నేతృత్వంలో
విశాఖ నగరానికి మణిహారంగా
నగారా మోగించిన గూగులమ్మ
చంద్రన్న ఆలోచనా విధానం
పవనన్న సహకారం
లోకేశ్ బాబు కృషి ఫలితం
అమ్మగా వచ్చింది గూగులమ్మ
ఇక గూగులమ్మే మన బలం
గూగులమ్మ జనగళం

– నన్నపనేని రాజకుమారి
మాజీ మంత్రి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ప్రవాసుల పాలిట విద్వేషనామ సంవత్సరం!

ఈ సంవత్సరపు పరిణామాలను ఒకసారి వెనక్కు తిరిగి చూసుకుంటే, అమెరికాలోని భారతీయుల అనుభవాల రీత్యా, 2025ను ‘విద్వేషనామ సంవత్సరం’ అనాలేమో అనిపిస్తోంది. సుంకాల రూపేణా ప్రపంచం అంతటి దృష్టినీ ఆకర్షించిన ఈ విద్వేష సంకేతాలు ఇప్పటివరకు అడపాదడపా వ్యక్తమవుతూనే ఉన్నాయి. శ్వేతసౌధంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సలహాదారుగా భారతీయుడైన శ్రీరామ్ కృష్ణన్ నియమితుడైనప్పుడు వెల్లువెత్తిన దురహంకార ద్వేష వ్యాఖ్యలతో ఈ సంవత్సరం ప్రారంభం అయింది. అది ఏకంగా ఇటీవల అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భార్య ఉషా వాన్స్ గురించి ఒక పాడ్‌కాస్ట్‌లో వైట్‌హౌస్ మాజీ ప్రెస్ సెక్రటరీ జెన్‌సాకి, రాజకీయ వ్యాఖ్యాత నిక్ ఫ్యూయెంటెస్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం దాకా వచ్చింది. వీటికి స్పందనగా “తన భార్య గురించి మాట్లాడేవారు అశుద్ధం తింటున్నట్టే” అంటూ జేడీ వాన్స్ తీవ్రంగా స్పందించారు కూడా. భారతీయుల పట్ల అమెరికన్లు విద్వేష విషం కక్కడం ఈ సంవత్సరాంతం వరకూ కొనసాగుతూనే ఉన్నదనడానికి ఇది తార్కాణం.


యథారాజా తథా ప్రజా అనే సామెత అందరికీ తెలిసిందే. పాలకుల్లో కొందరి ఆలోచనల్లోని విద్వేషాన్ని వారి వీరభక్తులు అందిపుచ్చుకుంటున్న తీరు అమెరికాలో అత్యంత ప్రమాదకర సంకేతంగా మారింది. ఇప్పటిదాకా అమెరికా ‘యూనివర్సల్ యాక్సెప్టార్’ వంటి దేశం. ప్రపంచం నలుమూలల నుంచి లక్షల మంది వచ్చి అమెరికాలో స్థిరపడి, అక్కడే బతుకుతుంటారు. ఇలాంటి సమయంలో పరస్పర సహనంతో కూడిన జీవన విధానం మాత్రమే సమాజానికి మేలు చేస్తుంది. కానీ ట్రంప్ 2.0 ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమెరికాలో ప్రభావశీల కమ్యూనిటీగా ఎదిగిన భారతీయుల పట్ల విద్వేషం పెచ్చరిల్లుతోంది.

అమెరికన్లతో పోలిస్తే భారతీయుల్లో కష్టపడే తత్వం ఎక్కువ. అమెరికాలో స్థిరపడిన భారతీయ సమాజం ఎదుగుతున్న తీరు ఇందుకు నిదర్శనం. అమెరికాలో ఎంతో ప్రభావశీలమైన కమ్యూనిటీగా ఇవాళ భారతీయులు ఉన్నారు. ఈ నేపథ్యంలో వారి పట్ల స్థానికులు కొందరిలో అసూయతో కూడిన విద్వేషం అప్పుడప్పుడూ బయట పడుతూండేది. ఇప్పుడు ట్రంప్ రెండోసారి అధ్యక్షుడు అయిన తర్వాత అలాంటివారందరికీ బలం వచ్చినట్టయింది. ప్రజలు విద్వేషాల్ని విచ్చలవిడిగా వెళ్లగక్కుతున్నారు. సామరస్య వాతావరణం పూర్తిగా దెబ్బతింటోంది. ఇందుకు ఉదాహరణలు అనేకం.

దీపావళి పర్వదినం సందర్భంగా ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ తన ఎక్స్ వేదిక ద్వారా శుభాకాంక్షలు చెప్పారు. అదే ఆయన చేసిన నేరమైంది. ‘నీ ఇంటికి పో.. నీ మట్టి దెయ్యాలను పూజించుకో.. నా దేశం నుంచి వెళ్లిపో..’ అంటూ అమెరికన్లలోని అతివాదులు ఆయన మీద సోషల్ మీడియాలో విరుచుకుపడ్డారు. ఇది ఒక్క కాష్ పటేల్‌కు ఎదురైన అనుభవం మాత్రమే కాదు. దీపావళి శుభాకాంక్షలు చెప్పిన పాపానికి ఐక్యరాజ్యసమితి మాజీ రాయబారి నిక్కీ హేలీ, అధ్యక్ష అభ్యర్థిగా తలపడిన వివేక్ రామస్వామి, పౌరహక్కుల అసిస్టెంట్ అటార్నీ జనరల్ హర్మీత్ థిల్లాన్ తదితరులందరికీ ఇలాంటి ట్రోలింగ్ తప్పలేదు. వైట్‌హౌస్ నుంచి, అమెరికా విదేశాంగ శాఖ నుంచి అధికారికంగా ‘ఎక్స్’లో పోస్టు చేసిన దీపావళి శుభాకాంక్షల సందేశాలకు టెక్సస్ గవర్నర్ గ్రెగ్ ఆబట్, అర్కాన్సాస్ గవర్నర్ సారా హకబీ సాండర్స్ వంటి ప్రముఖులకు కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. ‘హెచ్ 1బీ వీసా ఉన్న ఒక్కో ఉద్యోగి, పదిమంది అక్రమ వలసదారులతో సమానం’ అంటూ అమెరికా పోల్‌స్టర్ రాజకీయ వ్యాఖ్యాత మార్క్ మిచెల్ అనడం కూడా భారతీయులపై అసహనాన్ని వెళ్లగక్కడమే. వాళ్లందరినీ వెనక్కు పంపేయడానికి ట్రంప్ చర్యలు తీసుకోవడం లేదనేది ఆయన ఆవేదన.

‘ఎక్స్’లో ఒక యూజర్ ‘భారతీయుల ఉనికి వెగటు పుట్టిస్తోంది’ అని పోస్టు చేశాడు. ‘మేక్ అమెరికా గ్రేట్ అగైన్’ (మాగా) అనే నినాదాన్ని ట్రంప్ బాగా ప్రజల్లోకి తీసుకువెళ్లారు. ఏ దేశమైనా ఇలాంటి నినాదాన్ని ఆదరిస్తుంది. అయితే ఆ నినాదానికి ఆచరణ రూపం ఇతరులపట్ల ద్వేషాన్ని పెంచుకోవడమే అన్నట్టుగా అమెరికాలో చలామణీ అవుతోంది. అమెరికా శ్వేతజాతి క్రైస్తవులది మాత్రమే అని ప్రచారం చేస్తూ, ఆ మేరకు ఇతరుల్ని ద్వేషించడం

> **యథారాజా తథా ప్రజా అనే సామెత అందరికీ తెలిసిందే. పాలకుల్లో కొందరి ఆలోచనల్లోని విద్వేషాన్ని వారి వీరభక్తులు అందిపుచ్చుకుంటున్న తీరు అమెరికాలో అత్యంత ప్రమాదకర సంకేతంగా మారింది. అమెరికాలో ప్రభావశీల కమ్యూనిటీగా ఎదిగిన భారతీయుల పట్ల ట్రంప్ 2.0 ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్వేషం పెచ్చరిల్లుతోంది.**




తమ కర్తవ్యం అనుకుంటున్నారు.

అమెరికాలో స్థిరపడిన భారతీయులకు వ్యతిరేకంగా గత అక్టోబర్ ఒక్క నెలలోనే దాదాపు 2,700 పోస్టులను తమ బృందం రికార్డు చేసిందని, ఇవన్నీ జాతి విద్వేషాన్ని, జీనోఫోబియాను (విదేశీయుల పట్ల అకారణ భయం) రెచ్చగొట్టేలా ఉన్నాయని ‘సెంటర్ ఫర్ ది ఆర్గనైజ్డ్ హేట్’ వ్యవస్థాపకుడు రకీబ్ నాయక్ వెల్లడించారు. ‘ట్విట్టర్’ను ఎలాన్ మస్క్ చేజిక్కించుకుని, దానిని ‘ఎక్స్’గా మార్చిన తర్వాత ఇలాంటి పోస్టులు గణనీయంగా పెరిగాయని, ఇదివరకు కొంత కట్టడి ఉండేదని చెప్పారు. అయితే, ఈ విమర్శపై ‘ఎక్స్’ స్పందించలేదు.


ఈ ద్వేషాన్ని మరిన్ని కోణాల నుంచి కూడా గమనించాలి. అమెరికాలోని భారతీయుల పట్ల, అక్కడి పౌర సమాజంలో ఒక అసహనం నిర్మాణం కావడానికి కేవలం ట్రంప్ విధానాలు మాత్రమే కారణమా? అందులో మనవారి బాధ్యత/ పాత్ర ఏమీ లేదా– అని కూడా తర్కించి చూసుకోవాలి. అమెరికాలో సంఖ్యాపరంగా గణనీయంగా పెరుగుతున్న భారతీయుల ప్రవర్తన అనేక సందర్భాల్లో శ్రుతిమించుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఒక తెలుగు టాప్ హీరో సినిమా విడుదల అయితే ఎక్కడాలేనంత హడావుడి చేసి, ఏకంగా అమెరికాలో ట్రాఫిక్ స్తంభింపజేసిన సందర్భం ఉంది. అమెరికాలో భారతీయులు సంఖ్యాపరంగా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆధ్యాత్మిక ఉత్సవాల పేరిట కొన్ని రోడ్లను మూసివేస్తున్నారు, లౌడ్‌స్పీకర్లతో హోరెత్తిస్తున్నారు. బాణసంచా కాలుస్తున్నారు, నినాదాలతో సంబరాలు చేసుకుంటున్నారు. కొంతకాలం కిందట తెలుగువారు వేడుకలు చేసుకుంటున్న ఒక ప్రాంతంలో ట్రాఫిక్ మొత్తం స్తంభించిపోయింది. జనం మధ్యలో చిక్కుకుపోయిన ఒక అమెరికన్ కారు దిగి, తన తుపాకీ చూపి బెదిరించడంతో జనం కకావికలై పారిపోయారు. అలా ట్రాఫిక్ క్లియర్ చేసుకుని ఆయన వెళ్లాల్సి వచ్చింది. ఇలాంటి సంఘటనలు భారతీయులకు అమెరికన్ సమాజంలో ఉండే మర్యాదను పలుచన చేస్తున్నాయి. భారతదేశం నుంచి రాజకీయ నాయకులు వచ్చినప్పుడు చేసే హడావుడి కూడా భారతీయులకే వెగటు పుట్టించేంతగా ఉంటున్నది. ఎక్కడైనా సరే ‘లా ఆఫ్ ది ల్యాండ్’ అంటూ ఒకటి ఉంటుంది. మనం ఏ దేశంలో ఉంటే అక్కడి మర్యాదలను పాటించాలి. అక్కడి చట్టాలను గౌరవించాలి, అక్కడ జీవన శైలుల్ని అనుసరించాలి. అలా కాకుండా అమెరికన్ చట్టాలను అతిక్రమించేలా, మర్యాదలను ధిక్కరించేలా వ్యవహరిస్తే అది మనవారిపై విద్వేషం పెరగడానికి ఒక కారణం అవుతుంది.

ఏది ఏమైనప్పటికీ అమెరికాలో భారతీయులను ద్వేషించే నయా సంస్కృతి వేళ్లూనుకుంటోంది. ఏడాదిగా అలాంటి పరిణామాలు తారస్థాయికి చేరుకున్నాయి. రకరకాల కారణాలు ఇందుకు దారితీస్తున్నప్పటికీ, ఈ పరిస్థితుల్ని చక్కబెట్టుకోవడం మాత్రం భారతీయుల అవసరం. అందుకు మార్గాలను మనమే అన్వేషించుకోవాలి. ట్రంప్ విధానాలపరంగా పుట్టే ద్వేషం విషయంలో చేయగలిగేది లేకపోయినా అమెరికన్ సమాజంలో సామరస్య జీవనం దెబ్బతినకుండా చూసుకోవడం మన పరిధిలోని సంగతి అని గుర్తుంచుకోవాలి.

■ కృష్ణమోహన్ దాసరి
పాత్రికేయుడు, డల్లాస్



ముక్కోటికి ముస్తాబు



ముక్కోటి ఉత్సవాలకు వైష్ణవాలయాల్లో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. మంగళవారం వేకువజామున మూడు గంటల నుంచే వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వారం నుంచి స్వామివార్లను భక్తులు దర్శనం చేసుకు నేందుకు క్యూలైన్లు సిద్ధం చేశారు. ఆలయాలన్నీ.. విద్యుత్ కాంతు లీనుతూ ఆధ్యాత్మిక శోభను సం తరించు కున్నాయి. మంగళగిరిలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి రాత్రి జగన్మోహిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ముఖ మండపంలో బంగారు దక్షిణావృత శంకు తీర్థాన్ని భక్తులకు అందించనున్నారు.

\- మంగళగిరి



జగన్మోహిని అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీవారు



వెనుకబడిన ప్రగతి



మురుగు కాలువ నిర్మాణం

ఆదర్శ ఎస్సీ గ్రామాల లక్ష్యంలో నిర్లక్ష్యం

- నిధులున్నా.. పనుల్లో కనిపించని పురోగతి
- యంత్రాంగం నిర్లక్ష్యంతో నత్తనడకన అభివృద్ధి

షెడ్యూల్డ్ సామాజిక వర్గాల(ఎస్సీ) అభివృద్ధి కోసం కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎం ఏజేఏవై) అమల్లో అలసత్వం తాండిస్తోంది. నిధులున్నా ప్రణాళిక ప్రకారం పనుల ప్రగతి కనిపించడం లేదు. సకాలంలో పనులు పూర్తి చేయడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో ఎస్సీ ఆదర్శ గ్రామాల లక్ష్యం నీరుగారిపోతోంది. ఎస్సీ వర్గాలు అధికంగా ఉన్న గ్రామల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పీఎం ఏజేఏవైను కేంద్రం అమలు చేస్తోంది. పథకం అమలుకు పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు రూ.56.30 కోట్లు నిధులు విడుదల య్యాయి. ఎంపిక చేసిన ఆదర్శ గ్రామాల్లో మౌలిక వస తుల కల్పన కోసం నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. ప్రణాళికా బద్ధంగా నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాల్సి ఉండగా అధికార యంత్రాంగం పట్టిపట్టనట్లు వ్యహరిస్తోంది. పనులు జరగుతున్న తీరే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

జిల్లాల్లో ఎస్సీ ఆదర్శ గ్రామాలను అధికారులు గుర్తించారు. పీఎం ఏజేఏవై కింద ఎస్సీ జనాభా అధికంగా ఉన్న గామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం తాగునీటి వసతి, విద్యాభివృద్ధి, విద్యుత్, పరిశుభ్రత వంటి పనులను చేపడుతున్నారు. ఈ పథకం కింద విడుదలైన రూ.56.30 కోట్లతో 978 పనులు ప్రారంభించారు. వీటిలో ఇప్పటికి 35 పనులు పూర్తి చేసినట్లు ప్రగతి నివేదికలు తెలియజేస్తున్నాయి. పనులు జరగుతున్న తీరు పరిశీలిస్తే ఇప్పట్లో ఇవి పూర్తి అయ్యే పరిస్థితులు లేవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పల్నాడు జిల్లాలో 22 ఎస్సీ ఆదర్శ గ్రామాలను గుర్తించారు. రూ.7.68 కోట్ల (మిగతా 8వ పేజీలో)



సీసీ రోడ్డు నిర్మాణం


కొత్త పరిశ్రమలేవీ?

ఉమ్మడి గుంటూరులో కుదేలైన పారిశ్రామిక ప్రగతి

- ఐదేళ్లలో చెప్పుకోదగ్గ పరిశ్రమ ఒక్కటీ లేదు
- వైసీపీ ప్రభుత్వంలో పూర్తి నిర్లక్ష్యం..
- కూటమి ప్రభుత్వంలో అదే దుస్థితి
- మధ్యాంధ్ర పారిశ్రామికాభివృద్ధిపై శీతకన్ను!

ప్రభుత్వాలు మారినా.. పారిశ్రామికాభివృద్ధిలో ఉమ్మడి గుంటూరు జిల్లాపై శీతకన్ను ప్రదర్శిస్తూనే ఉన్నాయి. మధ్యాంధ్రపై ఆదినుంచి కొనసాగుతున్న నిర్లక్ష్యం.. గుంటూరు జిల్లాపై కూడా తీవ్రంగా ఉంది. కేవలం వ్యవసాయ రంగం పైనే దృష్టి సారించడం వల్ల.. పారిశ్రామికంగా ఈ ప్రాంతం ముందు కెళ్లే అవకాశమే లేకుండా పోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాల్లో చెప్పుకోదగ్గ పరిశ్రమలు ఒకటీ అరా తప్ప లేవంటే ఆశ్చర్యం కాకపోవచ్చు. గత వైసీపీ ప్రభుత్వంలో మొత్తంగా పారిశ్రామిక రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. ఆ సమయంలో ఉమ్మడి గుంటూరులో ఒక్క పరిశ్రమ స్థాపన కూడా జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అదే పరిస్థితి కొనసాగడం విషాదం. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన పెట్టుబడుల సదస్సులో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు వచ్చిన పెట్టుబడులు లేవనే చెప్పాలి. రూ.44,600 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా.. అవన్నీ రాజధాని అమరావతి పరిధి లోనివే కావడం విశేషం. రాజధానేతర ప్రాంతాల్లో వచ్చిన పరిశ్రమలు, పెట్టుబడుల మాటేమిటి అంటే ప్రశ్నార్థకమే.

గుంటూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పారిశ్రామిక రేసులో పూర్తిగా వెనుకబడిపోయింది. భవిష్యత్తులో కొత్త పరిశ్రమలు వస్తాయన్న ఆశలు కూడా లేవు. ఎందుకంటే ఇప్పటికే జరిగిన ఎంఓయూల్లో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పేర్లు వినిపించ లేదు. కూటమి ప్రభుత్వం 16 నెలల్లో స్టేట్ ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) ఆమోదించిన (మిగతా 8వ పేజీలో)





4929 పింఛన్లపై అనర్హత వేటు!

- భూమిలేని పేదల పింఛన్లలో భారీ సంఖ్యలో భూములున్న రైతులు
- ప్రస్తుతం అమరావతిలో పింఛనుదారులు 17,593 మంది..
- వారిలో 4,929 మంది పేర్లతో అనర్హుల జాబితా

8

అయ్యో పాపం.. ఏబీ పాలెం

- పంచాయతీ ఓ చోట.. సచివాలయం మరో చోట
- వైసీపీ రాజకీయంతో శివారు గ్రామంలో ఏర్పాటు
- మార్పు కోసం గ్రామస్థుల సుదీర్ఘ పోరాటం

8

జోరుగా నకిలీ విత్తనాల అమ్మకాలు

8

- గుంటూరు జిల్లాలో విచ్చలవిడిగా విక్రయం
- అధికారులకు ఫిర్యాదుల వెల్లువ

అడిగొప్పుల జంట హత్యల కేసు..

- మరో నలుగురు నిందితులకు రిమాండ్
- గురజాల సబ్ జైలుకు తరలింపు

6

ఇన్‌చార్జిల చేతిలో పంచాయతీల పాలన

- మేజర్ పంచాయతీలకు కార్యదర్శుల కొరత
- కుంటుపడుతున్న పారిశుధ్య నిర్వహణ

తాడికొండ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): తాడి కొండ మండల పరిధిలోని గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జిలే దిక్కయ్యారు. మేజర్ పంచాయతీలకు కార్యదర్శుల కొరత కారణంగా పారిశుధ్య పనుల్లో తీవ్రజాప్యం జరుగుతోంది. మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో తాడికొండ, రావెల, కంతేరు, పాముల పాడు, దామరపల్లి గ్రామాలకు పంచాయతీ కార్యదర్శులుగా ఇన్‌చార్జిలను నియమిం చడం జరిగింది. తాడికొండ, పాములుపాడు, కంతేరు గ్రామాల్లో సెక్రటరీలకు పదోన్నతులు రావడంతో అక్కడ ఖాళీలు ఏర్పడ్డాయి. తాడికొండ, రావెల, కంతేరు మేజర్ పంచాయతీలుగా ఉన్నాయి. తాడికొండకు లాం పంచాయతీ కార్యదర్శి, రావెలకు మోతడక కార్యదర్శి, కంతేరుకు నిడుముక్కల కార్యదర్శి, పాములపాడుకు బేజాత్‌పురం కార్యదర్శి, దామరపల్లికి ఫణిదం కార్యదర్శి ఇన్‌చార్జిలుగా ఉన్నారు. తాడికొండ, లాం మేజర్ పంచాయతీలకు ఒక్కరే కార్యదర్శి కావడంతో.. పాలన కుటుంపడుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పారిశుధ్య కార్మికులకు సక్రమంగా జీతాలు ఇవ్వకపోవటంతో.. వారు ఆందోళనకు దిగి.. విధులకు రావడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు ఆ పార్టీ మద్దతు దారులే.. అధికంగా సర్పంచ్‌లుగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ సర్పంచ్‌లు గ్రామాల్లో ప్రజా పాలనను గాలికొదిలేశారు. టీడీపీ మద్దతు దారులుగా ఉన్న సర్పంచ్‌లు మాత్రం గ్రామస్తులకు అందుబాటులో ఉంటున్నారు. తాడికొండ, రావెల, కంతేరు గ్రామాలకు పూర్తిస్థాయి కార్యదర్శుల అవసరం ఎంతైన ఉందని గ్రామస్తులు కోరుతున్నారు.



గుంటూరు విశిష్టత చాటిచెప్పేలా

సారస్

- జనవరి 6 నుంచి 18 వరకు ప్రదర్శనలు
- రెడ్డి కాలేజ్ ఎదురు స్థలంలో ఏర్పాట్లు
- వివరాలు వెల్లడించిన కలెక్టర్ అన్సారియా

గుంటూరు సిటీ, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): సారస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ) ప్రదర్శనను జనవరి 6 నుంచి 18వ తేదీ వరకు గుంటూరులో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయంలో సోమవారం సంబంధిత అధికారులతో ఆమె సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. గుంటూరు పట్టణంలో నర్సరావుపేట రహదారిలోని రెడ్డి కళాశాల ఎదురుగా ఉన్న స్థలంలో ప్రదర్శన శాలలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో మొదటిసారిగా జాతీయస్థాయి సారస్ కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. ఇది మినీ భారత సాంస్కృతిక, కళా సమ్మేళనంను తలపిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఆరు వందల మందికి పైగా చేనేత, హస్త కళాకారులు, సాంస్కృతిక కళాకారులు వస్తున్నారని, 250కు పైగా ప్రదర్శన శాలలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇందులోని దేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతులు ప్రతిబింబించే చేనేత, హస్తకళలు, హ్యాండ్లూమ్స్, హ్యాండి క్రాఫ్ట్స్, షాల్స్, కార్పెట్లు, బెడ్ షీట్‌లు, వెదురు, లోహ, గాజు ఉత్పత్తులు, సాంప్రదాయ, ఆర్గానిక్ ఆహార పదార్థాలు, ఆభరణాలు, గృహ అలంకరణ వస్తువులు, ఆహార పదార్థాల ఉత్పత్తులు ప్రదర్శన, విక్రయం జరుగుతుందన్నారు. ఇందులో గుంటూరు సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక విశేషాలు తెలియజేసి జిల్లా విశిష్టతను చాటిచెప్పేలా వేదికగా మలచాలని కలెక్టర్ అన్సారియా అధికారులకు పిలుపునిచ్చారు. పారిశుధ్య నిర్వ హణ, అమ్యూజిమెంట్ పార్క్, పార్కింగ్, రద్దీ నియం త్రణ, ఆహార పదార్థాల నాణ్యత తదితర అంశాలపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేశం నలుమూలల నుంచి ఈ కార్యక్రమం లో స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నందున వారి సురక్షిత భద్రత బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పర్యావరణ హిత సామగ్రిని వినియోగిస్తూ ప్లాస్టిక్ నిషేధిత జోన్‌గా, స్వచ్ఛతకు శ్రీకారం చుట్టే విధంగా తీర్చిదిద్దాలన్నారు. జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో వి.జ్యోతి బసు, సెర్ఫ్ డిప్యూటీ సీఈవో ఎ.కల్యాణ చక్రవర్తి, డీఎంఅండ్ హెచ్‌వో కె.విజయలక్ష్మి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

రెవెన్యూ క్లినిక్..

- అర్జీదారుల నుంచి మిశ్రమ స్పందన
- సమస్యల పరిష్కారంపై ఆశాభావం
- కలెక్టర్ తీసుకోలేని నిర్ణయాలపై చర్యలేంటని ప్రశ్న

గుంటూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్(పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రెసెల్ సిస్టం)లో రెవెన్యూ క్లినిక్ నిర్వహణపై అర్జీదారుల నుంచి మిశ్రమ స్పందన లభించింది. గ్రామ సచివాలయం నుంచి వివిధ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పిందని కొందరు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పుడు పీజీఆర్ఎస్‌కు వచ్చిన వాళ్లంతా గతంలో డీటీ మొదలుకొని కలెక్టర్ వరకు కలిసి వినతిపత్రాలు సమర్పించిన వారేనని.. అయితే పైస్థాయిలో తీసుకునే నిర్ణయాలకు.. ఈ క్లినిక్‌లో ఎలాంటి పరిష్కారం చూపుతారో చెప్పడం లేదని మరికొందరు అంటున్నారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సంహా, గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు, అన్ని మండలాల తహసీల్దార్లు, కొందరు డీటీలు సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ క్లినిక్‌లో పాల్గొన్నారు. సాయంత్రం వరకు ఇక్కడే ఉండటంతో మండలస్థాయి గ్రీవియన్స్ పరిస్థితి ఏంటన్న సందేహాలు వ్యక్తమయ్యాయి.

- భర్తతో దూరంగా ఉన్న కారణంతో.. పసుపు, కుంకుమ కింద పుట్టింటి వాళ్లిచ్చిన అర ఎకరానికి.. అత్తింటిలోని ఒకరిపై అధికారులు పాస్‌పుస్తకం ఇచ్చారని తాడికొండ మండలం, నిడుముక్కలకు చెందిన కమిలిబీ తెలిపారు. కోర్టు పరిధిలోని ఈ వివాదంపై ఏళ్ల తరబడి తిరుగుతూ.. రెవెన్యూ క్లినిక్‌లో తహసీల్దారుకు అర్జీ ఇస్తే త్వరలో న్యాయం చేస్తానని చెప్పారని పేర్కొన్నారు.
- తనకు సంక్రమించిన మాగాణి భూమి సర్వే నంబర్లపై.. వెబ్‌ల్యాండ్‌లో వేరే పట్టాదారులు నమోదయి ఉన్నారని పొన్నూరు మండలం కొండమది గ్రామానికి చెందిన వడాలశెట్టి అశోక్ కుమార్ తెలిపారు. సమస్యను పరిష్కరించాలని మార్చి నెల నుంచి తిరుగుతున్నా.. పట్టించుకోలేదన్నారు. అయితే రెవెన్యూ క్లినిక్ ద్వారా పరిష్కారం లభిస్తుందన్న ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.
- అంకిరెడ్డిపాలెంలో ప్రభుత్వం పట్టాలిచ్చిన 29 ఎకరాల తమ భూమిని.. రెవెన్యూ అధికారులు 22ఏలో చేర్చారని.. గుంటూరులోని ఎస్‌వీఎన్ కాలనీకి చెందిన పాండురంగ ప్రసాదు, సత్యన్నారాయణ తెలిపారు. హైకోర్టును ఆశ్రయిస్తే తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని.. అయినా అధికారులు చర్యలు తీసుకో వడం లేదన్నారు. భూమి వర్గీకరణని మార్చాలని 2006 నుంచి తిరుగుతున్నామన్నారు. దీనిపై నిర్ణయం చేయాల్సిన అధికారం సీసీఎల్ఏ/రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ స్థాయిలో ఉంటుందన్నారు. వాళ్లు రెవెన్యూ క్లినిక్‌కి రానప్పుడు సమస్య ఎలా పరిష్కారం అవుతుందని ప్రశ్నించారు.



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

తగ్గుముఖం పట్టిన నేరాలు

- నూతన సంవత్సరం మరింత సమర్థంగా పోలీసింగ్
- 2025 నేర సమీక్షలో ఎస్పీ వకుల్‌జిందాల్

గుంటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమర్థవంతమైన పోలీసింగ్ కారణంగా ఈ ఏడాది నేరాలను కొంతవరకు నియంత్రించగలిగామని ఎస్పీ వకుల్‌జిందాల్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన 2025 నేర సమీక్ష సమావేశంలో పోలీసుల పనితీరు, విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లను వివరించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పోలీస్ శాఖ ఎన్నో సవాళ్లను సమర్థంగా తిప్పి కొట్టి శాంతిభద్రతల పరిరక్షణలో మెరుగైన ఫలితాలు సాధించామన్నారు. ఈ ఏడాది సాంకేతిక పరిజ్ఞానంతో దోపిడీ, వరుస చోరీలు, హత్యలు, వృద్ధ మహిళలు, ట్రాన్స్‌జెండర్ హత్య, ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ మోసాలు వంటి అత్యంత క్లిష్టమైన కేసులను సమర్థంగా ఛేదించామని ఎస్పీ తెలిపారు. 76 అత్యాచారం కేసులు నమోదు కాగా, గతేడాదితో పోలిస్తే ఆరు శాతం తగ్గాయన్నారు. ఈ కేసుల్లో ఎక్కువ శాతం ప్రేమ వ్యవహారాలకు సంబంధించిన టెక్నికల్ రేప్ కేసులుగా గుర్తించామన్నారు. గతేడాది 10,252 కేసులు నమోదైతే.. ఈ ఏడాది ఆ సంఖ్య 8,937 పరిమితమై.. 13 శాతం కేసులు తగ్గాయని వెల్లడించారు. పోలీస్ శాఖ అవగాహన కార్యక్రమాలు, కఠినంగా చట్టాల అమలు వల్ల ఈ సానుకూల ఫలితం సాధ్యమైందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాద మరణాలు 25 శాతం తగ్గాయని, 91 కేసుల్లో 221 కిలోలకుపైగా గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. సైబర్ నేరాల్లో రూ.1.47 కోట్లకు పైగా రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. 102 సైబర్ కేసులు నమోదు కాగా.. 2024తో పోలిస్తే 10 తగ్గాయన్నారు. కోర్టు శిక్షల్లో చరిత్రాత్మక పురోగతి సాధించామన్నారు. 3,397 కేసుల్లో నిందితులకు శిక్షలు పడగా, లోక్ అదాలత్ ద్వారా 7,634 కేసులు పరిష్కారించినట్లు వెల్లడించారు. సంకల్పం కార్యక్రమం ద్వారా గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు విస్తృ ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. పోలీసుశాఖ అవగాహన సదస్సుల ఫలితం.. దాడి కేసులు 7 శాతం, చోరీ కేసులు 3 శాతం, చీటింగ్, ఇతర నేరాలు 25 శాతం వరకు తగ్గాయన్నారు. అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాలను అదుపులోకి తీసుకొని.. రూ. 11.88 కోట్ల విలువైన ఆస్తి రికవరీ చేయడమే కాకుండా, 176 కేసుల్లో బాధితులకు తిరిగివ్వడం జరిగిందన్నారు. 11 మంది రౌడీ షీటర్లు, గంజాయి వ్యాపారంలో ఉన్న మరో 13 మందిపై పీడీ యాక్ట్ ప్రయోగించినట్లు ఎస్పీ వెల్లడించారు. జిల్లాలో ఉన్న 1458 మంది రౌడీషీటర్లలో, చురుకుగా ఉన్న 955 మందిపై నిరంతర నిఘా పెట్టి.. మిగిలిన వారిని కనిపెట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని చెప్పారు. నూతన సంవత్సరంలో సమర్థ పోలీసింగ్‌తో ప్రజలకు ఉత్తమ సేవలు అందించడాని తకి పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేస్తారని ఎస్పీ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రమణమూర్తి, ఎ.హనుమంతు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాస్, డీసీఆర్‌బీ సీఐ నరసింహారావు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

రసవత్తరంగా ఒంగోలు జాతి ఎడ్ల పోటీలు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల పోటీలు నరసరావుపేట డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో రసవత్తరంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఐదో రోజు సబ్ జూనియర్స్ పోటీలను ఆడియో కాల్ ద్వారా వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించారు. నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో సాగుతున్న ఎడ్లపోటీలను గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్, కలెక్టర్ కృతికా శుక్లా, జీజీఎంఎస్ చైర్మన్ వజ్జాల హరిబాబు, ఎస్పీవీ ఆఫీసు రవిశంకర్ సందర్శించారు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలలో ఎడ్ల పందేలు బాగమని వారు అన్నారు. ఈ మూడు రోజు లలో పోటీలను సుమారు పదివేల మంది తిలకించినట్లు నిర్వాహక కమిటీ అంచనా వేసింది. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకుడు కొల్లి బ్రహ్మయ్య, వానిరెడ్డి రవీంద్ర, డాక్టర్ చదలవాడ కృష్ణమోహన్, షేక్ మన్నాన్ షరీఫ్, రాయల శ్రీనివాసరావు, వనమా సాంబశివరావు, గట్టుపల్లి సత్యనారాయణ, కనుమూరి రాజ్యలక్ష్మి, కవలవాయి విజయకుమార్, కడియాల తాండవకృష్ణ, కూటమి నాయకులు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.



అడిగొప్పుల జంట హత్యల కేసు..

● మరో నలుగురు నిందితులకు రిమాండ్

● గురజాల సబ్ జైలుకు తరలింపు

దుర్గి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పుల జంట హత్యల కేసులో మరో నలుగురిని దుర్గి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏ4 బండ్ల గురవయ్య, ఏ12 చల్లా సాయికిశోర్, ఏ13 రెంటాల రాజారావు, ఏ14 కొనకంటి మహేష్‌ను ఆదివారం ఒప్పిచర్ల గ్రామం వద్ద కారంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు నేతృత్వంలో అదుపులోకి తీసుకున్నట్లు దుర్గి ఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపారు. వీరిని సోమవారం మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి శ్రీనివాస కళ్యాణ్ వీరికి 14 రోజులపాటు రిమాండ్ విధించారని చెప్పారు. నిందితులను రిమాండ్ నిమిత్తం గురజాల సబ్ జైలుకు తరలించామని తెలిపారు. మిగిలిన నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని ఎస్‌ఐ సుధీర్‌కుమార్ చెప్పారు. అడిగొప్పుల గ్రామానికి చెందిన కొత్త శ్రీరామమూర్తి, అతని సోదరుడు కొత్త హనుమంతరావును ప్రత్యర్థులు ఈ నెల 21వ తేదీన మారణాయుధాలతో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశారు. ఈ కేసులో మొత్తం 14 మందిని పోలీసులు నిందితులుగా గుర్తించారు.

యార్డును అగ్రపథంలో నిలపాలి

● యార్డు చైర్మన్‌కు సీఎం చంద్రబాబు సూచన ● సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన చైర్మన్





ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన కుర్రా అప్పారావు

గుంటూరు (తూర్పు), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులను, వ్యాపారులను సమన్వయం చేసుకుంటూ గుంటూరు మిర్చి యార్డును దేశంలోనే అగ్రగామిగా నిలపాలని యార్డు చైర్మన్ కుర్రా అప్పారావుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సోమవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రికి కుర్రా అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు. మిర్చి రైతుల సంక్షేమం, మార్కెట్ అభివృద్ధి, పారదర్శక పాలన దిశగా నిబద్ధతతో బాధ్యతాయుతంగా పనిచేస్తానని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని కార్యకలాపాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారని కుర్రా అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కుర్రా అప్పారావు మర్యాదపూర్వకంగా కలిశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యార్డులో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని యార్డు చైర్మన్‌కు అచ్చెన్నాయుడు సూచించారు.

కలెక్టర్ పేరిట నకిలీ ఫేస్‌బుక్ ఖాతా

బాపట్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ పేరిట నకిలీ ఫేస్‌బుక్ ఖాతాను సృష్టించారు. కలెక్టర్ ప్రొఫైల్ చిత్రంతో ఉన్న ఈ ఖాతా ద్వారా ఉద్యోగులకు, అధికారులకు సందేశాలు పంపిస్తున్నారు. కలెక్టర్ స్నేహితుడైన సీఆర్‌పీఎఫ్ అధికారి సంతోష్‌కుమార్ బదిలీ అయినట్టు చెబుతూ ఇంటి పర్నీచర్, గృహోపకరణాలు చాలా తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు సందేశాలు పంపించారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. తన పేరిట ఎవరో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా సృష్టించారని దానిని చూసి మోసపోవద్దని సూచించారు. నకిలీ ఖాతాల ద్వారా ఫేస్‌బుక్‌లో మోసపూరిత సందేశాలు పంపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

మిర్చియార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)

వచ్చిన బస్తాలు	56,257	
అమ్మకాలు	53,482	
నిల్వ	11,060	
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	12000	15300
273	---	----
341	11000	17000
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	16500
షార్క్-1	-----	----
బ్యాడిగి	11000	17000
దేవనూరు డీలక్స్	11000	17500
ఆర్మూరు	10000	13000
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	16700
నెంబరు. 5	11000	15000
273	----	----
341	11000	16500
4884	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14800
బ్యాడిగి 355	10000	16500
దేవనూరు డీలక్స్	12000	17300
తాలుకాయలు	5000	7700

అనకాపల్లిలో రైలు ప్రమాదంతో రెండు రైళ్లు ఆలస్యం

గుంటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో జరిగిన రైలు దుర్ఘటన దృష్ట్యా విశాఖపట్టణం నుంచి గుంటూరుకు రావాల్సిన రెండు రైళ్లు ఆలస్యంగా గమ్యస్థానానికి చేరుకు న్నాయి. రైలు నంబరు 12805 విశాఖప ట్టణం-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ సోమవారం మధ్యాహ్నం 1.10కి రావాల్సి ఉండగా 4.20 తర్వాత వచ్చింది. అలానే రైలు నంబరు 17240 విశాఖపట్టణం-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 3.55 గంటలకు రావాల్సి ఉండగా సాయంత్రం 6.20కి వచ్చింది. దీంతో ప్రయాణికులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	147, 156, 167
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఆప్కో జీఎంలు కన్నబాబు, నాగేశ్వరావు

ఆప్కో వస్త్రాలపై 60 శాతం డిస్కౌంట్

మంగళగిరి సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల ఆప్కో చేనేత వస్త్రాలపై 60 శాతం ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తున్నట్టు ఆప్కో జనరల్ మేనేజర్లు కె.కన్నబాబు, ఎం.నాగేశ్వరరావు తెలిపారు. మంగళగిరి ఆప్కో తోట వద్ద గల షోరూంలో ఆప్కో క్లియరెన్స్ కౌంటర్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ కౌంటర్‌లో ధర్మవరం, చీరాల, మాధవరం తదితర పట్టుచీరలు, బందరు, చీరాల, మంగళగిరి కాటన్ చీరలు, లుంగీలు, టవళ్లు, ధోవతులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ ఆఫర్ జనవరి 12వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్కో ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్ డి.ఆదినారాయణరావు, ఏఎంవో డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కుమారులు చూడటం లేదయ్యా...

పోలీసులను ఆశ్రయించిన 107 ఏళ్ళ వృద్ధురాలు

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుమారులు చూడటం లేదయ్యా... అంటూ 107 ఏళ్ల వృద్ధురాలు సోమవారం సత్తెనపల్లి రూరల్ పోలీసులను ఆశ్రయించింది. మండలంలోని గర్నెపూడి గ్రామానికి చెందిన పేరుపోగు అన్నమ్మకు పది మంది సంతానం. వీరిలో ఏడుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భర్త 48 ఏళ్ళ క్రితమే మృతి చెందాడు. తనకున్న ఎకరమున్నర భూమిని ఎప్పుడో కుమారులకు పంచి పెట్టింది. అప్పటి నుంచి ఆమె ఒంటరిగానే ఉంటుంది. ఏడుగురు కుమారుల్లో ఒక్కరు కూడా అన్నమ్మ బాగోగులు చూడటం లేదు. 107 ఏళ్ళ వయసులో ఆమె ఏ పని చేసుకోలేక దీనావస్థలో ఉంది. దీంతో ఆమె రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అన్నమ్మ ఫిర్యాదుపై విచారణ చేపట్టినట్టు రూరల్ పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణపై పటిష్ట చర్యలు చేపట్టండి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అహ్మద్ సూచించారు. పాతగుంటూరు పోలీస్ స్టేషన్లో ఈస్ట్ పరిధిలోని పోలీస్ అధికారులు ప్రసాద్, వీరయ్యా చౌదరి, శివ ప్రసాద్ తదితరులతో ఆయన సమావేశమయ్యారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ బస్టాండ్ వద్ద ప్రైవే ట్ బస్సుల కారణంగా కలిగే ట్రాఫిక్ ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారిం చాలన్నారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలపై యువతను చైతన్యం చేయాలని సూచించారు.

వక్ఫ్ భూమి సేకరణ నోటిఫికేషన్ విరమించుకోవాలి

● ముస్లిం ప్రజా సంఘాల తీర్మానం

గుంటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలంలోని చినకాకానిలో 72 ఎకరాల వక్ఫ్ భూమిని ఇండస్ట్రియల్ పార్కు కోసం కలెక్టర్ తమీమ్ అన్సారియా జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్ని ఉపసంహరించుకోవాలని ముస్లిం ప్రజా సంఘాలు కోరాయి. పాత గుంటూరులోని అంజుమన్ షాదీకానాలో అంజుమన్ హమారా - హక్ హమారా అనే నినాదంతో సోమవారం ముస్లిం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి ముస్లిం యూనైటెడ్ ఫ్రంట్ ఎండీ ఖలీం అధ్యక్షత వహించారు. ఈ మీటింగ్‌కు తూర్పు ఎమ్మెల్యే నసీర్, మాజీ ఎమ్మెల్యేలు నంబూరు సుభాని, షేక్ మస్తాన్‌వలి, సీపీఎం నుంచి నళినీకాంత్, నూరి ఫాతిమా, లియాఖత్, షౌకత్, గౌస్ తదితరులు హాజరయ్యారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రభుత్వం అక్కడ ఐటీ పార్కుని ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తోన్నదన్నారు. దీనిపై ఇద్దరు హైకోర్టు అడ్వొకేట్‌లు, రిటైర్డు ముస్లిం ఐఎఎస్ అధికారులు, ముస్లిం నేతలతో ఒక కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం చేయించి ఆ తర్వాత నిర్ణయం తీసుకొందామన్నారు. అలానే నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఎవరైనా తమ అభిప్రాయాలను కలెక్టర్‌కు తెలియజేయవచ్చన్నారు. కాగా సమావేశానికి హాజరైన ఇతర ముస్లిం మైనార్టీ నాయకులంతా భూసేకరణ నోటిఫికేషన్‌ని వ్యతిరేకించారు. తమ అభిప్రాయాల రూపంలో కలెక్టర్‌కు నివేదించాలని నిర్ణయించారు.

పీజీఆర్ఎస్‌కు అధికారులు విధిగా హాజరుకావాలి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర


అర్జీలు సేకరిస్తున్న నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌కు అన్ని విభాగాల అధికారులు హాజరుకావాలని, ప్రజలు అందించే ఫిర్యాదులు, అర్జీలను విభాగాధిపతులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత గడువు మేరకు పరిష్కరించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం డయల్ యువర్ కమిష నర్, నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో జరిగిన పీజీఆర్ఎస్‌లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ ప్రజలు సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 12 ఫిర్యాదులు తీసుకొని, అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ ద్వారా 31 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, సిటి ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, మేనేజర్ బాలాజీబాషా పాల్గొన్నారు.

డ్రైనేజ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలి : కమిషనర్

నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు తగిన డ్రైనేజి సిస్టం ఏర్పాటు చేసుకొని, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ సోమవారం కృష్ణబాబు నగర్, వికాస్ నగర్, జేకేసీ నగర్ ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జనవరి 3 నుంచి నగరంలోని నల్లపాడు రోడ్డులో జరగనున్న సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిషియన్స్ సొసైటీ (సరాస్) మేళా జరిగే ప్రాంతంలో పనులు వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈ (ఇన్‌చార్జి) సుందర్రామిరెడ్డి, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

గీతామందిరం ఛైర్మన్‌గా రత్నప్రసాద్ నియామకం చెల్లదు

● ఛైర్మన్‌గా నేడు జుజ్జూరి ప్రమాణస్వీకారం

గుంటూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీ కన్యకా పరమేశ్వరి ధర్మ సత్ర సంఘం (గీతా మందిరం) ఛైర్మన్‌గా రత్నప్రసాద్ నియామకం చెల్లదని ఆర్యవైశ్య సంఘం నేత, 35వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, సంఘం ఈసీ సభ్యుడు కొనకళ్ళ సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ ప్రకటించిన రత్నప్రసాద్ నియామకానికి అర్హత లేదన్నారు. తాజాగా ఏపీ ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి ఎస్.షణ్ముగరావు నూతనంగా జుజ్జూరి శ్రీనివాసరావుతో పాటు 13 మందితో కూడిన కార్యవర్గాన్ని ప్రకటించినట్లు తెలిపారు. గీతామందిరం ఛైర్మన్‌గా శ్రీనివాసరావు మంగళవారం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి తూర్పు ఎమ్మెల్యే నసీర్, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, క్రేన్ గ్రూపు సంస్థల ఛైర్మన్ గ్రంధి కాంతారావుతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బారాయుడు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించిన ధర్నా నిర్వహించారు. అనంతరం యూనియన్ నాయకులు మేయర్ కోవెలమూడి రవీంద్రకు వినతిపత్రం అందజేశారు.

శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలి : ఎస్పీ

గుంటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ మద్యం సేవించి రోడ్లపైకొచ్చి అల్లర్లు, గొడవలు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 31న రాత్రి పెద్ద ఎత్తున పోలీస్ పికెట్లు, తనిఖీలు ఉంటాయని ఎస్పీ అన్నారు. నగరంలో కొన్నిచోట్ల నిబంధనల ప్రకారం అనుమతి తీసుకున్న వారికి నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని అవకాశం కల్పించామన్నారు.

దాడి కేసులో బావమరిది, నిందితుల అరెస్టు

గుంటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : చంద్రమౌళినగర్, మూడో లైన్‌లో ఈ నెల 27న రాత్రి జరిగిన కొట్లాటకి సంబంధించి నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కొరిటెపాడు హనుమయ్య నగర్‌కు చెందిన పాటిబండ్ల సుమన్‌ను తన బావమరిది ఊరే గణేష్, ఊరే సైదులు, ఊరే రోహిత్‌కుమార్, వసుకుల అజయ్, మేకల శివమణిలతో కలిసి తన చెల్లెలను బావ సరిగా చూసుకోవడం లేదని కొట్టి గాయపరిచినందున ఐదుగురిని సోమవారం పట్టాభిపురం ఎస్ఐ నాగేంద్ర అరెస్టు చేశారు.

మార్వాడీ ఆలయంలో చోరీ

ఆర్ అగ్రహారం రాయ బహదూర్ మేడ వెనక గల బాబా రాందేవ్ అంజేశ్వర్ మహదేవ్ ఆలయంలో 28న రాత్రి చోరీ జరిగింది. సుమారు మూడు కేజీల వెండి ఆభరణాలు దొంగిలించారని, ఆలయ ట్రస్టీ అయిన రాజ పురోహిత్ జగదీష్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదుపై లాలాపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల సంతృప్తి స్థాయి మెరుగుపడాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

● పీజీఆర్ఎస్‌కు 348 అర్జీలు


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పాల్గొన్న డీఆర్వో ఖాజావలి తదితరులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించి ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలని అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. డీఆర్వో ఖాజావలీ, ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 348 అర్జీలు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలను క్షేత్రస్థాయిలో సక్రమంగా విచారించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ, జడ్పీ సీఈవో జ్యోతిబసు, పశుసంవర్ధకశాఖ జేడీ కేవీవీ సత్యనారాయణ, ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు, అగ్రికల్చరల్ జేడీ పద్మావతి, డీపీవో నాగసాయికుమార్, డ్వామా పీడీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక అడవి తక్కెళ్ళపాడు, సర్వే నెంబరు 600/1లో గతంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్న అర్హులైన వారికి ఇంటి పట్టాలివ్వాలని కోరుతూ గుంటూరు మొబైల్ లాండ్రీ యూనియన్ ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో మిరంపల్లి బాలలింగయ్య, నరసింహారావు, ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.

● సింహాచలం, శ్రీ వరాహ లక్ష్మీనరసింహ భూములను ఏపీఐఐసీకి అప్పజెప్పాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. రాష్ట్రాభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, కాకపోతే ఆ నిర్ణయం సరైనది కాదన్నారు.

● స్థానిక 1వ వార్డు, వేంకటేశ్వరకాలనీలో ఉన్న గణపతి విజయదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం అధీనంతో ఉన్న 500 గజాల స్థలాన్ని కొంతమంది ఆక్రమిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని హిందూ చైతన్య వేదిక సభ్యులు అర్జీ అందజేశారు. అదే లైన్లో ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్మాణాన్ని చేపట్టారని, దానిని నిలుపుదల చేసేందుకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

● కరెంటు బిల్లు అధికంగా వస్తుందనే కారణంతో 2021లో వితంతు పెన్షన్ నిలుపుదల చేశారని స్థానిక కొండా వెంకటప్పయ్య కాలనీకి చెందిన ఐ.మరియా రుధర్స్ అనే వృద్ధురాలు అర్జీ అందజేశారు. పెన్షన్ అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ స్పందించి తగు న్యాయం చేయాలని కోరారు.

యూటీఎఫ్ డైరీ ఆవిష్కరించిన కలెక్టర్

గుంటూరు(విద్య), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరపు డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు యు.రాజశేఖర్, ఎం.కళాధర్, హనుమంతరావు, షకీలా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్, డైరీ..

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్, డైరీ పాఠశాల విద్యా సంయుక్త సంచాలకులు బి.లింగేశ్వరరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్, తదితరులు పాల్గొన్నారు

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలి

గుంటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా సమస్యలపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు రాజీలేని పోరాటం చేయాలని యూత్ కాంగ్రెస్ గుంటూరు జోనల్ ఎన్నికల అధికారి త్రిభువన పిలుపునిచ్చారు. రాజీవ్‌గాంధీభవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్‌కు జనవరిలో సంస్థాగత ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కట్టా జవహర్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె పవన్‌తేజ, పగడాల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బిళ్ళా సునీల్, నాయకులు బ్రహ్మం, హనుమంతరావు, రాము, మున్ని, గాలం శ్రీనివాసరావు తదితరులున్నారు.

మనస్థాపంతో భర్త ఆత్మహత్య

గుంటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగడిగుంట 7వ లైన్‌లో నివాసం ఉంటున్న షేక్ బాజీ సైదా(35) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. తాపీ పని చేసే బాజీసైదా భార్య సుమారు రెండు సంవత్సరాల క్రితం ఉరివేసుకుని చనిపోయింది. దీనిపై భార్య కుటుంబ సభ్యులు ఆయనపై కేసు పెట్టారు. కోర్టు వాయిదాలకి హాజరవుతూ మనస్థాపంతో ఈనెల 28న ఇంట్లో ఉరివేసుకుని చనిపోయాడు. మృతుని తల్లి షేక్ జహీరాబాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


తాడిశెట్టి మురళికి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేస్తున్న వెచ్చా, రాధా, శ్రీను తదితరులు

ముందస్తుగా తాడిశెట్టి జన్మదిన వేడుకలు

గుంటూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఈవీవీ యువ కళావాహిని ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ నేత తాడిశెట్టి మురళీమోహన్ ముందస్తు జన్మదిన వేడుకలు నవభారత్‌నగర్‌లోని కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈవీవీ యువ కళావాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి, మాజీ కార్పొరేటర్ అడపా కాశీవిశ్వనాధం, మాదా రాధాకృష్ణమూర్తితో పాటు పలువురు నాయకుల సమక్షంలో తాడిశెట్టి మురళీ కేక్ కట్ చేశారు. వాస్తవానికి మంగళవారం జన్మదిన వేడుకలు జరుపుకోవాల్సి ఉండగా ఆయన అందుబాటులో ఉండని నేపథ్యంలో ముందస్తు వేడుకలు నిర్వహించినట్లు వెచ్చా తెలిపారు. అనంతరం తాడిశెట్టి చేతుల మీదుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుంకర సతీష్‌కుమార్, కొండెబోయిన శ్రీను, అన్నంరాజు సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధుల నియంత్రణకు టాస్క్‌ఫోర్స్ కమిటీ

గుంటూరు మెడికల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంటువ్యాధుల నివారణ, నియంత్రణ చర్యలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలో గుంటూరుకి చెందిన అంటువ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ కే.కల్యాణ్ చక్రవర్తితో పాటు మంగళగిరిలోని ఎయిమ్స్‌కు చెందిన మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ సుమిత్ రాయ్‌లకు స్థానం కల్పించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం ప్రకటించారు.


మిర్చియార్డు ఛైర్మన్‌గా నియమితులైన కుర్రా అప్పారావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాధవి

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

గుంటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సహకార సంస్థల అభివృద్ధి, రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. గుంటూరు మిర్చి యార్డు ఛైర్మన్‌గా నియమితుడైన కుర్రా అప్పారావు సోమవారం గుంటూరు పశ్చిమ కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవిని మర్యాదపూర్వకంగా కలిశారు. మిర్చి రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రైతులకు మేలు చేసే విధంగా నిర్ణయాలు తీసుకుంటూ, యార్డు అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవి అన్నారు.

● కల్పవల్లి కో ఆపరేటివ్ స్టోర్స్ పర్సన్ ఇన్‌చార్జులుగా బాధ్యతలు స్వీకరించిన పానుగంటి భారతిదేవి, ఉప్పతల సాంబశివరావు, చింతకాయల వెంకట సాయి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. సూపర్ బజార్‌ను మరింత అభివృద్ధి చేసే దిశగా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నేత సుఖవాసి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆ గ్రామాలను విలీనం చేయాలని నేను అనలేదు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

● నా ప్రమేయంతోనే కలిపామని మేయర్ ప్రకటించడంపై ఖండన

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'నాకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే ముఖ్యం. ఇప్పటికీ అనేక కాలనీల్లో సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించాలని మేయర్, మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రాలు అందజేస్తున్నాను' అని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సోమవారం విలేకరులకు తెలిపారు. ఈనెల 27న జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయా గ్రామాల విలీనం చేస్తూ చేసిన తీర్మానానికి తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తాను ఆ రోజు సమావేశానికి హాజరు కాలేదని చెప్పారు. కానీ 'పెదకాకాని గ్రామాన్ని గుంటూరులో విలీనం చేయాలని, ఆ విధంగా చేస్తే తనకు కూడా అంగీకారమేనంటూ' తాను చెప్పినట్లుగా మేయర్ కోవెలమూడి రవీంద్ర కౌన్సిల్ సమావేశంలో ప్రకటించడం సరైన పద్ధతి కాదన్నారు. తాను అంగీకారం తెలిపినట్లుగా మేయర్ ప్రకటించడాన్ని తాను ఖండిస్తున్నానన్నారు. గ్రామాల విలీనానికి తాను వ్యతిరేకం కాదని, అయితే అందరితో చర్చించి సమష్టి నిర్ణయం తీసుకుంటే మంచిదని సూచించానన్నారు.

డ్రగ్స్‌తో యువత భవిష్యత్ నాశనం

గుంటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు గుంటూరు ఈస్ట్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ పర్యవేక్షణలో కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి బుచయ్యతోటలో సంకల్పం, డ్రగ్స్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్‌తో భవిష్యత్తు నాశనమవుతుందన్నారు.

దాడిపై ఫిర్యాదు

శారదా కాలనీ 13వ లైన్‌కి చెందిన ఆటో డ్రైవర్ పటాన్ అహ్మద్ ఖాన్, అతని పిల్లలపై అదే లైనులో నివసించే పఠాన్ మస్తాన్, అతని తండ్రి పఠాన్ బుడే మద్యం తాగి వచ్చి ఈ నెల 27న రాత్రి 10 గంటలకు రాళ్లు వేశారు. వారికి రక్త గాయాలైనట్లు, అహ్మద్‌ఖాన్ చెల్లెలి ఆటో అద్దాలు పగలగొట్టినట్లు, మస్తాన్ కత్తి తీసుకొని చంపుతానని బెదిరించినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అరండల్ పేట పోలీసులు తెలిపారు.



రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

అసత్య ఆరోపణలు చేస్తే దేవుడు క్షమించడు

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ● రామలింగేశ్వర స్వామి ఆలయానికి రూ.33లక్షల విరాళం

వినుకొండటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల అధికారంలో ఉండి కొండపైన రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని పూర్తి చేయలేకపోయినవారు ఇప్పుడు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వారిని ఆ దేవుడు క్షమించడని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి కల్యాణమండపంలో నూతనంగా ఎంపికైన శ్రీ రామలింగేశ్వరస్వామి అభివృద్ధి కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవాన్ని సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆలయ కమిటీ అధ్యక్షుడు అచ్యుత రామకోటేశ్వరరావుతో పాటు మిగిలిన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కొండపై రామలింగేశ్వరస్వామి దేవస్థానాన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత కమిటీపై ఉందన్నారు. దేవాలయ నిర్మాణానికి తన వంతు సాయంగా రూ.33 లక్షల విరాళాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ఇందులో రూ.11 లక్షల చెక్కును వెంటనే కమిటీ సభ్యులకు అందజేశారు. ప్రతి ఒక్కరి శక్తికొలది ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు చొరవతో మొదటి విడతగా దేవాలయ నిర్మాణానికి రూ. 2 కోట్లు, ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేయించామని, ఘాట్‌రోడ్డు నిర్మాణానికి టెండర్లు కూడా పిలిచామన్నారు. ముందుగా ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన కమిటీ సభ్యులతో పాటు అమ్మ ట్రస్ట్ ఆశ్రమం నిర్వహకులకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, సభ్యులు భవనాసి రమేష్‌బాబు, పొత్తూరి వెంకటరవీంద్రకుమార్, గాలి వెంకటరమణరావు, మాదినేని ఆంజనేయులు, జాగర్లమూడి సుబ్బారావు, చందోలు మల్లికార్జునరావు, పోట్ల రాధాకృష్ణమూర్తి, గట్టుపల్లి శ్రీనివాసరావు, పెండేల వెంకటసురేష్‌బాబు, తాతా వెంకటసత్యనారాయణ, రెడ్డి నగేష్‌బాబు, రొడ్డా వీరాంజనేయరెడ్డి, కాల్వ వెంకటరామ్మోహన్‌రావు, చిన్న ఐరామ్మూర్తి, గుడిపాటి ఈశ్వరరావు, ల్యాబ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రగతి

(5వ పేజీ తరువాయి)

వ్యయం అంచనాలతో ఆయా పల్లెల్లో 143 పనులు చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటికి రూ.53.44 లక్షల విలువైన నాలుగు పనులు మాత్రమే పూర్తి చేశారు. మిగిలిన పనులు వివిద దశల్లో ఉన్నాయి.

బాపట్ల జిల్లా 59 ఎస్సీ ఆదర్శ గామాల్లో రూ.32.18 కోట్ల వ్యయం అంచనాలతో 531 పనులు చేపట్టారు. వీటిలో రూ.2.56 కోట్ల విలువైన 17 పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 514 పనులు పూర్తి చేయాల్సి ఉంది. పనులను సాగదీస్తున్నారన్న విమర్శలున్నాయి.

గుంటూరు జిల్లాలో 40 ఆదర్శ గ్రామాలుగా ఎంపిక చేశారు. రూ.16.44 కోట్ల వ్యయం అంచనాలో 304 ప్రగతి పనులు చేపట్టారు. వీటిని పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం ఆపసోపాలు పడుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రూ 2.12 కోట్ల విలువైన 14 పనులు ఇప్పటికి పూర్తి చేయగలిగారు.

కొత్త పరిశ్రమలేవీ..?

(5వ పేజీ తరువాయి)

పెట్టుబడులు రూ.11.50 లక్షల కోట్లు. వీటిలో రాయలసీమలోని నంద్యాల, కర్నూలు, హిందూపూర్, అనంతపురం, కడప, రాయచోటి, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు 52 శాతం, అంటే రూ.6 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వెళ్లాయి. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలు 40 శాతం పెట్టుబడులు దక్కించుకున్నాయి. మిగిలిన 8 శాతం మధ్యాంధ్ర జిల్లాలకు వచ్చాయి. దీంతో మధ్యాంధ్రవాసుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రతి సందర్భం లోనూ రాజధాని అంశాన్ని ముందుకు తెచ్చి గుంటూరు జిల్లాలో పరిశ్రమలు, పెట్టుబడుల విషయంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రభుత్వం ప్రదర్శిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● నామమాత్రమే పరిశ్రమలు..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిశ్రమలకు పెట్టింది పేరు. గతంలో స్థాపించిన పరిశ్రమలు మినహా కొత్తగా స్థాపించిన పరిశ్రమలు లేవనే చెప్పాలి. స్పిన్నింగ్, జిన్నింగ్ మిల్లులు దాదాపు ఖాయిలా అంచుకు చేరుకున్నాయి. పొగాకు ఆధారిత పరిశ్రమల పరిస్థితి కూడా ఆశించినంత స్థాయిలో లేదు. సున్నపురాయి, నాపరాయి వనరులు పుష్కలంగా ఉండి, అటవీ సంపదను కలిగి అమితంగా ఉన్న పల్నాడు జిల్లా విభజనలో మూడింట రెండొంతుల పరిశ్రమలను పొందింది. ఈ జిల్లాకు కూడా కొత్తగా వచ్చిన పరిశ్రమలు లేకపోవడం విషాదం. సముద్రతీరం, ఆక్వా రంగం విస్తారంగా ఉన్న బాపట్ల జిల్లా పరిస్థితి కూడా ఇంచుమించు అలానే ఉంది. ఉమ్మడి గుంటూరులో రూ. 250 కోట్లు అంతకు మించి పెట్టుబడులున్న భారీ పరిశ్రమలు 81 ఉండగా.. వాటి సంఖ్యలో ఎలాంటి మార్పు లేదు. చెట్టినాడు, కేసీపీ, పరాశక్తి వంటి పరిశ్రమలు తప్ప చెప్పుకోదగిన పరిశ్రమలు లేవు.

ఇదీ ఎంఎస్ఎంఈల గుట్టు..

ఉమ్మడి జిల్లాలో 94,189 ఎంఎస్ఎంఈలు ఉండగా అందులో సూక్ష్మ పరిశ్రమలే 90,911 ఉన్నాయి. 2,986 చిన్న, 292 మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. పల్నాడు జిల్లాలో 34,990 ఎంఎస్ఎంఈలు ఉండగా వాటిలో 27,758 సూక్ష్మ, 187 చిన్న, 5 మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. బాపట్ల జిల్లాలో 27,950 ఎంఎస్ఎంఈలు ఉండగా, వాటిలో 27,758 సూక్ష్మ, 291 చిన్న, 4 మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. అంటే మొత్తం ఎంఎస్ఎంఈల్లో 95 శాతానికి పైగా సూక్ష్మ పరిశ్రమలే ఉన్నాయి. గణాంకాలను బట్టి చూస్తే ఎంఎస్ఎంఈల సంఖ్య భారీగా కనిపిస్తున్నా. దాని వెనక పెద్ద మతలబు ఉంది. ఎంఎస్ఎంఈల భావన మార్చడంతో ఈ సంఖ్య అమాంతం పెరిగిపోయింది. ఇళ్ల దగ్గర నడుపుకునే చిల్లరకొట్లు, దుకాణాలు కూడా ఎంఎస్ఎంఈ జాబితాలో చేర్చారు.. తప్ప కొత్తగా వచ్చిన ఎంఎస్ఎంఈలు కూడా మూడు జిల్లాల్లో పెద్దగా లేవనే చెప్పాలి.

● రెండేళ్లలో అంతా శూన్యం

గత టీడీపీ ప్రభుత్వంలో 2014- 19 మధ్య ఇక్కడ పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఎంతో ఆసక్తి చూపారు. కానీ, వైసీప ప్రభుత్వం వచ్చాక వారంతా కనుమరుగైపోయారు. ప్రభుత్వ గణాంకాలే ఈ విషయాన్ని నిర్ధారిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే ప్రకారం 2014 నుంచి 2021 వరకూ జిల్లాలో 20 మెగా, భారీ పరిశ్రమల స్థాపన జరగాయి. ఆ తరువాత ఒక్క పరిశ్రమ కూడా స్థాపించ లేదు. గుంటూరు జిల్లాలో 7, బాపట్ల జిల్లాలో 4, పల్నాడు జిల్లాలో అత్యధికంగా 9, మొత్తంగా 20 మెగా భారీ పరిశ్రమల స్థాపన జరగ్గా.. రూ.2,485.47 కోట్ల పెట్టుబడులు, 4,500 మందికి ఉద్యోగాలు వచ్చాయి. కాగా.. 2021 - 25 మధ్య ఒక్క భారీ పరిశ్రమ, రూపాయి పెట్టుబడి, ఒక ఉద్యోగం కానీ రాలేదని గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది కాలంలోనూ అదే పరిస్థితి కొనసాగుతోంది. దీనంతటికీ కారణం మధ్యాంధ్రను వ్యవసాయ జిల్లాలుగా ప్రభుత్వాలు భావించడం, వ్యవసాయ కార్యకలాపాలకే వాటిని పరిమితం చేయడం.

4929 పింఛన్లపై అనర్హత వేటు!



- ● సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్, మరణాల కారణంగా తొలగింపు
- ● వాటిలో కొన్ని విత్ హెల్డ్ జాబితాలోకి..
- ● భూమిలేని పేదల పింఛన్లలో భారీ సంఖ్యలో భూములున్న రైతులు
- ● ఆదాయపన్ను చెల్లింపుదారులు, 4 చక్రాల వాహనదారులు కూడా ఎక్కువే
- ● ప్రస్తుతం అమరావతిలో పింఛనుదారులు 17,593 మంది..
- ● వారిలో 4,929 మంది పేర్లతో అనర్హుల జాబితా

గుంటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో భూమిలేని పేదలకు ఇచ్చే పింఛన్లపై ఏపీసీఆర్డీఏ దృష్టి సారించింది. రాజధాని పరిధిలోని గ్రామాల్లో భూమిలేని నిరుపేదలకు ఇచ్చే పింఛన్లలో అనర్హుల వడపోత చేపట్టి జాబితాను సిద్ధం చేసింది. తాజా జాబితా ప్రకారం రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో 4,929 మందిని పింఛన్ల జాబితాలో అనర్హులుగా ప్రకటించింది.

● వైసీపీ ప్రభుత్వంలో మొదలైన తొలగింపు ప్రక్రియ

రాజధాని నిర్మాణం కోసం భూ సమీక రణ చేపట్టిన సమయంలో రైతులు భూస మీకరణ పరిధిలోకి వచ్చారు. భూములు పోయిన కారణంగా భూమిలేని పేదల ఉపాధి దెబ్బతింటుందని ప్రభుత్వం వారికి పింఛన్లు అందజేసేందుకు నిర్ణయించింది. మొత్తం 29 గ్రామాల్లో 19,721 మందిని భూమిలేని పేదలుగా గుర్తించి వారికి 2016 నుంచి పింఛన్లు అందజేస్తున్నారు. తొలుత వారికి ఒక్కొక్కరికి ప్రతి నెలా రూ. 2,500 పింఛన్లు అందజేశారు. కాగా పింఛను దారుల సంఖ్య 2017 నాటికి 20,954కు, 2018 నాటికి 21,479కి పెరిగింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ సంఖ్య తగ్గు ముఖం పట్టింది. 2019 డిసెంబరు నాటికి 20,693కు తగ్గగా, 2020 నాటికి 19,457కు పడిపో యింది. 2021లో 19,182కు, 2022లో 17,026కు పడిపోయింది. 2023 నాటికి ఈ సంఖ్య 17,593కు పెరిగింది. 2023 నుంచి ఈ సంఖ్యలో మార్పు రాలేదు. కూటమి ప్రభుత్వం పింఛన్లు తొలగించలేదు. కాగా వీరందరికి 2023 నుంచి పింఛను మొత్తాన్ని రూ. 5,000కు పెంచారు. ప్రస్తుతం వీరికి ప్రతి నెలా ఏపీసీఆర్డీఏ 8.91 కోట్ల రూపా యలు పింఛన్లు అందజేస్తోంది. అయితే వీరిలో కూడా అనర్హుల సంఖ్య భారీగా ఉన్నట్లు సీఆర్డీఏ గుర్తించింది. దీనిపై పరిశీలన చేపట్టిన సీఆర్డీఏ అధికారులు మొత్తం 4,929 మందిని అనర్హులుగా ప్రకటించారు.

2016 నుంచి పింఛన్ల జాబితా ఇలా..

సంవత్సరం	పింఛనుదారులు	మార్పు
2016	19,721	పెరుగుదల
2017	20,954	పెరుగుదల
2018	21,479	పెరుగుదల
2019	20,693	తగ్గుదల
2020	19,457	తగ్గుదల
2021	19,182	తగ్గుదల
2022	17,026	తగ్గుదల
2023	17,593	పెరుగుదల
2024	17,593	మార్పులేదు
2025	17,593	మార్పులేదు

● సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్‌తో అనర్హత వేటు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్‌లో 4,929 మంది అనర్హత బారిన పడ్డారు. వీరిలో చాలా మంది భూమి కలిగి ఉన్న రైతులు ఉన్నారు. ఆదాయ పన్ను చెల్లించేవారు, ప్రభుత్వ ఉద్యోగం ఉన్నవారు, నాలుగు చక్రాల వాహనాలు ఉన్నవారు, 300 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగం ఉన్నవారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వీరితో పాటు కుటుంబంలో ఒక్కరే ఉండి, వారు కూడా చనిపోయి ఉండడం, పింఛనుదారు చనిపోగా, అతడి స్థానంలో మరొకరు వేచి చూసే జాబితాలో ఉండడం, కొంతమంది ఇతర ప్రాంతాలకు వలస పోవడం వంటి కారణలతో 4,929 మందిని తొలగిస్తున్నట్లు సీఆర్డీఏ చెబుతోంది.

బంగారు భవిష్యత్తుకు నాంది

- ● విద్యార్థులకు ఉద్యోగ కల్పనపై వర్సిటీ దృష్టి
- ● నైపుణ్యం పెంపునకు శిక్షణ ప్రారంభం
- ● శిక్షణకు విశేష స్పందన

ప్రపంచ స్థాయిలో విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు దక్కించుకునేందుకు అనుగుణంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వాణిజ్య, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం తమ విద్యార్థులకు శిక్షణ ఇస్తుంది. ముఖ్యం గా విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించి వారికి వారే ఉపాధి అవకాశాలు దక్కించుకునేలా తీర్చిది ద్దటంపై ఆ విభాగం దృష్టి సారించింది. ప్రతి విద్యార్థి ప్రతిష్టాత్మక పరిశ్రమల్లో అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునే విధంగా తయారవడమే లక్ష్యంగా పెట్టుకుంది. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిక్షణకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభిస్తుంది.

ఏఎన్‌యూ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వాణిజ్య, మేనేజ్‌మెంట్ విభాగం ఆరునెలలు పాటు విద్యార్థులకు ఇన్వెస్ట్ బ్యాంకింగ్, ట్రేడింగ్, ఇకేవటర్ బిజినెస్ ఎనలిటిక్స్, కార్పొరేట్ గవర్నెన్స్, డిజిటల్ మార్కెటింగ్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, బ్లాక్ చైన్ సీఏ, బ్యాం కింగ్, ఇండస్ట్రీ, ఇంటర్నేషనల్ రిలేషన్స్, అకౌంటింగ్, లాజిస్టిక్స్, జేన్సన్స్, మ్యూచ్యువల్ ఫండ్స్ రంగాల్లో ఇటీవల శిక్షణ శిబి రం ఏర్పాటు చేసింది. నిష్ణాతులైన నిపుణులను ఆహ్వానించి వారితో వాణిజ్యశాస్త్రం, బిజినెస్ మేనేజ్‌మెంట్‌తోపాటు ఐబీ విద్యార్థులకు ఆయా రంగాలపై నైపుణ్యాల పెంపునకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వాణిజ్య, మేనేజ్‌మెంట్ విభాగ విభాగాధిపతి, విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య శివరామ్ ప్రసాద్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ, రాష్ట్రంలోని చాలా మంది విద్యార్థులకు తగినంతగా నైపుణ్యా లు లేకపోవటం వల్ల ఉద్యోగాలు పొందలేక పోతున్నారన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించేందుకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. నిర్మాణ్ సంస్థ స్టేట్, స్ట్రీట్, వాణిజ్య, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సం యుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. విద్యార్థులకు రోజు ఎనిమిది గంటల పాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. పీజీ,ఫార్మసీ విద్యార్థు లకు ఉద్యోగ అవకాశాల లభించే కోర్సులపై శిక్షణ ఇవ్వటంతో పాటు ఉద్యోగాలు పొందేవిధంగా వారిని తీర్చుదిత్తుతామ న్నారు. పలు దేశీ, విదేశీ కంపెనీల్లో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ట్రైనింగ్ నిర్వాహకులు కిరణ్ కుమార్ తెలిపారు.

కచ్చితంగా ఉద్యోగం సాధిస్తా



ఈ శిక్షణతో మా నైపుణ్యత పెంపొందుతోంది. ఉపాధి అవకాశాలు పొందేందుకు శిక్షణ దోహదం చేస్తుంది. సెబీ వ్యవస్థలో భాగస్వామ్యం కావటంతో పాటు ఎన్‌సీఎమ్ శిక్షణ కోర్సులు నేర్చుకోవడం ఆనందంగా ఉంది. ఉద్యోగం రాదు అనే సందేహం లేదు. కచ్చితంగా ఉద్యోగం సాధిస్తా. నా తల్లిదండ్రులకు తోడుగా ఉంటాను.

-కిషోర్, ఎంబీఏ రెండో సంవత్సరం విద్యార్థి

స్టాక్ ట్రేడింగ్‌పై అవగాహన కలిగింది



స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టేటప్పుడు ఆలోచనచేయాలి. కంపెనీల్లో ఎలా ఇన్వెస్ట్ చేయాలి, ట్రేడింగ్ వంటి అంశాలపై శిక్షణతో అవగాహన కల్పిస్తున్నారు. ఈ శిక్షణ విద్యార్థుల భవిష్యత్తుకి పునాది వేస్తుంది. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసిన వర్సిటీ యంత్రాంగానికి ధన్యవాదాలు.

-పఠాన్ శంషాద్, ఎంబీఏ రెండో సంవత్సరం విద్యార్థి

ముక్కోటి ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు

తెనాలి అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని తెనాలి డివిజన్‌లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమయిన వైకుంఠపురం ఆలయంలో దేవాదాయ శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం వేకువ జామున 4.30 గంటలకు ప్రారంభిస్తారు. ఇందుకోసం ఆలయంలో అవసరమైన క్యూలైన్లు నిర్మించారు. భక్తులు స్వామి వారి దర్శనానికి వీఐపీ దర్శన టిక్కెట్ రూ.300లపై ఒకరికి, శీఘ్ర దర్శనం రూ.150 టిక్కెట్‌పై ఇద్దరికి దర్శనం కల్పిస్తారు. దీంతో పాటు ప్రత్యేకంగా క్యూలైన్లు డోనర్ పాస్‌ల ద్వారా వచ్చే భక్తులు ఉత్తర ద్వార దర్శనం వద్ద కలిసేలా ఏర్పాట్లు చేశారు. ఉచిత దర్శనం కోసం కూడా క్యూలైన్లు నిర్మించారు. ఈవో అనుపమ, అర్చకులు, దేవాదాయ అధికారులు, పోలీసులు సోమవారం ఆలయం వద్ద ఏర్పాట్లను సమీక్షించారు.



ఏర్పాటు చేసిన క్యూలైన్లు

అయ్యో పాపం.. ఏబీ పాలెం

- ● పంచాయతీ ఓ చోట.. సచివాలయం మరో చోట
- ● వైసీపీ రాజకీయంతో శివారు గ్రామంలో ఏర్పాటు
- ● మార్పు కోసం గ్రామస్థుల సుదీర్ఘ పోరాటం



అబ్బినేనిగుంట పాలెం గ్రామం

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

అబ్బినేనిగుంట పాలెం (ఏబీపాలెం) పెదనందిపాడు మండలంలోని గ్రామ పంచాయతీ. గుంటూరు నుంచి చీరాల వెళ్లే మెయిన్ రోడ్డు పక్కనే ఉంటుంది. మొత్తం జనాభా 2800. సచివాలయ వ్యవస్థ వచ్చాక ఆ ఊరికి తీవ్ర అన్యాయం జరిగింది. పంచాయతీ కార్యాలయం ఉన్న ఏబీ పాలెంను కాదని దాని శివారు గ్రామమయిన గొరజవోలుగుంటపాలెంలో సచివాలయం ఏర్పాటు చేశారు. అక్కడ జనాభా కేవలం 1100 మాత్రమే. పైగా మెయిన్ రోడ్డుకు చాలా లోపలికి ఉంటుంది. అసలు పంచాయతీని కాదని శివారు గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేయటానికి ప్రధాన కారణం అప్పటి వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రాజకీయం. ఏబీ పాలెంలో టీడీపీ ముఖ్య నేతలు ఎ క్కువ మంది ఉన్నారన్న ఒకే ఒక్క సాకుతో సచివా లయం తీసుకువెళ్లి శివారు గ్రామంలో నెలకొల్పారు. అలా జరగటం వల్ల ఏబీ పాలెం ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఏ చిన్న పని వచ్చి నా శివారు గ్రామం వెళ్లి రావటానికి ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల సచివాలయం పంచాయతీ మెయిన్ గ్రామం అయిన ఏబీ పాలెంకు మార్చాలని కొంతమంది అలుపెరగని పోరాటం చేస్తున్నారు. కూ టమి ప్రభుత్వంలోనైనా తమ పోరాటం సఫలీకృతం అవుతుందని ఆశపడుతున్నారు.

● రూ. 25 లక్షల స్థలం దానం..

ఇదిలా ఉంటే ఏబీపాలెంలో సచివాలయం ఏర్పాటు చేయడానికి రూ.25లక్షలు విలువ చేసే 20 సెంట్ల స్థలాన్ని మాకినేని ఝాన్సీ, మాకినేని శివ రంగారావు పంచాయతీకి దానంగా రాసిచ్చారు. సంబంధిత పత్రాలను కూడా మదమంచి అప్పారావు జిల్లా అధికారులకు అందజేశారు. జిల్లా అధికారులు ఈ విషయంలో సత్వరమే చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● వైసీపీ మార్క్ రాజకీయం...

పంచాయతీ ఒక చోట సచివాలయం మరో చోట అంటే వైసీపీ మార్క్ రాజకీయం అంటే ఏమిటో అర్థం అవుతుంది. ఇదే మండలంలోని గోగులమూడి సచివాలయం పరిస్థితి కూడా అంతే. కాట్రపాడు పంచాయతీ జనాభా చాలా తక్కువ. కాని జగన్ మామ స్నేహితుడు ఆ గ్రామంలో ఉన్నారని గోగులమూడిలో కాదని కాట్రపాడులో సచివాలయం ఏర్పాటు చేశారు. ఇదే లెక్కన ఏబీ పాలెం కూడా అన్యాయం చేశారు. దీనిపై అప్పట్లోనే గ్రామానికి చెందిన మదమంచి అ ప్పారావు హైకోర్టులో కేసులు వేశారు. అప్పటికే సచివాలయం ఏర్పాటుపై పంచాయతీ రాజ్ కమిషనర్ నిర్ణయం తీసుకున్నందున కేసు కొట్టివేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పారావు పలుమార్లు మంత్రులను, పంచాయతీ రాజ్ అధికా రులను కలిసి సచివాలయం ఏబీ పాలెంలో ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఆయన విన తిపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. జిల్లా కలెక్టర్ దగ్గర నుంచి ఫైల్ సంబంధిత ఉన్నత అధికారుల వద్దకు వెళ్లాల్సి ఉంది. అక్కడ రాష్ట్ర అధికారులు నిర్ణయం తీసుకుంటారని చెబుతున్నారు.

● అప్పటి నుంచి పోరాడుతూనే ఉన్నా

మా గ్రామం పంచాయతీ. అక్కడ కాకుండా శివారు గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేశారు. ఆ రోజు నుంచి నేను పోరాటం చేస్తూనే ఉన్నా. కూటమి అధికారంలోకి వచ్చి 18 నెలలయింది. కనీసం ఇప్పుడైనా అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి జరిగిన తప్పును సరిదిద్దాలని కోరుతున్నా.

-మదమంచి అప్పారావు, ఏబీ పాలెం



సచివాలయం ఏర్పాటు కోసం దాతలు స్థలం దానం చేసిన పత్రాలు చూపిస్తున్న మదమంచి అప్పారావు

జోరుగా నకిలీ విత్తనాల అమ్మకాలు

● గుంటూరు జిల్లాలో విచ్చలవిడిగా విక్రయం ● అధికారులకు ఫిర్యాదుల వెల్లువ ● సంగడిగుంటలో బయోల తయారీపై కూడా

గుంటూరు సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో గుంటూరు జిల్లా రైతులపై దెబ్బపడింది. పలు మండలాల్లో నకిలీ మొక్కజొన్న విత్తనాల అమ్మకాలు జోరుగా సాగాయి. ఈ వ్యవహారంపై కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. అమరావతి మండలం ఉంగుటూరుకు చెందిన వ్యక్తి గుంటూ రులో నివాసం ఉంటూ తెలంగాణ నుంచి మొక్క జొన్న విత్తనాలు భారీ మొత్తం లో తెప్పించాడు. వాటిని తక్కువ ధరకు విక్రయించడంతో చాలా మంది రైతులు కొనుగోలు చేశారు. సహజంగా లూజ్‌లో దొరికే విత్తనాలను రైతులు కొనరని, ఒకటి, రెండు కంపెనీలకు చెందిన ఉద్యోగుల ద్వారా అమ్మకాలు జరిపినట్లు తెలిసింది. ప్రముఖ విత్తనాల కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు చెప్పటంతో చాలా మంది రైతులు నకిలీ మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేశారు. ఈ విత్తనాలు ఎక్కువగా తెనాలి, దుగ్గిరాల, అత్తోట, పేరకలపూడిలో విక్రయాలు జరిగాయని చెబుతున్నారు. గతంలో కూడా ఇదే వ్యక్తి నకిలీ విత్తనాలు విక్రయిస్తూ అధికారులకు చిక్కాడు. ఇప్పుడు మళ్లీ అదే పద్ధతిన విత్తనాల అమ్మకాలకు పాల్పడుతున్నట్లు అధికారు లకు ఫిర్యాదులు వస్తున్నాయి. రబీలో కూడా బీటీ-3 పత్తి విత్తనాలు అమ్మకాలు జరిపినట్లు తెలుస్తుంది. ఇకనైనా అధికా రులు ఇటువంటి వారిపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

● కొన్నింటికే అనుమతి...

గుంటూరు నగరంలోని సంగడి గుంటలో అనుమతి లేని బయో మందులు తయారు చేస్తున్నట్లు అధికారులకు ఫిర్యా దు అందింది. కేవలం కొన్ని రకాల బయో ఉత్పత్తుల తయా రీకి మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇస్తుంది. వాటికి మాత్ర మే అనుమతి తెచ్చుకొని ఎక్కువ మొత్తంలో తయారు చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. కొన్ని బయో ఉత్పతుల్లో పురుగు మందులు కూడా ఎక్కువగా కలుపుతున్నట్లు తెలుస్తుంది. ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు.

యాంటీ రేబీస్

నకిలీ టీకా తీసుకుంటే...

2023 నవంబరు నుంచి మన దేశంలో పంపిణీలో ఉన్న యాంటీ రేబీస్ వ్యాక్సిన్ అభయ్‌రాబ్ నకిలీదని ఆస్ట్రేలియా వైద్యాధికారులు తాజాగా ఒక హెచ్చరికను జారీ చేయడంతో, అప్పటి నుంచి ఇప్పటివరకూ ఆ వ్యాక్సిన్ తీసుకున్న వాళ్లు మళ్లీ కొత్తగా మరొక వ్యాక్సిన్ తీసుకోవాలా, వద్దా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ విషయం గురించి వైద్యులేమంటున్నారో తెలుసుకుందాం!



పిచ్చి కుక్క కరిచినప్పుడు రేబీస్ వ్యాధి బయల్పడడానికి సాధారణంగా ఒకటి నుంచి మూడు నెలల సమయం పడుతుంది. కానీ కొన్ని సందర్భాల్లో వారం రోజుల్లోపే లక్షణాలు కనిపించవచ్చు. కొందర్లో అందుకు సంవత్సరం రోజులు పట్టవచ్చు. ఒకసారి వ్యాక్సిన్ తీసుకున్నంత మాత్రాన మళ్లీ తీసుకోకూడదనే నియమం లేదు కాబట్టి 2023 నవంబరు తర్వాత అభయ్‌రాబ్ వ్యాక్సిన్ తీసుకున్న వాళ్లు కుక్క కరిచినా, కరవకపోయినా తప్పనిసరిగా తాజా యాంటీరేబీస్ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిది.

టీకాల కోర్సులు, డోసులు వేర్వేరు

కుక్క కరవక ముందు, కరిచిన తర్వాత అనే దానితో సంబంధం లేకుండా తప్పనిసరిగా టీకా తీసుకోవాలి. అయితే కుక్క కరవక ముందు, తర్వాత తీసుకునే టీకా డోసులు మారతాయి. అలాగే మొదటిసారి కుక్క కరిచినప్పటి డోసులు, రెండోసారి కరిచినప్పుడు తీసుకునే డోసులు కూడా మారతాయి. టీకా తీసుకున్న వాళ్లు కూడా మూడు నెలల్లోపు కోర్సు పూర్తయ్యేలోగా కుక్క కరిస్తే, ఇతరత్రా ఇంజెక్షన్లేవీ తీసుకోవలసిన అవసరం లేదు. కుక్క కరిచిన ప్రదేశాన్ని 15 నిమిషాలసేపు సబ్బు నీళ్లతో కడిగేస్తే సరిపోతుంది. ఒకవేళ టీకా తీసుకుని మూడు నెలలు దాటితే, మరొక రెండు డోసుల టీకా తీసుకోవాలి. అయితే జీవితంలో యాంటీరేబీస్ టీకా తీసుకోని వారికి పిచ్చి కుక్క కరిస్తే, టీకాతో పాటు యాంటీబాడీ ఇంజెక్షన్ కరిచిన చోట ఇవ్వాల్సి ఉంటుంది. అయితే టీకా తీసుకుని, కుక్క కరిచిన తర్వాత ఒక రౌండ్ టీకాలు తీసుకున్న తర్వాత మళ్లీ రెండోసారి కుక్క కరిస్తే, రెండు డోసుల టీకా తీసుకుంటే సరిపోతుంది. వీళ్లు యాంటీబాడీ ఇంజెక్షన్ తీసుకోకూడదు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

టీకా పిరుదులకు ఇవ్వడం వల్ల సమర్థంగా పనిచేయకపోవచ్చు. కాబట్టి యాంటీరేబీస్ టీకా భుజానికీ, తొడకు మాత్రమే ఇవ్వాలి. అలాగే...



- టీకా తీసుకున్న మూడు నెలల్లోపు కుక్క కరిస్తే, గాయాన్ని శుభ్రంగా కడిగితే సరిపోతుంది. మూడు నెలలు దాటితే, రెండు డోసుల టీకా తీసుకోవాలి
- టీకా తీసుకోని వాళ్లు కుక్క కరిచిన వెంటనే గాయాన్ని శుభ్రంగా కడిగి, యాంటీరేబీస్ టీకాతో పాటు, కరిచిన చోట యాంటీబాడీ ఇంజెక్షన్ తీసుకోవాలి
- టీకాతో పాటు యాంటీబాడీ ఇంజెక్షన్ తీసుకున్న మూడు నెలల్లోపు మళ్లీ కుక్క కరిస్తే గాయాన్ని శుభ్రపరుచుకుంటే సరిపోతుంది. మూడు నెలలు దాటితే టీకా తీసుకోవాలి

డాక్టర్ శివరంజని సంతోష్,
సీనియర్ కన్సల్టెంట్, పీడియాట్రిక్స్,
మాగ్నా సెంటర్స్, హైదరాబాద్



ఊపిరితిత్తుల ఆరోగ్యం



చలికాలం ఊపిరితిత్తులకు పరీక్షా కాలం. పొడి గాలులు, తేమ లోపించిన చల్లని వాతావరణాలతో శ్వాసకోస సమస్యలు వేధించకుండా ఉండాలంటే ఈ కాలంలో కొన్ని జాగ్రత్తలు తప్పక పాటించాలంటున్నారు వైద్యులు.

చలిలో శ్వాస సాఫీగా...

వేసవికి భిన్నంగా ఈ కాలంలో వ్యాధికారక సూక్ష్మక్రిములైన వైరస్‌లు, బ్యాక్టీరియాలు వాతావరణంలో బ్రతికి ఉంటాయి. కాబట్టి అవి సులభంగా ఒకరి నుంచి మరొకరికి సోకుతూ ఉంటాయి. అలాగే చలి వల్ల ఎక్కువ సమయాల పాటు ఇంట్లో గడపడం వల్ల కూడా ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు పెరుగుతూ ఉంటాయి. ఇన్‌ఫ్లూయెంజా ఈ కోవకు చెందినదే! అలాగే రెస్పిరేటరీ సిన్సిషియల్ వైరస్, ఎడినోవైరస్‌లు కూడా ఈ కాలంలో విపరీతంగా వ్యాపిస్తాయి. అలాగే ఉబ్బసం, సిఒపిడి రోగుల శ్వాసనాళాలు ఇరుకుగా ఉంటాయి. ఈ కాలంలో చల్లని గాలి పీల్చుకున్నప్పుడు ఆ శ్వాస మార్గాలు మరింత ఇరుకుగా మారిపోయి అటాక్స్ వేధించడం మొదలుపెడతాయి. ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకోవలసిన అవసరం కూడా కొందర్లో తలెత్తుతూ ఉంటుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

చలి కాలంలో ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవారు, లేని వారు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. అవేంటంటే...

స్కార్ఫ్, మాస్క్: ఈ కాలంలో తేమ తగ్గిపోయి గాలి పొడిగా, చల్లగా మారిపోతుంది. ఈ గాలిని పీల్చుకోవడం వల్ల చెడు పార్టికల్స్‌ను వెలుపలికి పంపించడానికి తోడ్పడే ఊపిరితిత్తుల్లోని సిలియా ప్రభావం కూడా సన్నగిల్లుతుంది. కాబట్టి ముక్కు, నోరు కప్పి ఉంచే స్కార్ఫ్‌ను ఉపయోగించాలి. స్కార్ఫ్ వల్ల పీల్చుకునే గాలి కొంతమేరకు వెచ్చబడి సమస్యకు అడ్డుకట్ట పడుతుంది. ఇన్‌ఫెక్షన్ల వ్యాప్తిని అరికట్టడం కోసం ఊపిరితిత్తులు, గుండె జబ్బులున్నవాళ్లు, మధుమేహులు, వృద్ధులు, పిల్లలు తప్పనిసరిగా ఎన్ 95 మాస్క్ పెట్టుకోవాలి. దీన్ని ఉపయోగించలేనివాళ్లు వస్త్రంతో తయారుచేసుకున్న మాస్క్ లేదా సర్జికల్ మాస్క్ వాడుకోవచ్చు.

ఊపిరితిత్తుల సమస్యలున్నవాళ్లు: ఈ కోవకు చెందిన వాళ్లు చలి ఎక్కువగా ఉండే, ఉదయం, సాయంత్రం ఇళ్లకే పరిమితం కావాలి.

నీరు: వాతావరణం పొడిగా మారిపోతుంది కాబట్టి శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలి. అందుకోసం సరిపడా గోరువెచ్చని నీళ్లు తాగాలి

యాంటీఆక్సిడెంట్లు: ఈ పోషకాలు ఎక్కువగా ఉండే పండ్లు, నట్స్ తరచూ తింటూ ఉండాలి. వీటితో ఇన్‌ఫెక్షన్లతో సమర్థంగా పోరాడే రోగనిరోధకశక్తి బలపడుతుంది

వ్యాక్సిన్లు: ఇన్‌ఫ్లుయెంజా, న్యుమోకోకస్ సోకకుండా హై రిస్క్ గ్రూప్‌కు చెందిన వాళ్లందరూ వర్షాకాలం ప్రారంభంలో ఈ టీకాలు తీసుకోవాలి. ఇన్‌ఫ్లుయెంజాకు ప్రతి ఏడాదీ కొత్త వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తూ ఉంటుంది. కాబట్టి ప్రతి ఏటా ఈ వ్యాక్సిన్ తీసుకోవాలి. న్యూమోకోకస్‌కు జీవితకాల రక్షణను కల్పించే ఏకైక వ్యాక్సిన్ లేదా ఐదేళ్లకు ఒక వ్యాక్సిన్ తీసుకుంటే సరిపోతుంది. వచ్చే ఏడాది నుంచి ఆర్‌ఎస్‌వి వ్యాక్సిన్ అందుబాటులోకి రాబోతోంది. దీన్ని కూడా తీసుకోవడం మంచిది.



ఇలా అప్రమత్తం

సాధారణ పారాసెటమాల్, దగ్గు మందులతో 48 గంటల్లో జ్వరం, జలుబు, దగ్గు లాంటివి తగ్గిపోతాయి. ఈ మందులతో లక్షణాలు అదుపులోకి రానప్పుడు వెంటనే వైద్యులను కలవాలి. అలా చేయడం వల్ల ఇన్‌ఫెక్షన్ ఊపిరితిత్తులకు చేరుకుని, న్యూమోనియాగా మారి, ఆక్సిజన్ తగ్గిపోయి ఆస్పత్రిలో చేరే పరిస్థితి తప్పుతుంది. ఇన్‌ఫ్లుయెంజాకు, ఒసెల్‌టమివిర్ అద్భుతమైన యాంటీవైరల్ ఔషధం. అయితే లక్షణాలు మొదలైన ఐదు రోజుల్లోపే ఈ మందు తీసుకోగలిగితే మంచి ప్రభావం కనిపిస్తుంది. ఆలస్యమైతే మందు ప్రభావాన్ని కనబరచలేదు. కాబట్టి వీలైనంత త్వరగా వైద్యులను కలిసి సమస్యకు తగిన చికిత్స తీసుకోవాలి. ఊపిరితిత్తులు, గుండె సమస్యలు, మధుమేహం ఉన్నవాళ్లు దగ్గు, జలుబు, గొంతునొప్పి, జ్వరాలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను కలిసి, చికిత్స తీసుకోవాలి.

పొగమంచు ముప్పు

చలి కాలంలో చల్లదనంతో పాటు, మంచులో కలిసే కాలుష్యం బెడద కూడా ఎక్కువే! ఈ కాలంలో పర్యావరణ గాలి కాలుష్యం పెరిగిపోతుంది. ఉత్తర భారతదేశంతో పాటు దక్షిణ భారతదేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో ఈ సమస్య పెరుగుతోంది. చలికాలం ఉదయం వేళల్లో కలుషితాలు కలిసిన పొగమంచు కిందకు చేరుకుంటుంది. దీన్ని పీల్చుకోవడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తుతాయి. గాల్లో కలిసే చిన్న చిన్న ధూళి రేణువులు, కార్బన్ రేణువులు, ఇతరత్రా కర్మాగార రేణువులన్నీ 2.5 మైక్రాన్స్ కంటే చిన్నవిగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల్లోని ఆల్వియోలా వరకూ చేరుకుంటాయి. ఇంతకంటే పెద్ద రేణువులను మన ముక్కు అడ్డుకుంటుంది. కాబట్టి మన పర్యావరణంలో ఈ సూక్ష్మ రేణువులు ఎంత ఎక్కువగా ఉంటే, గాలి ఊపిరితిత్తులకు అంత ఎక్కువ ప్రమాదం. గాల్లో కలిసిన ఈ 2.5 మైక్రాన్స్ రేణువుల ఆధారంగానే గాలి నాణ్యతను అంచనా వేస్తారు. అవి 50 కంటే తక్కువగా ఉంటే గాలి నాణ్యత బాగుందని అర్థం. 50 - 100 ఉంటే ఫరవాలేదనీ, 100 కంటే ఎక్కువ ఉంటే హానికరమనీ, 150 కంటే ఎక్కువ ఉంటే అత్యంత హానికరమనీ అర్థం. కానీ ప్రస్తుత ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ అన్ని ప్రధాన నగరాల్లో 100కు మించి 3,00, 400, 500 ఉంటోంది. ప్రమాదకరమైన పరిస్థితి ఇది. ఈ గాలిని పీల్చుకోవడం రెండు సిగరెట్లు తాగడంతో సమానం. కాబట్టి ఈ ప్రమాదం నుంచి రక్షణ పొందడం కోసం...

వెచ్చదనం కోసం హీటర్లు

ఈ కాలంలో ఎక్కువ మంది హీటర్లను వాడుకుంటూ ఉంటారు. అయితే పొడి వేడి మంచిది కాదు. తేమ కూడా సరైన మోతాదుల్లో ఉండేలా చూసుకోవాలి. సాధారణంగా హీటర్లలో బ్లోవర్స్ హీటర్స్ అనే రెండు రకాలుంటాయి. ఎయిర్ బ్లోవర్స్ వేడి గాలిని విడుదల చేస్తాయి కాబట్టి వీటికి బదులుగా రేడియెంట్ హీటర్లను ఎంచుకోవాలి

- తెల్లవారుఝామున, సాయంకాలం, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే సమయాల్లో బయటకు వెళ్లకపోవడం మంచిది. ప్రధానం ఉబ్బసం, సిఒపిడి, లంగ్ సమస్యలున్నవాళ్లు రెట్టింపు జాగ్రత్తగా ఉండాలి
- అధిక ట్రాఫిక్ కలిగి ఉండే దగ్గరి దారులను ఎంచుకోడానికి బదులుగా తక్కువ ట్రాఫిక్‌ను కలిగి ఉండే దూరపు దారులను ఎంచుకోవాలి
- కిటికీలు మూసిన కారు, బస్సుల్లో ప్రయాణించాలి. బైక్స్ మీద ప్రయాణించేవాళ్లు మాస్క్ వాడుకోవాలి
- వ్యాయామాలు చేసే సమయంలో సాధారణ మోతాదుకు ఐదు రెట్లు ఎక్కువ సార్లు ఊపిరి పీల్చుకుంటాం. కాబట్టి గాలి కాలుష్యం, చల్ల గాలి ఎక్కువగా ఉండే ఈ కాలంలో ఆరుబయట వ్యాయామాలు చేయకూడదు.

డాక్టర్ వి. నాగార్జున మాటూరు,
సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మొనాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ,
హైదరాబాద్



కీళ్ల నొప్పులు అదుపులో..

డైట్

ఆర్థ్రయిటిస్ నొప్పులతో బాధపడేవాళ్లు ఆహారంలో స్వల్ప మార్పులు చేసుకుంటే, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ అదుపులో ఉంటుంది. ఈ కోవకు చెందిన వాళ్లు ఎలాంటి ఆహార నియమాలు పాటించాలంటే....



శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ పెరిగితే స్థూలకాయం, గుండె జబ్బులు, మధుమేహంలాంటి దీర్ఘకాల వ్యాధులకు గురయ్యే అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి ఇన్‌ఫ్లమేషన్‌తో పోరాడే ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే చేపల ఎక్కువగా తినాలి. కొవ్వు తక్కువ ప్రొటీన్, పీచు ఎక్కువగా ఉండే సోయాబీన్ వాడకం పెంచాలి. వాల్‌నట్ ఆయిల్, ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్, అవకాడో, శాఫ్లవర్ ఆయిల్స్ కొలెస్టరాల్ తగ్గించే గుణం కలిగి ఉంటాయి. కాబట్టి వంటల్లో వీటిని వాడాలి. అలాగే యాంటి ఆక్సిడెంట్లు ఉండే గ్రీన్ టీ వీలైనన్ని ఎక్కువసార్లు తాగాలి. విటమిన్ సి ఎక్కువగా ఉండే నిమ్మ, నారింజ పళ్లు ఎక్కువగా తినాలి. విటమిన్ సి కీళ్ల వాపు తగ్గించి వాటిని ఆరోగ్యంగా ఉంచుతుంది. అలాగే చక్కెర శరీరంలో ఇన్‌ఫ్లమేటరీ మెసెంజర్స్ అయిన సైటోకైన్స్‌ను ప్రేరేపిస్తుంది. కాబట్టి వీటికి దూరంగా ఉండాలి. అలాగే శాచురేటెడ్ ఫ్యాట్ అడిపోజ్ (ఫ్యాట్ టిష్యూ) ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తుంది. కాబట్టి ఇది ఉండే పిజ్జా, బర్గర్లను తగ్గించాలి. సన్‌ఫ్లవర్, శనగ నూనెల్లో ఉండే ఒమేగా6 ఫ్యాటీ యాసిడ్లు కూడా ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుతాయి. కాబట్టి వీటితో చేసిన వంటకాలను తగ్గించాలి.

ఆరోగ్యం

విషాలు ఇలా దూరం



పర్యావరణంలోని కలుషితాలు, ఆహారంలోని కృత్రిమ పోషకాల రూపంలో ఎన్నో విషాలు శరీరంలోకి చేరుకుంటూ ఉంటాయి. వీటిని మన కాలేయం శక్తి మేరకు విరిచేస్తూ ఉన్నప్పటికీ, అందుకు మన వంతు తోడ్పాటు అందిస్తూ ఉండడం అవసరం. అకారణమైన అలసట, తిరగబెట్టే అలర్జీలు, దురదలు, కడుపుబ్బరం మొదలైన సమస్యలు శరీరంలో విషాలు పెరిగిపోయాయి అనడానికి సంకేతాలు. ఇలాంటప్పుడు ఆ విషాలను హరించే చర్యలు చేపట్టాలి. అవేంటంటే...


నీరు: రోజుకు కనీసం 8 గ్లాసుల నీళ్లు తాగాలి
ఆహారం: వేపుళ్లు, అధిక కొవ్వులు, పాలిష్ పట్టిన పదార్థాలను తగ్గించాలి
చక్కెర: చక్కెరకు బదులుగా తీపి కోసం ఖర్జూరాలను ఎంచుకోవాలి
పండ్లు: ప్రతి రోజూ కూరగాయలు, పండ్లు తినాలి
ధాన్యాలు: పాలిష్ పట్టిన ధాన్యాలకు బదులుగా బ్రౌన్ రైస్, ఓట్లు వాడుకోవాలి
మాంసకృత్తులు: మాంసం, చేపలు, గుడ్లు, పుట్టగొడుగులు, అవకాడొ తరచుగా తింటూ ఉండాలి
ఉప్పు: సాధారణ ఉప్పుకు బదులుగా రాతి ఉప్పు వాడుకోవాలి
కాలేయం: కాలేయం భేషుగ్గా పని చేయడం కోసం వెల్లుల్లి, బీట్‌రూట్, బ్రొకొలి తినాలి
గ్రీన్ టీ: దీన్లోని శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని విషాలను హరిస్తాయి
నిద్ర: ఏడు గంటలకు తగ్గకుండా నిద్రపోవాలి
ధ్యానం: ధ్యానంతో ఒత్తిడి, ఆందోళనలను తగ్గించుకోవాలి.

మీకు తెలుసా?

గోళ్లలో అనారోగ్య సూచికలు

గోళ్లు నిశ్శబ్దంగా పెరుగుతూ ఉంటాయి. కానీ అవి మన అంతర్గత అనారోగ్య వివరాలను బిగ్గరగా చాటిచెప్తూ ఉంటాయి. అవేంటంటే...

- **కింది వైపు వంపు తిరిగితే:** గోళ్లు కిందివైపుకు వంపు తిరిగితే రక్తంలో ఆక్సిజన్ మోతాదులు తక్కువగా ఉన్నాయని అర్థం. ఊపిరితిత్తులు, కాలేయ సమస్యలు ఈ లక్షణం ద్వారా బయల్పడతాయి.
- **పసుపు రంగులో మందపాటి గోళ్లు:** ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌కు సూచన. అలాగే వ్యాధినిరోధకశక్తి సన్నగిల్లినా ఇదే లక్షణం కనిపిస్తుంది
- **చెంచా ఆకారం:** ఇనుము లోపాన్ని సూచిస్తుంది. థైరాయిడ్, గుండె జబ్బుల్లో కూడా ఈ లక్షణం కనిపిస్తుంది
- **గోళ్లు పైకి లేవడం:** థైరాయిడ్ అవకతవకలు, సోరియాసిస్, దెబ్బలు
- **పెళుసుబారడం:** ప్రొటీన్, బయోటిన్ లోపం, డీహైడ్రేషన్
- **తెల్లని అడ్డుగీతలు, సొట్టలు:** రుగ్మత, ఒత్తిడి, పోషక లోపాలు
- **నీలం, వంకాయ రంగు గోళ్లు:** రక్తప్రసరణ లోపం, ఆక్సిజన్ లోపం, రక్తలేమి
- **సగం తెలుపు:** గోరు సగం తెలుపు, మిగతా సగం గోధుమ రంగులో ఉంటే, మూత్రపిండాల జబ్బుకు సూచన



ప్రెగ్నెన్సీ



లేటు వయసులో సైతం పిల్లలను కనే వైద్య పరమైన వెలుసుబాట్లు అందుబాటులో కొచ్చాయి. కాబట్టి నచ్చినప్పుడు పిల్లలను కనవచ్చని అనుకోవడం పొరపాటు. ఆరోగ్యవంతమైన బిడ్డల కోసం, ముప్పై ఏళ్ల లోపే గర్భం దాల్చడం మేలని సూచిస్తున్నారు వైద్యులు.

గర్భధారణ 30 ఏళ్లలోపే...

ఉద్దేశపూర్వకంగా గర్భధారణను ఆలస్యం చేయడం, లేదా ఆలస్యంగా గర్భం దాల్చే పరిస్థితులను కొని తెచ్చుకోవడం వల్ల అటు తల్లి మీదా, ఇటు బిడ్డ మీదా దుష్ప్రభావం పడే వీలుంటుంది. ఉరుకుల పరుగుల జీవితాలు, ఒత్తిడిలు, ఎక్కువ సమయాల పాటు కూర్చుని చేసే ఉద్యోగాలతో, పని వేళలతో మహిళలకు వ్యాయామం కొరవడుతోంది. వీటి మూలంగా సంతానోత్పత్తికి అడ్డుపడే ఆరోగ్య సమస్యలు మొదలవుతున్నాయి. ఇవన్నీ గర్భధారణకు అడ్డుపడే ఆరోగ్య సమస్యలే కాబట్టి వీటిని సరిదిద్దుకునేలోగా వయసు పైబడిపోతోంది.

థైరాయిడ్: విపరీతమైన ఒత్తిడి మూలంగా హైపో లేదా హైపర్ థైరాయిడ్ సమస్యలు మొదలవుతున్నాయి. ఈ రెండు సమస్యలూ గర్భధారణకు అడ్డుపడేవే!

స్థూలకాయం: వ్యాయామ లోపం, జంక్‌ఫుడ్ మూలంగా చిన్న వయసులోనే మహిళలు స్థూలకాయులుగా తయారవుతున్నారు. అధిక బరువు పాలీసిస్టిక్ ఓవరీస్ మొదలైన ఇతరత్రా ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది.

మధుమేహం: టీనేజీ వయసులోనే మధుమేహానికి గురయ్యే మహిళల సంఖ్య పెరుగుతోంది. ఇందుకు కారణం కూడా ఆహార, జీవనశైలి లోపాలే!

అబార్షన్లు: కొన్ని కనెక్టివ్ టిష్యూ డిజార్డర్ల మూలంగా వరుసగా గర్భస్రావాలు జరుగుతూ ఉంటాయి. కారణాన్ని లోతుగా పరిశీలిస్తే కనెక్టివ్ టిష్యూ డిజార్డర్ సమస్య బయటపడుతూ ఉంటుంది. ఇలా వరుస గర్భస్రావాలతో బిడ్డను కనే వయసు మించిపోతూ ఉంటుంది.

ఏ వయసు ఉత్తమం?

20, 22 ఏళ్ల వయసు గర్భధారణకు అనువైన వయసు. ఈ వయసులో నాణ్యమైన అండాలను కలిగి ఉంటారు. గర్భధారణ జరిగే అవకాశాలు కూడా ఈ వయసు మహిళలకే ఎక్కువగా ఉంటాయి. కానీ ఇప్పటి రోజుల్లో ఈ వయసులో పెళ్లిళ్లకు సిద్ధపడే అమ్మాయిలు చాలా తక్కువ. అయితే ఉన్నత చదువులు, కెరీర్ కోసం ఇంకొంత సమయాన్ని తీసుకోవాలనుకునే అమ్మాయిలు కనీసం 25 నుంచి 30, 32 ఏళ్ల లోపు తొలి బిడ్డను ప్రసవించేలా ప్లాన్ చేసుకోవాలి. ఈ వయసు మహిళల్లో గర్భధారణ అవకాశాలు ప్రతి నెలలో, 25 శాతం మేరకు ఉంటాయి. ప్రసవాలకు మధ్య స్పేసింగ్ కూడా మెరుగ్గా ఉండేలా చూసుకోవచ్చు. అయితే ఈ వయసు కూడా దాటిపోయి 35 ఏళ్లకు చేరుకునేటప్పటికి అండాల నాణ్యత తగ్గుముఖం పడుతుంది. దాంతో గర్భధారణ అవకాశాలు తగ్గి, ఇన్‌ఫెర్టిలిటీ సమస్యలు పెరుగుతాయి. ఈ సమస్యలను సరిదిద్దుకుని గర్భం దాల్చే సమయానికి వయసు మరింత పెరిగిపోతుంది. కాబట్టి వీలైనంత ముందుగానే 30 ఏళ్ల లోపే గర్భాన్ని ప్లాన్ చేసుకోవడం ఉత్తమం.

గర్భధారణ ప్లానింగ్ ఇలా...

గర్భం ధరించాలని ప్లాన్ చేసుకునే మహిళలు మూడు నెలల ముందు నుంచే అందుకు శరీరాన్ని ఇలా సిద్ధం చేయాలి.

ఫోలిక్ యాసిడ్: బిడ్డ నాడీ వ్యవస్థ ఎదుగుదలకు తోడ్పడే పోషకం ఇది. ఫోలిక్ యాసిడ్ లోపంతో గర్భంలోని బిడ్డలో స్కాల్ప్ ఏర్పడదు. అలాగే కొన్ని వెన్ను సంబంధ లోపాలు కూడా తలెత్తవచ్చు. ఈ సమస్యలన్నిటినీ ఫోలిక్ యాసిడ్‌తో నియంత్రించవచ్చు. కాబట్టి గర్భధారణకు కొన్ని నెలల ముందు నుంచే ఫోలిక్ యాసిడ్ తీసుకోవడం అవసరం.

ఆరోగ్య సమస్యలు: థైరాయిడ్, మధుమేహం, రక్తలేమి లాంటి సమస్యలేవీ లేవని పరీక్షలతో నిర్ధారించుకోవాలి. ఆ సమస్యలను అదుపులో ఉంచుకోవాలి. రక్తలేమితో గర్భం దాల్చడం వల్ల పిల్లలు తక్కువ బరువుతో లేదా నెలలు నిండకుండా పుట్టే అవకాశాలుంటాయి.

అధిక బరువు: బరువు ఎక్కువగా ఉంటే, దాన్ని అదుపులోకి తెచ్చుకోవాలి.

డైట్: జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ, ప్రొటీన్ ఎక్కువగా, పిండి పదార్థాలు తక్కువగా తీసుకోవాలి. ఆకుకూరలు, సిట్రస్ పండ్లు, హీమోగ్లోబిన్ కోసం ముదురు రంగు పండ్లు, కూరగాయలు ఆహారం లో చేర్చుకోవాలి. స్వీట్లు బాగా తగ్గించాలి.

వ్యాయామం: వృత్తుల్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ కనీసం వారంలో ఐదు రోజుల పాటైనా రోజుకు 45 నిమిషాల పాటు వ్యాయామానికి కేటాయించాలి. ఇలా ఫిజికల్ ఫిట్‌నెస్ సాధించినా గర్భం ధరించే అవకాశాలు పెరుగుతాయి.

సప్లిమెంట్లు: పోషక లోపాలుంటే, వాటిని వైద్యుల సూచన మేరకు సప్లిమెంట్లతో భర్తీ చేసుకోవాలి.

30 దాటితే...

అబార్షన్లు: 35 నుంచి 40 ఏళ్లు దాటిన మహిళల్లో అండాల నాణ్యత తగ్గడం వల్ల అబార్షన్లయ్యే అవకాశాలు ఎక్కువ.

క్రోమోజోమ్ సమస్యలు: గర్భం దాల్చగలిగినా, పుట్టే పిల్లల్లో క్రోమ్‌జోమ్ సమస్యల మూలంగా డౌన్స్ సిండ్రోమ్ లాంటి జన్యు సమస్యలు తలెత్తవచ్చు.

మధుమేహం: మధుమేహంతో గర్భం దాలిస్తే, గర్భంలోని బిడ్డ బరువు ఎక్కువగా పెరిగిపోయి, సాధారణ ప్రసవం సాధ్యం కాకపోవచ్చు. గర్భిణుల్లో చక్కెరలు ఎక్కువగా ఉంటే, పుట్టే బిడ్డలో గుండె సమస్యలు, అవయవ లోపాలు తలెత్తవచ్చు.

అధిక రక్తపోటు: గర్భిణికి అధిక రక్తపోటు ఉంటే, ఫిట్స్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. ఇవి తల్లికీ, బిడ్డకూ ప్రమాదకరం. అధిక రక్తపోటు వల్ల, గర్భాశయంలోని మాయ విచ్చుకుపోయి, గర్భంలోనే బిడ్డ ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉంటుంది.


నెలలు నిండకుండా: లేటు వయసులో గర్భం దాల్చిన మహిళలకు, పిల్లలు నెలలు నిండకుండా పుట్టే అవకాశాలు ఎక్కువ.

సిజేరియన్: సాధారణ ప్రసవం కష్టతరమై, సిజేరియన్ అవకాశాలు పెరుగుతాయి.

డాక్టర్ ఎమ్. ప్రత్యూష రెడ్డి,
కన్సల్టెంట్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ,
బర్త్‌రైట్ బై రెయిన్‌బో హాస్పిటల్స్, హైదరాబాద్.




ముత్యాల ముగ్గు



17 చుక్కలు
మధ్య చుక్క 8 వరకు

తిరుమలశెట్టి జ్యోతి,
కర్లపాలెం, బాపట్ల



మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com

వెండి ఉత్థాన పతనం

- ఆరంభ ట్రేడింగ్‌లో ఆల్‌టైం రికార్డు
- రూ.2.54 లక్షలకు పెరిగిన కిలో ధర
- ఆ తర్వాత గంటకే రూ.21,000 పతనం



ముంబై: వెండి ధరలు సోమవారం ఉత్థాన పతనాన్ని చవిచూశాయి. అంతర్జాతీయ ట్రెండ్‌కు అనుగుణంగా మన మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లోనూ సిల్వర్ ఫ్యూచర్స్ 2026 మార్చి కాంట్రాక్టు ధర ఉదయం ట్రేడింగ్‌లో రూ.14,387 (6 శాతం) మేర పెరిగి సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.2,54,174కు ఎగబాకింది. కానీ, ఆ తర్వాత గంటలోనే ధర రూ.21,000 (8 శాతం) పతనమై రూ.2,33,120కి పడిపోయింది. ఇంటర్నేషనల్ మార్కెట్లోనూ ఔన్స్ వెండి రేటు తొలిసారిగా 80 డాలర్ల మైలురాయిని దాటి, ఒక దశలో 83 డాలర్లకు చేరువైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే 75 డాలర్ల స్థాయికి జారుకుంది. అందుకు కారణాలివీ..

- సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి వద్ద ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడటం ధర భారీగా పతనమవడానికి ప్రధాన కారణమైంది. ఎందుకంటే, ఈ ఏడాదిలో ఇప్పటివరకు వెండి ధర 180 శాతానికి పైగా పెరిగింది. సంవత్సరాంతం కావడంతో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోను సర్దుబాటు చేసుకునే ప్రక్రియలో భాగంగా లాభాలు స్వీకరించారని విశ్లేషకులు పేర్కొన్నారు.
- భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం మరో కారణం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ జరిపిన చర్చల్లో పురోగతి కన్పించింది. దాంతో రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధానికి త్వరలోనే తెరపడవచ్చన్న ఆశాభావం మార్కెట్లో పెరగడంతో భౌగోళిక, ఆర్థిక అనిశ్చితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న విలువైన లోహాలకు డిమాండ్ తగ్గింది.

వైస్రాయ్ హోటల్స్ చేతికి ఎస్ఎల్ఎన్ టెర్మినస్ హోటల్స్

డీల్ విలువ రూ.206 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లోని ఎస్ఎల్ఎన్ టెర్మినస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను రూ.206 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు వైస్రాయ్ హోటల్స్ లిమిటెడ్ ప్రకటించింది. ఈ మేరకు ఎస్ఎల్ఎన్ ప్రమోటర్లతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఎస్ఎల్ఎన్ టెర్మినస్ గచ్చిబౌలిలో మారియట్ బ్రాండ్ పేరుతో 75 గదులతో మారియట్ ఎగ్జిక్యూటివ్ అపార్ట్‌మెంట్స్‌ను నిర్వహిస్తోంది. 2030 నాటికి గదుల సంఖ్యను 1,000కి చేర్చాలన్న విజన్‌కు అనుగుణంగా ఈ కొనుగోలును చేపట్టినట్లు వైస్రాయ్ తెలిపింది. కాగా ఎస్ఎల్ఎన్‌కు సమీపంలోనే మాదాపూర్ వద్ద 200 రూములతో కోర్ట్‌యార్డ్ బై మారియట్ ప్రాజెక్ట్‌ను ఇప్పటికే అభివృద్ధి చేస్తోంది. ప్రస్తుతం వైస్రాయ్ హోటల్స్ పోర్ట్‌ఫోలియోలో 470 రూములున్నాయి. 2024-25లో ఎస్ఎల్ఎన్ టెర్మినస్ టర్నోవర్ రూ.43.45 కోట్లుగా ఉండగా నికర లాభం రూ.5.98 కోట్లుగా ఉంది.

రెండేళ్ల గరిష్ఠానికి పారిశ్రామికోత్పత్తి

న్యూఢిల్లీ: పారిశ్రామిక రంగం నవంబరు నెలలో అద్భుతమైన వృద్ధితో రెండేళ్ల గరిష్ఠ స్థాయికి దూసుకుపోయింది. గనులు, తయారీ రంగం బలమైన పనితీరు ప్రదర్శించడంతో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 6.7 శాతంగా నమోదైంది. 2023 నవంబరులో నమోదైన 11.9% తర్వాత నమోదైన గరిష్ఠ స్థాయి ఇదే. ఐఐపీ గత నవంబరులో 5% ఉంది. ఈ ఏడాది సెప్టెంబరు 22వ తేదీ నుంచి కొత్త జీఎస్‌టీ రేట్లు అమలులోకి రావడంతో తయారీ రంగంలో ఆర్డర్లు పెరగడంతో ఐఐపీ వృద్ధికి దోహదపడిందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఆర్థిక ఉత్పత్తుల మోసపూరిత విక్రయాలకు చెక్

సమగ్ర నిబంధనలపై ఆర్‌బీఐ దృష్టి

ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తన నియంత్రణల పరిధిలో ఉన్న కంపెనీలు వినియోగదారులకు ఆర్థిక ఉత్పత్తులు, సేవలు మోసపూరితంగా విక్రయించడాన్ని నిలువరించే దిశగా సమగ్ర నిబంధనలు జారీ చేయనుంది. ఇందులో భాగంగా ఆయా సంస్థల ప్రకటనలు, మార్కెటింగ్, విక్రయాలకు నూతన మార్గదర్శకాలు జారీ చేస్తుంది. ఇలాంటి మోసపూరిత విక్రయాలు అటు కస్టమర్లు, ఇటు ఆర్థిక రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని ఆర్‌బీఐ సోమవారం ట్రెండ్ అండ్ ప్రోగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్ ఇన్ ఇండియా 2024-25 నివేదికలో తెలిపింది. రికవరీ ఏజెంట్లు, రుణాల రికవరీ విషయాల్లో ప్రవర్తనాపరమైన అంశాలు సమీక్షించి సమన్వయపూర్వకమైన ఆదేశాలు జారీ చేసే విషయం పరిశీలిస్తున్నట్టు తెలిపింది.

నష్టాల్లో మార్కెట్లు

ముంబై: బీఎస్ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ వరుసగా నాలుగో రోజూ నష్టపోయింది. సోమవారం ట్రేడింగ్‌లో 345.91 పాయింట్లు పతనమై 84,695.54 వద్దకు జారుకుంది. నిఫ్టీ 100.20 పాయింట్లు కోల్పోయి 25,942.10 వద్ద ముగిసింది. ఐటీ, బ్లూచిప్ ఆయిల్, గ్యాస్ షేర్లలో అమ్మకాలు ఇందుకు కారణమయ్యాయి.



పసిడి.. జీడీపీని మించి..!

- భారతీయుల వద్దనున్న బంగారం విలువ 5 లక్షల కోట్ల డాలర్లకు..
- మన జీడీపీ 4.1 లక్షల కోట్ల డాలర్లే..

భారతీయులకు బంగారంపై మక్కువ ఎక్కువే. గడిచిన రెండేళ్లలో పసిడి ధర వేగంగా పెరుగుతూ వచ్చినప్పటికీ మనోళ్ల కొనుగోళ్లు మాత్రం తగ్గింది లేదు. పండగలు, పెళ్లిళ్ల సీజన్‌లోనైతే ఈ లోహానికి గిరాకీ మరీ అధికం. అందుకే, మన వద్ద ఏ దేశవాసుల వద్ద లేనంత స్థాయిలో బంగారం నిల్వలున్నాయి. భారత కుటుంబాలు ఏకంగా 34,600 టన్నుల పసిడి నిల్వలను కలిగి ఉన్నాయని అంతర్జాతీయ ఆర్థిక దిగ్గజం మోర్గాన్ స్టాన్లీ గత అక్టోబరులో విడుదల చేసిన నివేదికలో అంచనా వేసింది. ఈ ఏడాదిలో బంగారం రేటు భారీగా ఎగబాకడంతో మనోళ్ల వద్దనున్న నిల్వల విలువ కూడా అదే స్థాయిలో పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు కొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి 4,550 డాలర్లకు చేరుకుంది. ఈ లెక్కన, భారత కుటుంబాల మొత్తం బంగారం నిల్వల విలువ 5 ట్రిలియన్ (లక్షల కోట్ల) డాలర్ల మైలురాయిని అధిగమించింది. ఇది మన దేశ జీడీపీ 4.1 లక్షల కోట్ల డాలర్ల కంటే అధికం.

75-80%

- దేశీయ కుటుంబాల వద్దనున్న బంగారం నిల్వల్లో ఆభరణాల వాటా.
- వార్షిక పసిడి గిరాకీలోనూ మూడింట రెండొంతు వాటా ఆభరణాలదే.

నం.2 పసిడి వార్షిక వినియోగంలో చైనా తర్వాత స్థానం భారత్‌దే

26 శాతం వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రకారం.. ప్రపంచ పసిడి గిరాకీలో భారత్ వాటా ఇది. 28 శాతం వాటాతో చైనా అగ్రస్థానంలో ఉంది.

32 శాతం ఈ జూన్ నాటికి పసిడి గిరాకీలో నాణేలు, కడ్డీల వాటా ఇది. ఐదేళ్ల క్రితం (2020 జూన్) ఈ వాటా దాదాపు 24 శాతం. అంటే, ఐదేళ్లలో 8 శాతం పెరిగింది. దేశంలో పసిడిలో పెట్టుబడులపై ఆసక్తి గణనీయంగా పెరిగిందనడానికిది నిదర్శనం.

880 టన్నులు ఆర్‌బీఐ వద్దనున్న బంగారం నిల్వలు. విదేశీ మారక (ఫారెక్స్) నిల్వల్లో పసిడి వాటా 14 శాతంగా ఉంది.

రిలయన్స్, బీపీ రూ.2.7 లక్షల కోట్లు చెల్లించాలి

కేజీ బేసిన్‌లో ఉత్పత్తి తగ్గింపుపై పరిహారం కోరిన ప్రభుత్వం

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్), బీపీ యాజమాన్యం కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లో తాము అనుమతి పొందిన ప్రాంతాన్ని మించి క్షేత్రాన్ని విస్తరించినందుకు, తమకు నిర్దేశించిన సహజవాయువు ఉత్పత్తి లక్ష్యాలను చేరలేకపోయినందుకు 3,000 కోట్ల డాలర్ల (రూ.2.7 లక్షల కోట్లు) పరిహారం చెల్లించాలని ప్రభుత్వం కోరుతోంది. 14 ఏళ్లుగా సాగుతున్న ఈ వివాదంపై విచారణ జరుపుతున్న ముగ్గురు సభ్యుల ఆర్బిట్రేషన్ ట్రైబ్యునల్ ముందు ప్రభుత్వం ఈ క్లెయిమ్‌ను ఉంచింది. నవంబరు 7వ తేదీన ట్రైబ్యునల్ తన విచారణ ముగించింది. వచ్చే ఏడాది ట్రైబ్యునల్ తీర్పు ప్రకటించవచ్చని, ఈ కేసులో నష్టపోయిన పార్టీ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసే ఆస్కారం సైతం ఉన్నదని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు వెల్లడించాయి. కట్టుబాటుకు అనుగుణంగా తాము ఉత్పత్తి చేయలేకపోయిన సహజ వాయువుకు నగదు రూపంలో పరిహారం చెల్లించడంతో పాటు అక్కడ ఏర్పాటు చేసిన వ్యవస్థలు, ఇంధన మార్కెటింగ్, వడ్డీ కింద చేసిన అదనపు వ్యయాలకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వం కోరుతోందని ఆ వర్గాల కథనం. వాటన్నింటికీ కలిపి మొత్తం క్లెయిమ్ విలువ 3,000 కోట్ల డాలర్ల పైమాటే అని వారంటున్నారు. కేజీ బేసిన్‌లోని కేజీ-డీడబ్ల్యూఎన్-98/3 (కేజీ-డీ6) బ్లాక్‌లో అంగీకరించిన మేరకు రిలయన్స్ ఇన్వెస్ట్ చేయకపోవడం వల్ల ధీరూభాయ్-1, ధీరూభాయ్-3 క్షేత్రాల్లో సామర్థ్య వినియోగం తగ్గిందన్నది ప్రభుత్వ అభియోగం. అయితే ఆర్ఐఎల్ ఈ క్లెయిమ్ వార్తలను తోసిపుచ్చింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,40,400 ▼	1,28,700 ▼	2,59,000 ▲
విజయవాడ	1,41,000 ▼	1,30,000 ▼	2,47,000 ▼
విశాఖపట్నం	1,41,200 ▼	1,29,900 ▲	2,81,000 ▲
రాజమండ్రి	1,39,960 ▼	1,28,700 ▼	2,51,000 ▲
ప్రొద్దుటూరు	1,42,300 ▼	1,30,920 ▼	2,46,000 ▼
ముంబై	1,36,781 ▼	1,25,291 ▼	2,35,440 ▲

ఎల్ అండ్ టీకి హైదరాబాద్ రేడియల్ రోడ్ ప్రాజెక్ట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కొత్తగా నిర్మించ తలపెట్టిన హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ ప్రాజెక్టును తమ అనుబంధ సంస్థ ఎల్ అండ్ టీ ట్రాన్స్‌పోర్టేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగం దక్కించుకుందని ఎల్ అండ్ టీ ప్రకటించింది. రంగారెడ్డి జిల్లాలో ఈ రెండో దశ ప్రాజెక్టును నిర్మించాల్సి ఉంటుంది. రూ.1,000 నుంచి రూ.2,500 కోట్ల మధ్యన విలువ గల ప్రాజెక్టులను "విశిష్ట" ప్రాజెక్టులుగా ఎల్ అండ్ టీ వర్గీకరిస్తుంది. 3+3 లేన్లుగా నిర్మించే ఈ యాక్సెస్ కంట్రోల్డ్ రోడ్ నిడివి 22.3 కిలోమీటర్లు. ఇది హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను 340 కిలోమీటర్ల నిడివి గల రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)తో అనుసంధానం చేయడం వల్ల ఈ ప్రాంతంలో కనెక్టివిటీని ఇది పెంచుతుందని బీఎస్ఈకి పంపిన ఒక ప్రకటనలో ఎల్ అండ్ టీ తెలిపింది. ఈ ప్రాజెక్టులో భాగంగా 3.6 కిలోమీటర్ల వయాడక్ట్, చిన్న వంతెనలు, అండర్ పాస్‌లు, కల్వర్టులు నిర్మించాల్సి ఉంటుందని ఎల్ అండ్ టీ వెల్లడించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 30వ తేదీ

హైదరాబాద్	650	విజయవాడ	680
వరంగల్	652	గోదావరి	665
చిత్తూరు	703	విశాఖపట్నం	660
		డజను గుడ్లు రూ.	96

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	142	విజయవాడ	135
వరంగల్	142	గుంటూరు	142
కరీంనగర్	142	ఒంగోలు	142
మహబూబ్‌నగర్	142	చిత్తూరు	144
కర్నూలు	142	నెల్లూరు	149
విశాఖపట్నం	131	అనంతపురం	149
గోదావరి	135		

స్పోర్ట్స్



(4-1-7-8)

ఒకే ఒక్కడు 8 వికెట్లు

టీ20లో భూటాన్ స్పిన్నర్ సోనమ్ వరల్డ్ రికార్డు

న్యూఢిల్లీ: భూటాన్ లెఫ్టామ్ స్పిన్నర్ సోనమ్ యాషి టీ20ల్లో సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఓ మ్యాచ్‌లో ఏకంగా 8 వికెట్లు పడగొట్టి అద్భుత ప్రదర్శన చేశాడు. దీంతో ఈ ఘనత సాధించిన తొలి బౌలర్‌గా 22 ఏళ్ల సోనమ్ చరిత్రకెక్కాడు. భూటాన్‌లోని మైండ్‌ఫుల్‌నెస్ సిటీలో మయన్మార్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో సోనమ్ 4 ఓవర్లలో 7 పరుగులిచ్చి 8 వికెట్లు పడగొట్టాడు. ఇందులో ఓ మెయిడిన్ ఓవర్ ఉంది. అంతర్జాతీయ టీ20లు లేదా ఇతర టీ20 లీగ్‌లలో ఈ ఫీట్ నమోదవడం ఇదే మొదటిసారి. ఈ క్రమంలో.. గతంలో చైనాపై మలేసియా బౌలర్ సయజ్రుల్ ఇద్రుస్ (7/8) ఏడు వికెట్ల రికార్డును సోనమ్ బద్దలు కొట్టాడు. ఇక, మ్యాచ్ విషయానికొస్తే, తొలుత భూటాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 127/9 స్కోరు చేసింది. ఛేదనలో యువ స్పిన్నర్ సోనమ్ విజృంభణకు మయన్మార్ జట్టు 45 పరుగులకే కుప్పకూలింది. జట్టులో ఇద్దరు బ్యాటర్లు మాత్రమే రెండంకెల స్కోరు చేయగా, మరో నలుగురు డకౌటయ్యారు. దీంతో భూటాన్ 82 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

ఘనంగా ముగించాలని..

- క్లీన్‌స్వీప్‌పై భారత్ దృష్టి
- ఓదార్పు విజయం కోసం శ్రీలంక
- మహిళల ఐదో టీ20 నేడు



తిరువనంతపురం: ఐదు టీ20ల సిరీస్‌లో నాలుగు వరుస విజయాలతో దూకుడు మీదున్న భారత మహిళల జట్టు క్లీన్‌స్వీప్‌తో.. ఈ ఏడాదికి గ్రాండ్‌గా గుడ్‌బై చెప్పాలనుకొంటోంది. అయితే, ప్రత్యర్థి శ్రీలంక మంగళవారం జరిగే ఆఖరి, ఐదో టీ20లో నైనా నెగ్గి ఓదార్పు విజయాన్ని నమోదు చేయాలనుకొంటోంది. ఈ సిరీస్ ముగిసిన తర్వాత వరల్డ్‌కప్ సన్నాహకాల కోసం ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లో భారత జట్టు పర్యటించనుంది. 2024 టీ20 వరల్డ్‌కప్‌లో గ్రూప్‌దశలోనే నిష్క్రమించిన హర్మన్‌ప్రీత్ సేన.. ఆ తర్వాత పంథాను మార్చుకొని దూకుడుగా ఆడుతూ బలమైన ప్రత్యర్థిగా మారింది. ఈ సిరీస్‌లో భారత బౌలర్లు మెరుగ్గా రాణించారు. లంకను తక్కువ స్కోరుకే కట్టడి చేయడంతో.. తొలి మూడు మ్యాచ్‌ల్లో బ్యాటర్లు పెద్దగా శ్రమించాల్సిన అవసరం లేకుండా పోయింది. ఓపెనర్ షఫాలీ వర్మ అద్భుతంగా రాణిస్తోంది. అయితే, భారత ఫీల్డింగ్ ప్రమాణాలను అందుకోలేక పోవడం మాత్రం ఆందోళనకరం. నాలుగో టీ20లో కూడా రెండు క్యాచ్‌లతోపాటు ఓ స్టంపింగ్ అవకాశాన్ని చేజార్చారు. కాగా, ఏడాది తర్వాత పేసర్ రేణుక సింగ్ పొట్టి ఫార్మాట్‌లోని గ్రాండ్‌గా రీఎంట్రీ ఇవ్వడం సానుకూలాంశం. సీనియర్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ నిలకడగా రాణిస్తుండగా.. ఈ సిరీస్‌లో అరంగేట్రం చేసిన స్పిన్నర్ వైష్ణవి శర్మ ఆకట్టుకొంది. డాషింగ్ బ్యాటర్ స్మృతి మంధాన (48 బంతుల్లో 80) టచ్‌లోకి రావడం ఊరటనిచ్చే విషయం కాగా.. వన్‌డౌన్‌కు ప్రమోట్ అయిన రిచా ఘోష్ కూడా తనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొంది. జ్వరంతో బాధపడుతున్న జెమీమా రోడ్రిగ్స్ ఫిట్‌నెస్‌పై ఎటువంటి సమాచారం లేదు. జట్టులోని అందరికీ అవకాశాలు లభించడంతో ఇక మిగిలిన 17 ఏళ్ల వికెట్ కీపర్ బ్యాటర్ కమలి అరంగేట్రం చేసే అవకాశాలున్నాయి. గత మూడు మ్యాచ్‌ల్లో భారత్‌కు ఏమాత్రం పోటీ ఇవ్వలేక పోయిన లంక.. నాలుగో మ్యాచ్‌లో ఛేదనలో దీటుగానే నిలిచింది. ఇదే ఆత్మవిశ్వాసంతో ఈ సిరీస్‌ను విజయంతో ముగించాలని చమరి ఆటపట్టు సేన పట్టుదలతో ఉంది.

జట్లు (అంచనా)

భారత్: స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా/హర్లీన్ డియోల్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), రిచా ఘోష్/కమలిని, దీప్తీశర్మ, అమన్‌జోత్ కౌర్, రేణుక సింగ్, క్రాంతి గౌడ్, వైష్ణవి శర్మ, శ్రీచరణి.

శ్రీలంక: చమరి ఆటపట్టు (కెప్టెన్), హాసిని పెరీరా, హర్షిత సమరవిక్రమ, ఇమేషా దులాని, నీలాక్షిక సిల్వ, కౌషిని నుత్యాంగన, కవిష దిల్హారి, మాల్కి మదార/క్యావ్యా కవింది, ఇనోకా రణవీర, మాల్షా షెహాని, నిమాషా మీపేజ్.

పిచ్/వాతావరణం..

వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలం కావడంతో మరోసారి పరుగుల వరద పారే అవకాశం ఉంది. మంచు ప్రభావం ఉండడంతో టాస్ గెలిచిన టీమ్ బౌలింగ్ ఎంచుకోవచ్చు. వాతావరణం చల్లగా ఉంది.

కార్ల్‌సన్‌కు అర్జున్ షాక్

వరల్డ్ బ్లిట్జ్ చాంపియన్‌షిప్





దోహా: ఫిడే వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గిన తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి.. బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ సాధించే దిశగా దూసుకెళుతున్నాడు. సోమవారం ప్రారంభమైన బ్లిట్జ్ పోటీల్లో వరల్డ్ నెంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు అర్జున్ షాకిచ్చాడు. మొదటి రోజు 13 రౌండ్‌లు జరిగాయి. తొలిరోజు ముగిసేసరికి అర్జున్ (10) అగ్ర స్థానంలో నిలిచాడు. ఎనిమిది గేమ్‌లలో గెలిచిన అతడు నాలుగు మ్యాచ్‌లను డ్రా చేశాడు. ఒక గేమ్‌లో ఓడిన అర్జున్ మొత్తం 10 పాయింట్లు సాధించాడు. తొమ్మిదో రౌండ్‌లో కార్ల్‌సన్‌పై అర్జున్ గెలుపొందడం విశేషం. మరో ఇద్దరితో కలిసి అర్జున్ టాప్‌లో కొనసాగుతున్నాడు. మంగళవారం మరో ఆరు రౌండ్‌లతోపాటు సెమీఫైనల్స్, ఫైనల్స్ జరుగుతాయి. గుకేష్ (8.5) 28వ స్థానంలో కొనసాగుతున్నాడు. మహిళల విభాగంలో మొదటి రోజు 10 రౌండ్‌లు జరిగాయి. ఎలిన్ రోబర్స్ (8.5), వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్ అలెక్సాండ్రా గొర్యాచ్కినా (8), ఒమనోవా (8) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. ఇక, ర్యాపిడ్‌లో కాంస్య పతకం సాధించిన గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి (5) సంయుక్తంగా 61వ స్థానంలో కొనసాగుతోంది.

ప్రధాని ప్రశంసలు

ఫిడే ప్రపంచ చాంపియన్‌షిప్ ర్యాపిడ్ విభాగంలో కాంస్య పతకాలు సాధించిన తెలుగు గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, అర్జున్ ఇరిగేసిలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఆటపట్ల వీరికున్న పట్టుదల, పోరాటపటిమ ప్రశంసనీయమని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



13 ఏళ్ల బాలుడికి ఫిడే టైటిల్

న్యూఢిల్లీ: ఫిడే ర్యాపిడ్ రేటింగ్ చెస్.. వేద టోర్నమెంట్ టైటిల్‌ను 13 ఏళ్ల ఢిల్లీ చిచ్చర పిడుగు జగ్రీత్ మిశ్రా కైవసం చేసుకున్నాడు. మొత్తం 9 రౌండ్లలో జగ్రీత్ ఒక్క గేమ్‌లో కూడా ఓడిపోకుండా 8.5 పాయింట్లతో అగ్రస్థానం దక్కించుకున్నాడు.

విజయ్ హజారేలో మరో మ్యాచ్ ఆడనున్న కోహ్లీ



న్యూఢిల్లీ: టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ విజయ్ హజారే ట్రోఫీ టోర్నీలో మరో మ్యాచ్‌లో బరిలోకి దిగనున్నాడు. జనవరి ఆరున బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ గ్రౌండ్‌లో జరిగే ఆ మ్యాచ్‌లో రైల్వేస్‌తో ఢిల్లీ తలపడనుంది. బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టు ఆటగాళ్లు కనీసం రెండు విజయ్ హజారే ట్రోఫీ టోర్నీ మ్యాచ్‌ల్లో పాల్గొనడాన్ని బోర్డు తప్పనిసరి చేసింది. ఈ నేపథ్యంలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో 131, 77 పరుగులతో విరాట్ అదరగొట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో లిస్ట్ 'ఎ' మ్యాచ్‌ల్లో వేగంగా (330 ఇన్నింగ్స్) 16 వేల పరుగుల మైలురాయిని చేరిన రికార్డును అతడు సొంతం చేసుకున్నాడు. వచ్చే నెలలో న్యూజిలాండ్ జట్టుతో వన్డే సిరీస్‌కు సన్నాహకాల్లో భాగంగా విజయ్ హజారేలో మరో మ్యాచ్ బరిలో దిగాలని కోహ్లీ నిర్ణయించుకున్నట్టు తెలిసింది.

గౌతీని మార్చే ఉద్దేశం లేదు



బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా

న్యూఢిల్లీ: టెస్ట్ కోచ్ బాధ్యతల నుంచి గౌతమ్ గంభీర్‌ను తప్పించనున్నారంటూ వస్తున్న ఊహాగానాలను బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఖండించాడు. 'గంభీర్ గురించి మీడియాలో వస్తున్న వార్తలపై నేను ఒకటి స్పష్టం చేయదల్చుకొన్నా. గౌతీని తప్పించడం కానీ.. మరో హెడ్ కోచ్‌ను తీసుకోవడం గానీ జరగదు. బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడని శుక్లా తెలిపాడు. భారత జట్టు సొంతగడ్డపై న్యూజిలాండ్, ఆ తర్వాత దక్షిణాఫ్రికా చేతిలో వైట్‌వాష్ కావడంతో.. గౌతీ స్థానంలో వీవీఎస్ లక్ష్మణ్‌కు టెస్ట్ బాధ్యతలు అప్పజెప్పే దిశగా బీసీసీఐ సమాలోచన చేస్తోందన్న వార్తలు నెట్‌లో షికార్లు చేస్తున్నాయి.

ఎంసీజీకి ఓ పాయింట్ జరిమానా

పిచ్‌పై ఐసీసీ అసంతృప్తి




దుబాయ్: ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ జట్ల మధ్య మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో జరిగిన యాషెస్ నాలుగో టెస్ట్ పిచ్‌పై ఐసీసీ తీవ్ర అసంతృప్తి ప్రకటించింది. బౌలర్లకు మరీ ఎక్కువగా సహకరించేలా వికెట్‌ను ఉన్నదని పేర్కొంది. ఈ క్రమంలో పిచ్‌పై ఒక డీమెరిట్ పాయింట్ జరిమానాగా విధించింది. కేవలం 142 ఓవర్లు మాత్రమే సాగిన ఈ బాక్సింగ్ డే టెస్ట్‌లో తొలిరోజు 20, రెండోరోజు 16 వికెట్లు నేలకూలిన సంగతి తెలిసిందే. కేవలం రెండు రోజుల్లో ముగిసిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ నాలుగు వికెట్లతో గెలుపొందింది.

ఆంధ్ర పరాజయం

విజయ్ హజారే ట్రోఫీ

ఆలూరు: విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీ మూడో మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు పరాజయం పాలైంది. ఎలీట్ గ్రూప్ 'డి'లో భాగంగా సోమవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఒడిశా ఆరు వికెట్లతో ఆంధ్రపై గెలుపొందింది. మొదట ఆంధ్ర 49.2 ఓవర్లలో 221 పరుగులకే కుప్పకూలింది, ఎస్డీఎన్వీ ప్రసాద్ (66) అర్ధ శతకంతో ఆదుకున్నాడు. చివర్లో సౌరవ్ కుమార్ (26 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 47) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. శ్రీకర్ భరత్ (32) పర్లేదనిపించాడు. సమంత్రే, గోవింద చెరో 3 వికెట్లు కైవసం చేసుకున్నారు. అనంతరం ఒడిశా 43.4 ఓవర్లలో 223/4 స్కోరు చేసి విజయం దక్కించుకుంది. ముండే (91), గోవింద్ పొద్దార్ (89) హాఫ్ సెంచరీలతో మెరిశారు. ముండే, పొద్దార్ మూడో వికెట్‌కు 166 పరుగులు జోడించారు. సత్యనారాయణ రాజు రెండు వికెట్లు పడగొట్టాడు.

వైభవ్ @310



రాంచీ: క్రికెట్‌లో వరుసపెట్టి రికార్డులు సృష్టిస్తున్న యువ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ (బిహార్) 300కుపైగా స్ట్రయిక్ రేట్‌తో ఔరా అనిపించాడు. విజయ్ హజారే టోర్నీలో భాగంగా సోమవారం ఇక్కడ మేఘాలయతో జరిగిన మ్యాచ్‌లో 10 బంతుల్లో 31 పరుగులు చేయడం ద్వారా 310 స్ట్రయిక్ రేట్ నమోదు చేశాడు. అయితే ఈ ధనాధన్ ఇన్నింగ్స్‌ను వైభవ్ కొనసాగించ లేకపోయాడు. అదే స్కోరు వద్ద క్యాచవుటయ్యాడు. ఇక..218 పరుగుల ఛేదనను బిహార్ 32.3 ఓవర్లలో 220/2 స్కోరుతో ముగించింది.

హైదరాబాద్ క్రికెటర్ చరణ్‌పై బీసీసీఐ నిషేధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెటర్ ఎం. రామ్‌చరణ్‌పై రెండేళ్ల పాటు నిషేధం విధిస్తున్నట్టు బీసీసీఐ ప్రకటించింది. అతడిని ఈ రెండేళ్లు మరే రాష్ట్రం తరపున కానీ, రాష్ట్ర స్థాయి పోటీల్లో కానీ ఆడించవద్దని ఆదేశించింది. వయసు సంబంధిత వివాదంలో అతడిపై బీసీసీఐ వేటు వేసినట్టు హెచ్‌సీఏ తెలిపింది.



సీఎం చంద్రబాబును సన్మానిస్తున్న ఏపీఎన్‌జీజీవో అధ్యక్షుడు విద్యాసాగర్, ఉద్యోగ, ఆర్టీసీ, ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నాయకులు

రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగులు కీలకం కావాలి

- ఉద్యోగ, ఉపాధ్యాయ, ఆర్టీసీ సంఘాల క్యాలెండర్, డైరీ ఆవిష్కరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, విజయవాడ సిటీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగ సంఘాల నాయకులు కీలక భాగస్వాములు కావాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఏపీఎన్‌జీజీవో, ఏపీ జేఏసీ అమరావతి, ఉపాధ్యాయ, ఆర్టీసీ సంఘాల క్యాలెండర్, డైరీలను సీఎం చంద్రబాబు సోమవారం ఆవిష్కరించారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబును సోమవారం ఏపీ ఎన్‌జీజీవో అధ్యక్షుడు విద్యాసాగర్, కార్యదర్శి రమణ, ఏపీ జేఏసీ అమరావతి కమిటీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, రఘునాథరెడ్డి, హృదయ రాజు, మంజులు, శ్రీనివాస్, పెన్షనర్స్, సీపీఎస్, గ్రామ/వార్డు సచివాలయ, ఏపీపీఏవో, ఎన్‌జీవో, క్లాస్ 4 ఎంప్లాయిస్, వెటర్నరీ, ఏఈవో, ట్రెజరీ, ఆర్ఎ్‌స్వో, రెవెన్యూ, ఆర్టీసీ ఈయూ, ఆర్టీసీ ఎన్ఎంయూ, కో-ఆపరేటివ్, లేబర్ ఆఫీసర్, పీఆర్ ఇంజనీర్ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయా సంఘాలకు చెందిన క్యాలెండర్, డైరీలను సీఎం ఆవిష్కరించారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ఈ సందరర్భంగా ఆయా సంఘాల నేతలు ఓ ప్రకటనలో ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఉద్యోగులకు సంబంధించిన కొన్ని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.

ఇది ఉద్యోగ, ఉపాధ్యాయ ఫ్రెండ్లీ ప్రభుత్వం

ఇది ఉద్యోగ, ఉపాధ్యాయ ఫ్రెండ్లీ ప్రభుత్వం అని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం(ఆప్టా), తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం(టీఎన్‌యూఎస్), ఏపీటీఎఫ్ రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఆప్టా ప్రతినిధులు కాకి ప్రకాశ్‌రావు, కె.వెంకటరత్నం, టీఎన్‌యూఎస్ ప్రతినిధులు మన్నం శ్రీనివాస్, చెరుకూరి పూర్ణచంద్రరరావు, ఏపీటీఎఫ్ నేతలు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి తదితరులు సీఎంను కలిశారు.

జంగారెడ్డిగూడెం మరణాలన్నీ జగన్‌రెడ్డి హత్యలే

- ధరలు పెంచి కల్తీ మద్యం అమ్మారు: మంత్రి కొల్లు

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జంగారెడ్డిగూడెంలో కల్తీ సారా తాగడం వల్ల సంభవించిన మరణాలన్నీ జగన్‌రెడ్డి చేసిన హత్యలేనని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. మద్యం వ్యాపారాన్ని గుప్పిట్లోకి తీసుకుని కల్తీ మద్యాన్ని ప్రజల నెత్తిన రుద్దారని ధ్వజమెత్తారు.

టెన్త్ మార్కుల జాబితాలో ఒకేషనల్ మార్కులు

- సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు వెల్లడి

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం నుంచి టెన్త్ మార్కుల జాబితాలో ఒకేషనల్ సబ్జెక్టు మార్కులను కూడా జత చేస్తామని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు వెల్లడించారు. సోమవారం విజయవాడలో జరిగిన పాఠశాల విద్యార్థుల రాష్ట్ర స్థాయి నైపుణ్య పోటీల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫిన్‌లాండ్ తరహాలో యాక్టివిటీ ఆధారిత లెర్నింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

భూ సర్వేల్లో తప్పిదాలు దొర్లకూడదు

- రెవెన్యూ సేవలు సులభంగా ప్రజలకు అందాలి
- అన్ని ఆలయాల్లో తిరుమల తరహా సేవకులు
- భూసారపరీక్షలు చేసి రైతులకు సమాచారం
- ప్రజారోగ్యం బాగుపడేలా పంటలు పండించాలి
- వ్యవసాయం-వైద్య ఆరోగ్య శాఖలు కలిసి పనిచేయాలి
- ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖలపై సీఎం చంద్రబాబు సమీక్ష



ఆర్టీజీఎస్‌లో వివిధ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉన్నతాధికారులు

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): భూ సర్వేల విషయంలో ఎలాంటి తప్పిదాలు జరగకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. సర్వే చేయించుకునేవారు ఎలాంటి ఇబ్బందులు పడకూడదని, దీన్ని దృష్టిలో పెట్టుకుని రెవెన్యూ యంత్రాంగం పనిచేయాలని స్పష్టం చేశారు. రెవెన్యూశాఖకు కొన్ని విషయాల్లో ఉన్న చెడ్డ పేరు తొలగించుకోవాలన్నారు. సోమవారం ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖలపై సీఎం సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, వ్యవసాయం, పౌరసరఫరాలు, వైద్యఆరోగ్యం, రవాణా, అగ్నిమాపక, దేవదాయ సహా పలు శాఖల పనితీరును సమీక్షించారు. క్షేత్ర స్థాయిలో ఆయా శాఖల పనితీరు ఏ విధంగా ఉంది, ఎలా ఉండాలని అనే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని దేవాలయాలు శ్రీవారి సేవకుల తరహా విధానాన్ని అవలంబించాలని దేవదాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆలయాల్లో సేవల కోసం స్థానికంగా వలంటీర్లను నియమించుకోవాలని, సేవలు చేసే వారిని గుర్తించి వారి జాబితాను సిద్ధం చేయాలని అన్నారు. భగవంతుడి సేవకు చాలా మంది భక్తులు ముందుకు వస్తారని, వారిని ప్రోత్సహించాలని సూచించారు. శ్రీశైలంలోనూ ఇదే విధానాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు ఉండాలన్నారు. ఆసుపత్రులు పరిశుభ్రతతో ఉండాలని చెప్పారు. రోగులకు మంచి సేవలు అందించాలన్నారు. డాక్టర్లు అందరూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్లు రెగ్యులర్ అంశాలపై ఫోకస్ పెడుతూనే కీలకమైన శాఖలు, విభాగాలపై మరింత శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రజలు నిత్యం సందర్శించే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వాసుపత్రుల్లో క్షేత్రస్థాయి పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని చెప్పారు.

ధాన్యం కొనుగోళ్లలో ఫిర్యాదులు రాకూడదు..

భూసార పరీక్షలు ఎప్పటికప్పుడు నిర్వహించి వ్యవసాయ క్షేత్రాల్లోని మట్టిలో ఉన్న పోషక విలువలు ఏమోతాదులో ఉన్నాయి.. ఆ భూమి ఎంత సారవంతమైనది అనే విషయాన్ని గుర్తించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎరువుల వినియోగం వల్ల భూసారం తగ్గినా, లేదా కలుషితమైనా ఆ సమాచారాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. తక్కువ యూరియా వినియోగం వినియోగంతో ఎక్కువ పంటలు ఎలా పండించాలో రైతులకు వివరించాలన్నారు. ప్రజల ఆరోగ్యం బాగుండటానికి ఎలాంటి పంటలు పండించాలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మెరుగైన ప్రజారోగ్యం కోసం వ్యవసాయ, వైద్యారోగ్య శాఖలు కలిసి పనిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉండే ఆర్ఎస్‌కే-పీహెచ్‌సీలు కలిసి పనిచేయాలని చెప్పారు. ఈ విషయంలో వ్యవసాయ, వైద్యఆరోగ్య శాఖల ఉన్నతాధికారులు పూర్తిస్థాయి ఫోకస్ పెట్టాలని సూచించారు. ఇక ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా మిల్లర్లు ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని ప్రయత్నిస్తే.. వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రవాణా శాఖ కూడా తన పనితీరును మరింత మెరుగు పరుచుకోవాలని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. అగ్నిమాపక శాఖ పనితీరును ఈ సందర్భంగా సీఎం అభినందించారు. ఈ సమీక్షలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పంచాయతీల పునర్విభజన

ఇప్పట్లో లేనట్లే!

(మొదటి పేజీ తరువాయి)

చేయాలంటూ పలు ప్రతిపాదనలు పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు చేరాయి. వాటన్నిటినీ కమిషనర్ కార్యాలయం సోమవారం నాటికి ప్రభుత్వానికి చేర్చనుంది. అయితే జగన్ ప్రభుత్వ హయాంలో తెచ్చిన చట్ట సవరణ 274(ఏ) ప్రకారం గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాలు ఉన్నంత కాలం వాటి సరిహద్దులు మార్చరాదు. ఇదే ప్రస్తుతం పునర్విభజన ప్రక్రియకు అడ్డంకిగా మారిందని అంటున్నారు. ఆ పాలకవర్గాల పదవీకాలం ఏప్రిల్ 2తో ముగియనుంది. ఆ తర్వాత పునర్విభజన ప్రక్రియ చేపట్టే అవకాశం ఉంది. అయితే అది చేయాలంటే జనగణన అమల్లో ఉన్నందున సెన్సస్ కమిషనర్ అనుమతితో చేపట్టాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను ఎలాగూ ఏప్రిల్ నాటికి నిర్వహించదు. కొంత కాలం తర్వాత అంటే.. ఏప్రిల్లో నూతన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నియామకం తర్వాత ఈ ప్రక్రియను ప్రారంభిస్తే.. జూన్, జూలైలో ఎన్నికలు నిర్వహించడానికి ఆస్కారం ఉంటుంది.

తాను తెచ్చిన చట్టానికి తానే తూట్లు..: పంచాయతీ పాలకవర్గాలు ఉన్నంతకాలం భౌగోళికమార్పులు చేపట్టరాదంటూ వైసీపీ హయాంలో పంచాయతీరాజ్ చట్టంలోని 274 (ఏ)కు 2022లో చట్ట సవరణ చేశారు. అదే విధంగా పట్టణ ప్రాంతాల్లోనూ మున్సిపల్ శాఖ ద్వారా చట్ట సవరణ చేశారు. అయితే అదే ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్లకు సమీపంలో ఉన్న పలు పంచాయతీలను విలీనం చేసింది. దీంతో ఆయా పంచాయతీలు కోర్టును ఆశ్రయించడంతో ఆ ప్రక్రియను నిలిపేసింది. తాజాగా మున్సిపల్ మంత్రి హైకోర్టు అడ్వకేట్ జనరల్ సలహాతో గ్రేటర్ తిరుపతి, గ్రేటర్ విజయవాడ ప్రక్రియను వాయిదా వేశారు. పాలకవర్గాల పదవీకాలం ఏప్రిల్2దాకా ఉన్నందున ఇప్పుడు పంచాయతీల పునర్విభజన చేపడితే చట్టవిరుద్ధమవుతుందని న్యాయనిపుణులు సూచించారు. దీంతో ఆ ప్రక్రియ ఇప్పట్లో లేనట్లేనని అధికారులు చెబుతున్నారు.

'లిటిగేషన్ పాలసీ'పై మంత్రివర్గ ఉపసంఘం భేటీ

- న్యాయశాఖ పటిష్ఠత చర్యలపై విస్తృత చర్చ

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాజ్య విధానం(లిటిగేషన్ పాలసీ)-2025ను పరిశీలించడానికి ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం సోమవారం అమరావతి సచివాలయంలో తొలిసారి భేటీ అయ్యింది. న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, పౌరసరఫరాల మంత్రి మనోహర్, వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ న్యాయశాఖ ఉన్నతాధికారులతో సమావేశమై చర్చించారు. కోర్టుల్లో అనవసర వ్యాజ్యాలను తగ్గించడం, సమస్యలకు సకాలంలో ప్రభావంతమైన, ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని చూపడం, ప్రభుత్వ విభాగాల్లో పారదర్శకత, జవాబుదారీతనం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం ఇటీవల నియమించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాజ్య విధానం-2025పై పలు నిర్ణయాలను రూపొందించడంలో భాగంగా మంత్రుల కమిటీ తొలిసారి సమావేశమైంది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ... కోర్టుల్లో అనవసరమైన వ్యాజ్యాలను తగ్గించడానికి, కోర్టులపై అధిక భారాన్ని నివారించడానికి, పాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడంతోపాటు, పాలనా స్థాయిలో వివిధ పద్ధతులను సమీక్షించి మంత్రుల సంఘం సూచనలు చేస్తోందని తెలిపారు. ముందస్తు కేసు నిర్వహణ ద్వారా అప్పీళ్లను న్యాయంగా దాఖలు చేయడానికి, విధానపరమైన జాప్యాలను తొలగించడానికి తీసుకోవాల్సిన చర్యలను కూడా సూచిస్తుందన్నారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. తదుపరి జీవోఎం సమావేశం నాటికి ప్రభుత్వ శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు తెప్పించాల్సిందిగా న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభాదేవికి సూచించామన్నారు. గుజరాత్, కర్ణాటక, రాష్ట్రాల లిటిగేషన్ పాలసీ వివరాలు కూడా మంత్రివర్గ ఉప సంఘానికి తెలియజేయాలని కార్యదర్శిని ఆదేశించారు.

సాంఘిక సంక్షేమశాఖ అంటే అంత అలుసా?

- నోడల్ ఏజెన్సీ సమావేశానికి ఎందుకు రారు?
- నిధుల వినియోగంలో అలసత్వాన్ని సహించం
- అధికారుల తీరుపై మంత్రి డోలా ఆగ్రహం



ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులపై నోడల్ ఏజెన్సీ సమావేశంలో మంత్రి డోలా స్వామి, అధికారులు

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): 'హెచ్‌వోడీలు నోడల్ ఏజెన్సీ సమావేశానికి ఎందుకు రారు? సాంఘిక సంక్షేమశాఖ అంటే అధికారులకు అంత చిన్నచూపా?' అంటూ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి అధికారుల గైర్హాజరుపై మండిపడ్డారు. సోమవారం సాంఘిక సంక్షేమశాఖ నోడల్ ఏజెన్సీ సమావేశం సచివాలయంలో మంత్రి అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశానికి పలు శాఖలకు సంబంధించిన హెచ్‌వోడీలు హాజరుకాకపోవడంపై ఆయన నిలదీశారు. హెచ్‌వోడీలు సమావేశానికి రాకపోవడం పేద, బలహీనవర్గాల ప్రజల పట్ల వారికున్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. ఇకపై ఇలాంటి చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఈ ఏడాది ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై శాఖల వారీగా వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది ముగుస్తున్నా... కొన్ని శాఖలు సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో ఎందుకు వెనుకబడ్డాయని ప్రశ్నించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు నూరుశాతం ఖర్చు చేయాలని, నిధుల వినియోగంలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. సబ్‌ప్లాన్ నిధుల వినియోగానికి అంచనాలు రూపొందించేటప్పుడు ఊహాగానాలతో లెక్కలు వేయకుండా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి నిర్దిష్టమైన ప్రణాళికలతో అంచనాలు రూపొందించాలని నిర్దేశించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

సూర్యతో కుటుంబ కథా చిత్రం





- నాగవంశీ

సూర్య హీరోగా వెంకీ అట్లూరి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం వర్కింగ్ టైటిల్ 'సూర్య 46'. మమితా బైజు కథానాయిక. తాజాగా ఈ చిత్రం గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు నాగవంశీ. 'సూర్యతో చేస్తున్న చిత్రం పూర్తి స్థాయి కుటుంబ కథా చిత్రం. భావోద్వేగాలకి పెద్దపీట వేస్తున్నాం. ఓ 45 ఏళ్ల వ్యక్తి, 20 ఏళ్ల అమ్మాయి మధ్య నడిచే ఈ కథలో ప్రేమ, మానవ సంబంధాల గురించి లోతుగా టచ్ చేస్తున్నాం' అని అన్నారు. అలాగే టికెట్ ధరలు, సినిమా ప్రచారాల గురించి స్పందించారు. 'ప్రేక్షకులను దోచుకోవడానికి నిర్మాతలు టికెట్ ధరలు పెంచట్లేదు. చిన్న సినిమా బడ్జెట్ తక్కువ కాబట్టి రూ.99 పెట్టినా నిర్మాతలకు డబ్బులు వచ్చే స్థాయి. కానీ పెద్ద సినిమాలకు ఇలా చేయలేం. రూ.99 టికెట్ పెడితే వాటి బడ్జెట్ రికవర్ అవ్వడం అసాధ్యం అవుతుంది. బడ్జెట్ తక్కువ ఉన్నవాటికి మాత్రమే అలా చేస్తున్నామని అర్థం చేసుకోవాలి. కేవలం సానుభూతితో సినిమాలు వర్కౌట్ కావు. సినిమా ప్రచారంలో మాట్లాడిన మాటలు చూసి ప్రేక్షకులు థియేటర్లకు రావట్లేదు. కంటెంట్ బాగుంటేనే వారు చూస్తారు. సినిమాను తొక్కేస్తున్నారన్నది కూడా అసత్యం' అని పేర్కొన్నారు.

అప్పల సూరిగా జగపతిబాబు



రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న చిత్రం 'పెద్ది'. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న ఈ చిత్రం ఉగాది సందర్భంగా మార్చి 27న విడుదలవుతోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి వరుస అప్డేట్స్‌ను ఇస్తున్న మేకర్స్. సోమవారం ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న జగపతి బాబు లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన అప్పలసూరి అనే పాత్రలో కనిపించనున్నారు. ఎవ్వరూ గుర్తుపట్టలేని విధంగా పూర్తిగా మేకోవర్ అయ్యారు జగపతిబాబు. బాలీవుడ్ నటులు బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ, కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. ఇటీవలె విడుదలైన ప్రచార చిత్రాలు, టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'చికిరి చికిరి' సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఈ చిత్రానికి ఎడిటర్: నవీన్ నూలి, డీఓపీ: ఆర్ రత్నవేలు, సంగీతం: ఏఆర్ రెహ్మాన్.

పెళ్లి ఎప్పుడో చెప్పేసిన అల్లు శిరీష్



హీరో అల్లు శిరీష్ త్వరలోనే తన ప్రియురాలు నయనికతో వివాహబంధంలోకి అడుగుపెడుతున్న సంగతి తెలిసిందే. ఇటీవలె వారిద్దరి నిశ్చితార్థం జరిగింది. తాజాగా ఆయన తన పెళ్లి తేదీని వెల్లడించారు. వచ్చే ఏడాది మార్చిన 6న వివాహం జరగనున్నట్లు తెలిపారు. అల్లు అర్జున్ తనయుడు అయాన్, తనయురాలు అర్హతో ఓ పాటకు రీల్స్ చేసే సందర్భంలో ఈ విషయాన్ని తెలిపారు. 'బాబాయ్ నీ పెళ్లికి సంగీత్ ఉంటుందా' అని వారు అడగ్గా.. 'మనం దక్షిణాది వాళ్లం. అలాంటి వేడుకను చేసుకోం' అని బదులిచ్చారు.



మయసభలో రాజాసాబ్

ప్రభాస్ కథానాయకుడిగా మారుతి తెరకెక్కిస్తున్న హారర్ థ్రిల్లర్ 'ద రాజాసాబ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. సంజయ్ దత్, బొమన్ ఇరానీ, జరీనా వహాబ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. జనవరి 9న సంక్రాంతి సందర్భంగా చిత్రం విడుదలవుతోంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు, పాటలు, టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా నుంచి రెండో ట్రైలర్ 'రాజాసాబ్ ట్రైలర్ 2.0'ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ రాజాసాబ్ ప్రపంచాన్ని మరింత విస్తృతంగా చూపించింది. ప్రభాస్‌కు సంజయ్ దత్‌కు మధ్య జరిగే పోరు చాలా ఆసక్తికరంగా ఉండబోతోందని హింట్ ఇచ్చింది. భయానకమైన ఆత్మతో తలపడే శక్తిమంతమైన పాత్రలో ప్రభాస్ కనిపించారు. 'ఈ ఇల్లు మయసభ లాంటిది, ఇక్కడికి రావడమే కాని, వెళ్లాలంటే తాత సంతకం కావాలి', 'మన టైమ్ స్టార్ట్ అయ్యింది' వంటి సంభాషణలు, యాక్షన్ ఘట్టాలు, థమన్ ఇచ్చిన నేపథ్య సంగీతం, విజువల్స్ అదిరిపోయాయి. చివరలో పలు హాలీవుడ్ చిత్రాల్లోని ఐకానిక్ క్యారెక్టర్ 'జోకర్' లుక్‌లో ప్రభాస్ కనిపించిన ఫ్రేమ్ ప్రధానాకర్షణగా నిలిచింది. ఈ చిత్రానికి ఎడిటర్: కోటగిరి వెంటేశ్వర రావు, డీఓపీ: కార్తీక్ పళని, సంగీతం: థమన్.



చిన్న సినిమాలను ఆదరిస్తున్నారు

శ్రీనందు, యామినీ భాస్కర్ జంటగా వరుణ్ రెడ్డి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'సైక్ సిద్ధార్థ'. దగ్గుబాటి రానా స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ్యానర్లపై శ్రీ నందు, శ్యామ్ సుందర్‌రెడ్డి తుడి నిర్మించారు. జనవరి 1న ప్రేక్షకుల ముందుకు వస్తోన్న సందర్భంగా చిత్రబృందం మీడియా సమావేశం నిర్వహించింది. నిర్మాత డి.సురేశ్‌బాబు మాట్లాడుతూ 'థియేటర్లకు ప్రేక్షకుల రాక తగ్గుతోందని తరచూ మాట్లాడుకుంటున్నారు. అయితే కొన్నిసార్లు కథ బలం ఉన్న చిన్న సినిమాలని ప్రేక్షకులు అద్భుతంగా ఆదరిస్తున్నారు. సినిమా బాగుంటే కచ్చితంగా థియేటర్లలో చూస్తున్నారు. అందరికీ అందుబాటులో ఉండేలా 'సైక్ సిద్ధార్థ' సినిమా టికెట్ ధరను రూ.99గా నిర్ణయించాం' అని చెప్పారు.

ప్రేమకథ



ఉదయ్‌భాస్కర్, నక్షత్ర జంటగా రూపొందుతున్న ప్రేమకథా చిత్రం 'సెకండ్ ఇన్నింగ్స్' తర్వలో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. జ్ఞానేశ్వరి వేదవ్యాస్ ఆకుల ఈ చిత్రంలో ప్రధాన పాత్ర పోషిస్తూ నిర్మాణసారథిగా వ్యవహరిస్తున్నారు. చిత్రం శ్రీను, అఖిల్, సోమాలి, లిరిష ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. పలు సీరియల్స్, సినిమాల్లో నటించిన ఉదయ్‌భాస్కర్‌కు మంచి పేరు తెచ్చే సినిమా అవుతుందని, అతని కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్‌గా నిలిచిపోతుందని చిత్ర దర్శకుడు గోవింద్ పొడులపు చెప్పారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామన్నారు.

నా కష్టానికి తగిన ప్రతిఫలం



- ప్రణీత్ పత్తిపాటి

'ప్రేక్షకుల స్పందనను చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. నా కష్టానికి తగిన ప్రతిఫలం లభించినట్లు అనిపించింది' అని అన్నారు దర్శకుడు ప్రణీత్ పత్తిపాటి. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పతంగ్' ఇటీవలె విడుదలైంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.'సినిమాపై పాజిటివ్ టాక్‌తోపాటు వసూళ్లు కూడా రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఓ మంచి సినిమా చూశామన్న సంతృప్తిని ప్రేక్షకులు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పతాక సన్నివేశాలను చూసినప్పుడు స్టేడియంలో మ్యాచ్‌ను వీక్షించిన అనుభూతికి లోనవుతున్నారు. నేను హైదరాబాద్‌లోనే పుట్టిపెరిగాను. మనం విదేశాల నుంచి తీసుకొచ్చిన రగ్బీలాంటి కథతో సినిమాలు తీశాం. కానీ, మన నేటివిటీ స్పోర్ట్స్ కదా..వీటి నేపథ్యంలో మనం ఎందుకు తీయలేము అని 'పతంగ్'ని ప్రారంభించాం. ఇండస్ట్రీలో సినిమా చూసిన ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు. ముఖ్యంగా ఎస్‌కేఎన్, సందీప్ కిషన్, బెల్లంకొండ సురేశ్, దిల్ రాజు ఎంతో మెచ్చుకున్నారు' అని తెలిపారు.






క్రిస్టల్‌కు అలా కలిసొచ్చింది

రణ్‌వీర్‌సింగ్ నటించిన 'దురంధర్' చిత్రం బాక్సాఫీసు దగ్గర దూసుకుపోతోంది. ఇప్పటికి రూ. వెయ్యి కోట్లు ప్రపంచవ్యాప్తంగా వసూలు చేసిన ఈ చిత్రం మరిన్ని రికార్డులు సృష్టించడం కోసం సిద్ధమవుతోంది. 'దురంధర్' చిత్రంలో కథ, కథనాలతో పాటు 'శరరత్..' పాట కూడా జనానికి మంచి కిక్ ఇస్తోంది. ఈ పాటలో ఆయేషా ఖాన్‌తో కలసి క్రిస్టల్ డిసౌజా చేసిన నృత్యం బాగా పాపులర్ అయింది. ఇప్పుడు ఎక్కడ విన్నా ఈ పాట గురించే చర్చ. 'శరరత్' పాటకు విజయ్ గంగూలీ నృత్య దర్శకత్వం వహించారు. ఆయన ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'శరరత్' పాటలో మొదట తమన్నాను అనుకున్నాను. దర్శకుడు ఆదిత్య ధర్‌కు చెబితే ఆయన ఎందుకో వద్దన్నారు. అందుకే క్రిస్టల్ డిసౌజాని తీసుకున్నాం' అని చెప్పారు. ఈ ఇంటర్వ్యూ వైరల్ అయింది. తాజాగా క్రిస్టల్ డిసౌజా ఈ విషయం గురించి పెదవి విప్పారు. 'శరరత్.. పాటకు ఆర్టిస్టుల ఎంపికలో తెర వెనుక ఏం జరిగిందో నిజంగా నాకు తెలీదు. నేను మాత్రం ఆయేషా ఖాన్‌తో కలసి డాన్స్ చేసినందుకు చాలా ఆనందించాను. ఒకవేళ నాకు బదులు తమన్నా ఈ పాట చేసి ఉంటే దానికి మరింత అందం వచ్చేది' అని అన్నారు.

పలు భాషల్లో యానిమేషన్ చిత్రం 'కికి అండ్ కోకో'



భారతీయ యానిమేషన్ చిత్రాలకు ఆదరణ లభిస్తున్న ప్రస్తుత తరుణంలో పిల్లలను ఆకట్టుకునే కథాంశంతో రూపుదిద్దుకున్న యానిమేషన్ చిత్రం 'కికి అండ్ కోకో'. పి.నారాయణన్ దర్శకత్వంలో ధరణి ఈ యానిమేషన్ చిత్రాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రాన్ని భారతీయ భాషల్లో విడుదల చేయనున్నారు. అలాగే ప్రపంచ వ్యాప్తంగా కూడా పలు భాషల్లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బాలనటి శ్రీనిక మాట్లాడుతూ 'ఇందులో నేను కోకో పాత్రలో నటించాను, చిత్రంలో నాకు కికి మంచి ఫ్రెండ్' అని చెప్పింది. క్రియేటివ్ డైరెక్టర్ గోకుల్‌రాజ్ భాస్కర్ మాట్లాడుతూ 'నేను మలయాళ యానిమేషన్ ఇండస్ట్రీలో 20 ఏళ్లుగా ఉంటున్నా. యానిమేషన్ చిత్రాల్లో ఫాంటసీ ఎక్కువగా ఉంటుంది. అయితే 'కికి అండ్ కోకో' సినిమాలో రియాలిటీని పిల్లలకు చూపిస్తున్నాం' అని చెప్పారు. ఈ చిత్రంలో షేరింగ్, కేరింగ్ అనేది పిల్లలు తెలుసుకుంటారని దర్శకుడు నారాయణన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీయీవో మీనా చాబ్రియా, నిర్మాత ధరణి కూడా పాల్గొన్నారు.



ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ పిచ్చేశ్వరరావు భార్య వెంకటదుర్గకు చెక్కు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

0 ప్రీమియం కోటి పరిహారం..!

- హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి పరిహారం అందజేత
- 'ఎస్‌జీఎస్‌పీ'తో మృతుడి కుటుంబానికి ఆర్థిక భరోసా
- ఉద్యోగుల కోసం ప్రభుత్వం ప్రత్యేక బీమా పథకం

అమరావతి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)తో కలిసి కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన 'స్టేట్ గవర్నమెంట్ శాలరీ ప్యాకేజీ' (ఎస్‌జీఎస్‌పీ) పథకం.. ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన ఓ హెడ్ కానిస్టేబల్ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించింది. ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్ పిచ్చేశ్వరరావు ఈ ఏడాది జూలైలో ప్రమాదవశాత్తు మృతిచెందగా.. ఆయన కుటుంబానికి మొట్టమొదటగా రూ.కోటి బీమా పరిహారం అందింది. హెడ్ కానిస్టేబుల్ భార్య వెంకటదుర్గకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సచివాలయంలో రూ.కోటి చెక్కును అందజేశారు. ఎస్‌బీఐలో శాలరీ అకౌంట్లు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు బీమా కల్పించేందుకు ప్రభుత్వం 'స్టేట్ గవర్నమెంట్ శాలరీ ప్యాకేజీ' (ఎస్‌జీఎస్‌పీ) పథకాన్ని అమలుచేసేందుకు ఈ ఏడాది ఆ బ్యాంకుతో ఒప్పందం చేసుకుంది. ఎస్‌బీఐలో శాలరీ అకౌంట్లు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ఈ పథకం వర్తిస్తుంది. ఇందుకోసం ఉద్యోగులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ పథకం ప్రవేశపెట్టిన తర్వాత విధి నిర్వహణలో మృతిచెందిన పిచ్చేశ్వరరావుకు ముందుగా ఈ పరిహారం లభించింది. చెక్కు అందజేత సందర్భంగా ఆ కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని సీఎం భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా, కమిషనర్ సీహెచ్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, ఎక్సైజ్ ఉద్యోగ సంఘాల నేతలు బి.నర్సింహులు, కామేశ్వరరావు, ప్రభాకర్‌రావు, వెంకట రమణ ఉన్నారు.



విశాఖ పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్‌గా రోష్ని

తొలిసారిగా మహిళా ఐఏఎస్ నియామకం

విశాఖపట్నం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్‌పర్సన్‌గా రోష్ని అపరంజి కోరాటి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో నియమితులైన తొలి మహిళా ఐఏఎస్ ఆమె. అసోం-మేఘాలయ క్యాడర్‌కు చెందిన రోష్ని స్వస్థలం విశాఖపట్నమే. తండ్రి విశాఖపట్నం పోర్టు హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయునిగా పనిచేశారు. తండ్రి పనిచేసిన సంస్థలోనే డిప్యూటీ చైర్‌పర్సన్ హోదాలో ఆమె బాధ్యతలు చేపట్టడంపై పోర్టు ఉద్యోగులంతా హర్షిస్తున్నారు. 1984 ఏప్రిల్ 3న జన్మించిన రోష్ని ఏయూలో జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసి గోల్డ్‌మెడల్ సాధించారు. అనంతరం సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. అసోంలోని జోర్హాట్ జిల్లా అదనపు ఉప కమిషనర్‌గా, తర్వాత అదే జిల్లాకు కలెక్టర్‌గా సేవలందించారు. ప్రజాపరిపాలనలో విశిష్ట సేవలకుగాను 2018లో ప్రధాని అవార్డు అందుకున్నారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు తెలంగాణ యువతుల దుర్మరణం

- మృతుల స్వస్థలం మహబూబాబాద్ జిల్లా
- విహారయాత్రకు వెళ్తుండగా లోయలోకి కారు
- మరో ఇద్దరమ్మాయిలకు తీవ్ర గాయాలు



భావన



మేఘన

గార్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన ఇద్దరు తెలంగాణ యువతులు అక్కడ రోడ్డు ప్రమాదంలో దుర్మరణంపాలయ్యారు. మృతులు మహబూబాబాద్ జిల్లా గార్ల మండలానికి చెందిన పుల్లకండం మేఘన (25), కడియాల భావన (24). భారత కాలమానం ప్రకారం.. ఆదివారం విహారయాత్రకు వెళుతుండగా కాలిఫోర్నియాలో వారు ప్రయాణిస్తున్న కారు లోయలోపడింది. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన మరో ఇద్దరు విద్యార్థినులు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతుల బంధువుల వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రానికి చెందిన మీసేవ నిర్వాహకుడు పుల్లకండం శిరీష-నాగేశ్వర్‌రావు దంపతుల కుమార్తె మేఘన, ఇదే మండలం ముల్కనూరుకు చెందిన ఉపసర్పంచ్ కడియాల రేణుక-కోటేశ్వర్‌రావు దంపతుల చిన్నకుమార్తె భావన స్నేహితులు. కలిసి పదో తరగతి వరకు మహబూబాబాద్‌లో చదువుకున్నారు. ఆ తర్వాత హైదరాబాద్ బాచుపల్లి నారాయణ కాలేజీలో ఇంటర్ పూర్తి చేశారు. ఆపై ఇరువురు హైదరాబాద్‌లోని వేర్వేరు కాలేజీల్లో ఇంజనీరింగ్ పూర్తిచేశారు. రెండున్నరేళ్ల క్రితం అమెరికా వెళ్లారు. అక్కడ ఒహియో స్టేట్‌లోని డేటన్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తిచేశారు. అమెరికాలో ఒకేచోట ఉంటూ ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. భావన, మేఘన ఆదివారం హైదరాబాద్‌కు చెందిన మరో ఇద్దరు విద్యార్థినులతో కలిసి కారులో విహార యాత్రకు బయలుదేరి ప్రమాదం బారినపడ్డారు. మేఘన, భావనల మృతదేహాలను స్వస్థలాలకు పంపాలంటూ వారి తరఫువారు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (టీఏఎన్ఏ) సాయాన్ని కోరుతున్నారు. మృతదేహాలను అమెరికా నుంచి స్వదేశానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు, విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎంపీ బలరాం నాయక్ పేర్కొన్నారు.

సచివాలయ సంఘ ఎన్నికల్లో.. రామకృష్ణ విజయదుందుభి

- అధ్యక్షుడిగా భారీ మెజార్టీతో గెలుపు
- 9 పదవుల్లో ఆయన ప్యానెల్‌కే 7



సోమవారం సచివాలయంలో అప్సా ఎన్నికల ఓట్ల లెక్కింపు సందడి



రామకృష్ణ

అమరావతి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయ సంఘం (అప్సా) అధ్యక్షుడిగా గొలిమి రామకృష్ణ విజయదుందుభి మోగించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి కోట్ల రాజేశ్‌పై 296 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అమరావతి సచివాలయంలో సోమవారం ఉత్కంఠభరితంగా సాగిన ఎన్నికల్లో ఆయన ప్యానెల్‌కు ఉద్యోగుల నుంచి విశేష మద్దతు లభించింది. ఓట్ల లెక్కింపు అర్ధరాత్రి 1.30 వరకు కొనసాగింది. ఫలితాలు వెల్లడికాగానే సచివాలయ ప్రాంగణంలో ఉద్యోగులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అప్సా ఎన్నికల్లో మొత్తం 1,159 మంది ఉద్యోగులు ఓటర్లుగా ఉండగా.. 1,105 ఓట్లు పోలయ్యాయి. కార్యవర్గంలో మొత్తం 9 పదవులకు పోటీ జరగగా, ఏడింట రామకృష్ణ ప్యానెల్ విజయదుందుభి మోగించింది. అధ్యక్ష స్థానానికి రామకృష్ణ ప్యానెల్ నుంచి రామకృష్ణ, కోట్ల రాజేశ్ ప్యానెల్ నుంచి రాజేశ్ తలపడ్డారు. ట్రెజరర్‌గా రామకృష్ణ ప్యానెల్‌కు చెందిన భాగ్యలక్ష్మి తన ప్రత్యర్థిపై జగదీశ్‌కుమార్‌పై గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా పవన్‌కుమార్ తన ప్రత్యర్థి గోపీ కృష్ణపై 338 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఉపాధ్యక్ష(మహిళ) స్థానం లో లక్ష్మణకుమారి తన ప్రత్యర్థి కవితపై 220 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. జాయింట్ సెక్రటరీ(స్పోర్ట్స్)గా మధుబాబు తన ప్రత్యర్థి సత్యనారాయణపై 333 ఓట్ల మెజారిటీతో గెలిచారు. జాయింట్ సెక్రటరీ(ఆర్గనైజేషన్)గా రాజేంద్ర ప్రకాశ్ తన ప్రత్యర్థిపై నాగూర్ మీరావలిపై 110 ఓట్ల ఆధిక్యంతో.. ఇంకో జాయింట్ సెక్రటరీ (మహిళ)గా సునీత తన ప్రత్యర్థి సాయిలీలపై 53 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొత్తం ఫలితాల్లో రామకృష్ణ ప్యానెల్ 7 పదవుల్లో విజయం సాధించింది. ప్రధాన కార్యదర్శిగా రాజేశ్ ప్యానెల్‌కు చెందిన నాతా ప్రసాద్ ఆరు ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. అదనపు కార్యదర్శిగా ఇదే ప్యానెల్‌కు చెందిన లింగారెడ్డి 183 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు.



సరికొత్త సలహాదారులు
శ్రీధర్, మంతెన, చుండూరిలకు పదవులు

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సలహాదారులను నియమించుకుంది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మాస్ కమ్యూనికేషన్స్)గా ప్రముఖ కార్టూనిస్టు పోచంపల్లి శ్రీధరరావు (కార్టూనిస్ట్ శ్రీధర్)ను నియమిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. శ్రీధర్‌తోపాటు యోగా, నేచురోపతి సలహాదారుగా ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు మంతెన సత్యనారాయణరాజును నియమించారు. చుండూరి సీతారామాంజనేయప్రసాద్‌ను రాష్ట్ర ప్రభుత్వ దేవదాయ సలహాదారుగా నియమించారు. కాగా, కీలకమైన ఈ జీవోల విడుదలలో జీఏడీ అధికారులు గందరగోళం చేశారు. తొలుత చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్‌ను మాస్ కమ్యూనికేషన్స్ సలహాదారుగా, పోచంపల్లి శ్రీధర్‌రావును దేవదాయ సలహాదారుగా పేర్కొంటూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ తర్వాత కొద్దిసేపటికే పొరపాటును గ్రహించి మార్పులతో ఉత్తర్వులు ఇచ్చారు.

సంక్రాంతికి టోల్ ఫ్రీ.. ఫ్రీ.. ఫ్రీ?

పండక్కి ఊర్లకెళ్లే వాహనాలకు టోల్ చార్జీలను భరించే యోచనలో తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లేవారికి తీపికబురు చెప్పేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. జాతీయ రహదారులపై వారి వాహనాల టోల్‌చార్జీలను భరించే దిశగా ప్రణాళికలు రచిస్తోంది. తద్వారా టోల్‌ప్లాజాల దగ్గర ట్రాఫిక్‌జామ్‌ల నుంచి ప్రయాణికులకు ఉపశమనం కల్పించాలని నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. సర్కారు నిర్ణయానికి కేంద్రం అనుమతిస్తే.. ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్, విజయవాడవైపు వెళ్లే ప్రయాణికులకు భారీగా ఊరట కలగనుంది. ఏటా సంక్రాంతి పండుగ సమయంలో రాష్ట్రంలో ఉన్న ఇతర హైవేలన్నింటితో పోలిస్తే.. హైదరాబాద్-విజయవాడ (ఎన్‌హెచ్-65) హైవేపై తెలంగాణ రాష్ట్ర పరిధిలో ఉన్న పంతంగి, కొర్లపాడు టోల్‌ప్లాజాల దగ్గర ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటోంది. ఈ నేపథ్యంలోనే.. పండగ వేళ హైవేలపై ట్రాఫిక్ జామ్‌లకు స్వస్తి పలికి, ప్రయాణికులు వేగంగా గమ్యం చేరేందుకు ప్రభుత్వం ఈ యోచన చేస్తున్నట్టు సమాచారం. అయితే, దీనికి కేంద్ర ప్రభుత్వం అనుమతి అవసరం. కాబట్టి.. సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల టోల్‌చార్జీలను తామే చెల్లిస్తామని., అందుకు అనుమతినివ్వాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి లేఖ రాయనున్నట్టు తెలిసింది.



కొండగట్టు అంజన్నకు 35.19 కోట్లు

దీక్ష విరమణ మండప నిర్మాణానికి టీటీడీ సహకారం

3న భూమి పూజ చేయనున్న పవన్ కల్యాణ్

హైదరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద నూతన భవన నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులు మంజూరు చేసింది. 96 గదుల నిర్మాణానికి రూ. 35.19 కోట్లు మంజూరు చేస్తూ టీటీడీ బోర్డు ఇటీవల ఆమోదం తెలిపింది. ఈ నిధులతో 2 వేల మంది భక్తులకు సరిపడ దీక్ష విరమణ మండపాన్ని నిర్మించనున్నారు. జనవరి 3న భూమి పూజ నిర్వహించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. తెలంగాణ మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. స్వతహాగా కొండగట్టు ఆంజన్న భక్తుడైన పవన్ కల్యాణ్.. గతంలో ఆలయాన్ని దర్శించుకున్న సమయంలో ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు టీటీడీ నిధులతో దీక్ష విరమణ మండప నిర్మాణం చేపడుతున్నారు.

బాగున్నారా..? ఆరోగ్యం ఎలా ఉంది?

కేసీఆర్‌ను ఆత్మీయంగా పలకరించిన టీ-సీఎం రేవంత్

హైదరాబాద్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ శాసనసభలో అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. సోమవారం నుంచి శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. సభ కొలువుదీరడానికి కొద్ది నిమిషాల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. విపక్ష నేత కేసీఆర్‌ను ఆప్యాయంగా పలకరించారు. ఉదయం 10:29 గంటలకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పక్షనేత కేసీఆర్ సభలోకి వచ్చారు. ఆ తర్వాత ఒక్క నిమిషానికే సీఎం రేవంత్‌రెడ్డి సభలోకి ప్రవేశించారు. లోపలికి రాగానే ఆయన తన స్థానంలో నుంచి కేసీఆర్‌కు నమస్కరించారు. ఆయన స్పందించకపోవడంతో రేవంత్‌రెడ్డి లేచి కేసీఆర్ దగ్గరకు వెళ్లారు. నమస్కారం చేసి.. 'ఆరోగ్యం బాగా ఉందా? ఎలా ఉన్నారు?' అని పలకరించారు. ఆ తర్వాత కరచాలనం చేసి, నమస్కరించారు.



టీ - అసెంబ్లీలో అరుదైన దృశ్యం



బుడితి రాజశేఖర్‌కు ఇంకోసారి మరో ఏడాది సర్వీసు

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ సర్వీసును మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాజశేఖర్ గత ఏడాది డిసెంబరులో పదవీ విరమణ చేశారు. ఆయనకు ప్రభుత్వం ఏడాది కాలం సర్వీసును పొడిగించింది. ఈ నెలాఖరులో రాజశేఖర్ పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ఆయన సేవలను మరో ఏడాది పొడిగించాలని చంద్రబాబు నిర్ణయించారు. మంగళ, బుధవారాల్లో అధికారిక ఉత్తర్వు విడుదల కానుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

ఇంట్లో అద్దెకు దిగి.. యజమానురాలినే చంపి

- మృతదేహాన్ని కారు డిక్కీలో కుక్కి ఏపీకి తరలింపు
- 'కోనసీమ' గోదావరిలో పడేసిన వైనం.. ముగ్గురికి రిమాండ్
- మిస్సింగ్ కేసును ఛేదించిన నాచారం పోలీసులు



నిందితులు.. నక్కంటి యువరాజ్, నూకల దుర్గారావు, మడ్డు అంజిబాబు

తార్నాక, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బంగారు నగల కోసం ఓ వృద్ధురాలిని గొంతునులిమి హత్య చేసిన యువకుడు.. మృతదేహాన్ని మరో ఇద్దరి సాయంతో ఏపీకి తరలించి గోదావరి నదిలో పడేశారు. చివరికి పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యారు. నాచారం పోలీసుల కథనం ప్రకారం.. మల్లాపూర్‌లోని బాబానగర్ ప్రాంతానికి చెందిన సూరెడ్డి సుజాత(65) ఈ నెల 18న ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. కేసు నమోదు చేసిన పోలీసులు వృద్ధురాలిని హత్య చేసింది.. ఆమె ఇంట్లో అద్దెకున్న ఏపీకి చెందిన యువకుడే అని నిర్ధారణకు వచ్చి ఆ కోణంలో దర్యాప్తు చేశారు. ఏపీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, పెరవలి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మడ్డు అంజి బాబు(31) రెండు నెలల క్రితం మల్లాపూర్‌లోని బాబానగర్ ప్రాంతానికి చెందిన సూరెడ్డి సుజాత ఇంట్లో అద్దెకు దిగాడు. డ్రైవర్‌గా పనిచేస్తున్న అంజి బాబు ఈనెల 18న వృద్ధురాలు సుజాత ఇంట్లోకి వెళ్లి ఆమెను గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను కాజేశాడు. మృతదేహాన్ని మాయం చేసేందుకు తన బామ్మర్ది, కోనసీమ జిల్లా పెరవలి మండలం, ఖండవల్లి గ్రామానికి చెందిన నక్కంటి యువరాజు (18), స్నేహితుడు నూకల దుర్గారావు (35) (మన్నానగర్ కాలనీ, భీమవరం, అమలాపురం మండలం) సాయంతో మృతదేహాన్ని కారు డిక్కీలో కుక్కి ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ జిల్లాకు తీసుకొచ్చి గోదావరి నదిలో పడేశారు. పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా కేసు ఛేదించారు. కోనసీమ జిల్లా, పొదులాడ జంక్షన్ వద్ద నిందితులను అరెస్టు చేశారు.

ఫొటోలు మార్చి.. నకిలీ పేర్లతో ఏమార్చి..

- పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ ఖాతా..అన్నీ ఫేకే
- పోలీసు విచారణలో వెలుగులోకి 'ఐ బొమ్మ' రవి లీలలు
- ముగిసిన పోలీస్ కస్టడీ.. తిరిగి జైలుకు తరలింపు



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'ఐ బొమ్మ' రవి కేసులో ట్విస్టల మీద ట్విస్టులు వెలుగులోకి వస్తున్నాయి. 12 రోజులు కస్టడీకి తీసుకున్న పోలీసులు రవిని విచారించిన క్రమంలో అనేక విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మొన్నటి వరకు ప్రహ్లాద్ అనే స్నేహితుడి ధ్రువపత్రాలతో పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ పొందినట్లు చెప్పిన రవి.. తీరా ప్రహ్లాద్‌ను విచారణకు పిలిచినప్పుడు మాత్రం మౌనంగా ఉన్నారు. ప్రహ్లాద్‌ను రవి గురించి అడగగా.. అతను ఎవరో కూడా తనకు తెలియదని చెప్పినట్లు సమాచారం. తన ధ్రువ పత్రాలతో డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు రవి ఎలా తీసుకున్నారో తెలియదని చెప్పినట్లు తెలిసింది. ప్రహ్లాద్ జిరాక్స్ పత్రాలు తస్కరించిన రవి..తానే ప్రహ్లాద్‌లా ఫొటోను మాత్రమే మార్చి మీడియేటర్‌ల సహకారంతో పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ పొందినట్లు పోలీసులు గుర్తించినట్లుగా తెలిసింది.

బ్యాంకు ఖాతాలూ అంతే..

రవి వినియోగించిన బ్యాంకు ఖాతాను పరిశీలించగా.. అంజయ్య అనే పేరుతో అది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే, రవి ఎవరో అంజయ్యకు తెలియదని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. అతని ధ్రువ పత్రాలు కూడా రవి ఏదో మార్గంలో తస్కరించి ఫొటోను మార్చి బ్యాంకు అధికారులను ఏమార్చి బ్యాంకు ఖాతా తీసుకుని ఉంటారని పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ప్రసాద్ అనే వ్యక్తి పేరు, ధ్రువ పత్రాలతో మరికొన్ని మోసాలకు పాల్పడినట్లు సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. సోమవారం కస్టడీ ముగియడంతో రవికి మరోసారి ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు.

రేపు, ఎల్లుండి మరింత కిక్కు

అమరావతి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబరు 31, జనవరి 1వ తేదీల్లో మద్యం అమ్మకాల పనివేళలను ఎక్సైజ్ శాఖ పెంచింది. మద్యం షాపులకు అర్ధరాత్రి 12 గంటల వరకు అమ్మకాలకు అనుమతిచ్చింది. బార్లు, ఈవెంట్లు, సి1, టిడి1 లైసెన్సీలకు రాత్రి ఒంటిగంట వరకు అమ్మకాలకు అవకాశం కల్పించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్రంలోకి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, నాటుసారా రాకుండా అధికారిక పనివేళలు పెంచినట్లు తెలిపింది.



పూల బాట

విశాఖ నగరంలోని పోర్టు రోడ్డులోని ఈ డివైడర్ రంగురంగుల తివాచీని తలపిస్తోంది. సాధారణంగా పోర్టు రోడ్డు భారీ వాహనాల రాకపోకలతో డివైడర్లు దుమ్ము, ధూళితో నిండిఉంటాయి. కానీ జ్ఞానాపురం కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వెళ్లే మార్గంలోని డివైడర్ కాగితం పూలతో సరికొత్త అందాలను సంతరించుకుంది. కాలుష్య నియంత్రణలో భాగంగా విశాఖ పోర్టు ట్రస్ట్(వీపీటీ) ఈ డివైడర్‌పై కొన్నాళ్ల కిందట కాగితం పూల (బోగెన్‌విల్లేయా) మొక్కలను నాటించింది. రంగురంగుల పూలచెట్లన్నీ ఇప్పుడు విరబూయడంతో ప్రయాణికులకు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



అన్నమయ్య.. అటూ ఇటూ

మూడు ముక్కలైన జిల్లా.. ఇక మదనపల్లె కేంద్రం


కొత్తగా మార్కాపురం, పోలవరం

కడప, తిరుపతి, నెల్లూరు జిల్లాల పునర్వ్యవస్థీకరణ

మొత్తం జిల్లాలు 28

అమరావతి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇక రాష్ట్రంలో మొత్తం 28 జిల్లాలు ఉంటాయి. ప్రస్తుతం ఉన్న 26 జిల్లాలతో పాటు కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేస్తారు. మదనపల్లె పేరుతో జిల్లా ఉండదు. మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఉంటుంది. ప్రస్తుతమున్న అన్నమయ్య జిల్లా మూడు ముక్కలైంది. జిల్లాలోని రాజంపేటను కడప జిల్లాలో, రైల్వే కోడూరును తిరుపతి జిల్లాలో కలుపుతారు. మిగిలిన రాయచోటిని అన్నమయ్య జిల్లాలో కొనసాగిస్తారు. కొత్త జిల్లాల ఏర్పాటుపై గతనెల 27న ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్లు ఇచ్చిన సంగతి తెలిసిందే. కొత్తగా మార్కాపురం, మదనపల్లె, పోలవరం జిల్లాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. మార్కాపురం, పోలవరం జిల్లాల ఏర్పాటులో ఎలాంటి మార్పులు లేవు. కానీ మారిన పరిస్థితుల నేపథ్యంలో మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లాను పూర్తిగా పునర్వ్యవస్థీకరించనుంది. రెవెన్యూ శాఖ కొత్తగా 2 జిల్లాలు, ఐదు రెవెన్యూ డివిజన్లు, రెండు మండలాలు, ఇంకా కొన్ని జిల్లాల పునర్వ్యవస్థీకరణపై తుది నోటిఫికేషన్లు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

తొలి నోటిఫికేషన్‌లో 5రెవెన్యూ డివిజన్లు అద్దంకి (ప్రకాశం), మడకశిర (సత్యసాయి), బనగానపల్లె (నంద్యాల), పీలేరు (మదనపల్లె), నక్కపల్లి (అనకాపల్లి) ప్రతిపాదించారు. అయితే నక్కపల్లికి బదులు అడ్డరోడ్డు జంక్షన్‌ను డివిజన్‌గా ప్రతిపాదించారు.



రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు

అన్నమయ్య జిల్లా..

అన్నమయ్య జిల్లా పేరు కొనసాగుతుంది. కానీ స్వరూపమే మారనుంది. ప్రస్తుతం రాయచోటి కేంద్రంగా ఉన్న అన్నమయ్య జిల్లా ఇక మదనపల్లె కేంద్రంగా ఉంటుంది. కానీ అన్నమయ్య జిల్లాలోని రాజంపేటను కడప జిల్లాలో, రైల్వే కోడూరును తిరుపతి జిల్లాలో విలీనం చేస్తారు. అన్నమయ్యలో రాయచోటి కొనసాగుతుంది.



- పలమనేరు డివిజన్‌లో ఉన్న చౌడేపల్లి, పుంగనూరు మండలాలను మదనపల్లె డివిజన్‌లో విలీనం చేస్తారు.
- పీలేరు, గుర్రంకొండ, కలకడ, కంభంవారిపల్లె మండలాలను రాయచోటి డివిజన్ నుంచి తీసి కొత్తగా ఏర్పాటు చేసే పీలేరు డివిజన్‌లో కలుపుతారు.



తిరుపతిలోకి..

- చిట్టమూరు, వాకాడ మండలాలను తిరుపతి జిల్లాలోని సూళ్లూరుపేట డివిజన్‌లోనే కొనసాగిస్తారు.
- రాజంపేట రెవెన్యూ డివిజన్‌లోని కోడూరు, పెంగలూరు, చిట్వేలు, పుల్లంపేట, ఓబుళవారిపల్లె మండలాలను తిరుపతి జిల్లాలో విలీనం చేసి తిరుపతి రెవెన్యూడివిజన్‌లో కలుపుతారు.

నెల్లూరు జిల్లాలోకి..

- తిరుపతి జిల్లాలో ఉన్న గూడూరు డివిజన్‌లోని గూడూరు, చిల్లకూరు, కోట మండలాలను నెల్లూరు జిల్లాలో కలుపుతారు.
- ప్రాథమిక నోటిఫికేషన్ ప్రకారం నెల్లూరు జిల్లాలోని కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలిపారు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆ మూడు మండలాలను తిరిగి నెల్లూరు జిల్లాలోనే కొనసాగిస్తారు. కలువాయిని ఆత్మకూరులో, రాపూరు, సైదాపురం మండలాలను నెల్లూరు డివిజన్‌లో కొనసాగిస్తారు.



- కందుకూరు డివిజన్‌లోని వరికుంటపాడు, కొండాపురం మండలాలను నెల్లూరు జిల్లా కావలి డివిజన్‌లో విలీనం చేస్తారు.



కడపలోకి..

- రాజంపేట డివిజన్‌తో పాటు నందలూరు, వీరబల్లె, టి. సుండుపల్లె మండలాలను కడప జిల్లాలో విలీనం చేస్తారు.
- సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలు కడపలోనే కొనసాగిస్తారు.

ప్రకాశంలోకి..

- కనిగిరి డివిజన్‌లో ఉన్న దర్శి, దొనకొండ, కురిచేడు మండలాలు అద్దంకి డివిజన్ లో ఉంటాయి. అద్దంకిని ప్రకాశంలోకి తీసుకొచ్చి కొత్తగా రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తారు.

రెండుగా ఆదోని మండలం

కర్నూలు జిల్లాలోని ఆదోని మండలాన్ని విభజించి పెద్ద హరివనం అనే కొత్త మండలాన్ని ఏర్పాటు చేస్తూ తొలి నోటిఫికేషన్ ఇచ్చారు. స్థానిక ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఇప్పుడు దీన్ని మార్చారు. పెద్ద హరివనం మండలం ఉండదు. దాని స్థానంలో ఆదోని-2 మండలం ఉంటుంది.

జిల్లాల పునర్విభజనలో రాజకీయ కోణం లేదు

- ప్రజల ఆకాంక్షలు, పరిపాలన సౌలభ్యం కోసమే మార్పులు
- సుపరిపాలన ఇస్తూ.. ప్రణాళిక బద్ధంగా ముందుకు: మంత్రులు

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజన కేవలం పరిపాలన సౌలభ్యం కోసమేనని, ఇందులో రాజకీయ కోణం లేదని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. ప్రజల స్పందన, అభ్యంతరాలు, విజ్ఞప్తులు, ఆకాంక్షల మేరకు జిల్లాల పునర్విభజన చేశామన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్‌యాదవ్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'గత ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఆలోచన చేయకుండా, పరిపాలన సౌలభ్యం లేకుండా కుట్రలతో జిల్లాల పునర్విభజన చేసింది. చాలా జిల్లాలు అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసింది. గూడూరు నియోజకవర్గంలోని మూడు మండలాలను నెల్లూరు జిల్లాకు తెచ్చాం. నెల్లూరుకు దగ్గరగా ఉంటామని ఆ మండలాల ప్రజలు కోరారు. మిగతా రెండు మండలాలను తిరుపతిలో పెట్టడం వల్ల దుగరాజపట్నం పోర్టు తిరుపతిలోకి, కృష్ణపట్నం పోర్టు నెల్లూరు జిల్లాలో ఉంటుంది. వాసవీ మాత జన్మస్థలం పెనుగొండ పేరు మార్పుకోసం ఎప్పటి నుంచో విజ్ఞప్తులున్నందున వాసవీ పెనుగొండగా నామకరణం చేశాం. జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మార్చడంపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి చాలా బాధపడుతున్నారు. కేబినెట్ తర్వాత ఆయన్ని పిలిచి సీఎం మాట్లాడారు. రాయచోటిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం. గత పాలకులు రాయచోటిని జిల్లా కేంద్రం, పుంగనూరును చిత్తూరులో పెట్టి పరిపాలన సౌలభ్యం లేకుండా అస్తవ్యస్తంగా చేశారు. ఆదోని మండలం అతి పెద్దదైనందున 1, 2గా మార్పు చేశాం. రంపచోడవరం కేంద్రంగా పోలవరం పేరుతో కొత్త జిల్లా ఏర్పాటు చేస్తున్నాం. గిరిజనులకు పరిపాలన సౌలభ్యం కోసం ముంపు మండలాలతో ఆ జిల్లాను ఏర్పాటు చేస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించే కూటమి ప్రభుత్వం సుపరిపాలన ఇస్తూ, ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తోంది' అన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ లోతుగా అధ్యయనంతో జిల్లాల పునర్విభజనను పారదర్శకంగా చేశామన్నారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ 'ఒంగోలుకు 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న కందుకూరును 110 కిలోమీటర్ల దూరంలోని నెల్లూరులో కలిపారు. నెల్లూరుకు 35 కిలోమీటర్ల దూరంలోని గూడూరును 90 కిలోమీటర్ల దూరంలోని తిరుపతిలో కలిపారు. ఇటువంటివి సరిచేస్తూ.. పరిపాలన సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లాల పునర్విభజన చేశాం' అన్నారు.

నేటి నుంచి సీఎం చంద్రబాబు విదేశీ పర్యటన

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశీపర్యటనకు వెళుతున్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి బయలుదేరి హైదరాబాద్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి కుటుంబసమేతంగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుని విదేశీ పర్యటనకు వెళతారు. తిరిగి జనవరి 4న చంద్రబాబు అమరావతి చేరుకుంటారు. ఇక, దుర్గగుడికి విద్యుత్తు నిలుపుదలపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ఇలాంటి వ్యవహారాల్లో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఉండేలా చూసుకోవాలని, కీలకమైన అంశాల విషయంలో మంత్రులు, ఉన్నతాధికారుల స్థాయిలో సంప్రదించి నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కాగా, ఫిడే వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన ప్రముఖ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపిని సీఎం చంద్రబాబు అభినందించారు. చెస్‌లో హంపి సాధిస్తున్న విజయాలు కోట్లాది మంది భారతీయులకు స్ఫూర్తిదాయకమన్నారు. మంత్రి లోకేశ్ హంపికి అభినందనలు తెలిపారు.



చంద్రబాబుతో సమావేశమైన మంత్రులు అనగాని, మండిపల్లి, అచ్చెన్న

28 జిల్లాలు ఖరారు



(మొదటిపేజీ తరువాయి)

ఎలాంటి మార్పులు లేవు. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోనూ మార్పులు చేశారు. మొత్తంగా కొత్తగా 2 జిల్లాలు, ఐదు రెవెన్యూ డివిజన్లు, రెండు మండలాలు, ఇంకొన్ని జిల్లాల్లో మార్పుచేర్పులను మంత్రివర్గం ఆమోదించింది. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరిగింది. ఇందులో జిల్లాల పునర్విభజనపై సుదీర్ఘంగా చర్చించినట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. మంత్రివర్గ నిర్ణయాలను సహచర మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్‌తో కలిసి మీడియాకు వివరించారు. 'రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు నిర్ణయించాం. మార్కాపురం, కనిగిరి, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాలతో కొత్తగా మార్కాపురం జిల్లా ఏర్పాటవుతుంది. కొత్తగా మదనపల్లె జిల్లా ఏర్పాటుపైనా క్యాబినెట్ చర్చించింది. రాయచోటి నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా చేసే అవకాశం లేనందున, దానిని అన్నమయ్య జిల్లాలోనే ఉంచుతూ, మదనపల్లెను జిల్లా కేంద్రంగా మార్చాలని నిర్ణయించింది. రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని తిరుపతిలోకి, రాజంపేటను కడపలోకి మార్చడానికి ఆమోదం తెలిపింది. గూడూరులోని గూడూరు, కోట, చిలుకూరు మండలాలు నెల్లూరు జిల్లాలోకి వస్తాయి. చిట్టమూరు, వాకాడ మండలాలు సూళ్లూరుపేట డివిజన్‌లో, తిరుపతి జిల్లాలో కొనసాగుతాయి. అద్దంకి నియోజకవర్గం బాపట్ల జిల్లా నుంచి ప్రకాశం జిల్లాలోకి మారుతుంది. దర్శి నియోజకవర్గం అద్దంకి సబ్ డివిజన్‌లో ఉంటుంది. ప్రకాశంలోనే కొనసాగుతుంది' అని వివరించారు. రాష్ట్రంలో 17 జిల్లాల్లో 25 మార్పులుంటాయన్నారు. 'కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పెద్దాపురం డివిజన్‌లోకి, మండపేట రాజమండ్రి డివిజన్‌లోకి మారతాయి. మడకశిరను రెవెన్యూ డివిజన్‌గా, బనగానపల్లె, అనకాపల్లి జిల్లాలోని అడ్డరోడ్డు జంక్షన్‌ను సబ్ డివిజన్లుగా చేయనున్నాం. ఆదోని మండలం పెద్దది కావడంతో ఆదోని-1, ఆదోని-2గా విభజిస్తారు' అని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లాలోని పెనుగొండ.. వాసవీ మాత జన్మస్థలమైనందున దానికి వాసవీ పెనుగొండగా పేరు మార్చినట్లు తెలిపారు. పోలవరం గ్రామాన్ని అభివృద్ధి చేసి, భవిష్యత్‌లో డివిజన్‌గా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. పోలవరం, మార్కాపురం జిల్లాలతో కలిపి జిల్లాల సంఖ్య 28కు చేరుతుందని.. ప్రస్తుతం జరిగిన మార్పులతో బుధవారం (31న) తుది నోటిఫికేషన్ ఇస్తామని.. కొత్త జిల్లాలు, మార్పులన్నీ జనవరి 1 నుంచే అమల్లోకి వస్తాయని సత్యప్రసాద్ వెల్లడించారు.

మార్పుల తర్వాత జిల్లాలు.. అసెంబ్లీ స్థానాలు ఇలా..

తిరుపతి జిల్లా..
తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, చంద్రగిరి, సూళ్లూరుపేట, రైల్వేకోడూరు, గూడూరు (2 మండలాలు-చిట్టమూరు, వాకాడు), వెంకటగిరి (3 మండలాలు-వెంకటగిరి,డక్కిలి,బాలాయపల్లె), నగరి (2 మండలాలు-పుత్తూరు, వడమాలపేట).

అన్నమయ్య జిల్లా...
మదనపల్లె, రాయచోటి, పుంగనూరు, తంబళ్లపల్లె, పీలేరు

కడప జిల్లా..
కడప, కమలాపురం, పులివెందుల, జమ్మలమడుగు, బద్వేలు, ప్రొద్దుటూరు, మైదుకూరు, రాజంపేట

మార్కాపురం జిల్లా..
మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి

ప్రకాశం జిల్లా.. ఒంగోలు, అద్దంకి, దర్శి, సంతనూతలపాడు, కొండపి

బాపట్ల జిల్లా.. రేపల్లె, వేమూరు, బాపట్ల, చీరాల, పరుచూరు

పోలవరం జిల్లా.. రంపచోడవరం

అల్లూరి జిల్లా.. అరకు వ్యాలీ, పాడేరు

క్యాబినెట్‌లో మంత్రి మండిపల్లి కన్నీరు

- జిల్లా కేంద్రంగా రాయచోటిని తీసేయడంపై ఆవేదన

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాయచోటిని అన్నమయ్య జిల్లా కేంద్రంగా తొలగించడంపై క్యాబినెట్ సమావేశంలోనే మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కన్నీటిపర్యంతమయ్యారు. ఇప్పటి వరకు జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటిని ఇప్పుడు మార్చడం వల్ల.. తాము జిల్లా కేంద్రవాసులమని ఇంతకాలం భావిస్తూ వచ్చిన రాయచోటి ప్రజలు సెంటిమెంట్‌గా భావిస్తారన్నారు. మంత్రి కన్నీటిపర్యంతం అవ్వడంతో సమావేశంలో స్తబ్దత ఏర్పడింది. సీఎం చంద్రబాబు జోక్యం చేసుకుని మంత్రిని ఓదార్చారు. రాయచోటిని జిల్లా కేంద్రంస్థాయిలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంగా ఎందుకు మార్పు చేయాల్సి వచ్చిందో.. మార్పు చేయకుంటే సాంకేతికతంగా తలెత్తే ఇబ్బందులు ఏమిటో మంత్రికి చంద్రబాబు వివరించారు. క్యాబినెట్ అనంతరం మండిపల్లి కన్నీళ్లతోనే బయటకు వచ్చారు. కొద్దిసేపటికే సీఎం చంద్రబాబు పేషీ నుంచి ఆయనకు ఫోన్ చేసి... సీఎంను కలవాలని సమాచారం ఇచ్చారు. దీంతో తిరిగి సీఎం పేషీకి వచ్చిన మండిపల్లి, సీఎంతో భేటీ అయ్యారు.

పార్టీ, ప్రజలు నాకు 2 కళ్లు: మండిపల్లి

సీఎంతో భేటీ అనంతరం మంత్రి మండిపల్లి మాట్లాడారు. 'నాకు పార్టీ, నియోజకవర్గ ప్రజలు రెండు కళ్లు. రాయచోటి విషయంలో బాధ పడుతున్నట్లు సీఎం కూడా చెప్పారు. అక్కడ ఉన్న 3 నియోజకవర్గాల పరిస్థితులు వేర్వేరుగా ఉన్నాయ. రైల్వేకోడూరు ప్రజలు తిరుపతిని, రాజంపేట ప్రజలు కడపను కోరుకోవడంతో రాయచోటి ఏకాకి అయింది. నవంబరు 27న వచ్చిన గెజిట్‌లో జిల్లా కేంద్రం మార్పు లేదు. మాకు స్వార్థం ఉంటే ఆరోజే మార్పు చేసే వాళ్లం.' అన్నారు.

అమరావతిలో మౌలిక వసతులకు నాబార్డు నుంచి 7,387 కోట్లు

- రాజధాని అమరావతి ప్రాంతంలో వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం నాబార్డు నుంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అసిస్టెన్స్ స్కీం కింద రూ.7,387.70 కోట్ల రుణం తీసుకునేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతి.
- అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి, డిజైన్-బిల్డ్ విధానంలో టెండరు మంజూరుకు, ఈ ప్రాజెక్టుకు రూ.137 కోట్లతో పరిపాలనా ఆమోదం, ఎల్-1 బిడ్డర్ ఎల్ అండ్ టీ కంపెనీకి కాంట్రాక్టు కేటాయించేందుకు అనుమతి.
- ప్రపంచబ్యాంకు, ఏడీబీ ఆర్థిక సహాయంతో అమరావతి క్యాపిటల్ సిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద సర్వే, ఇన్వెస్టిగేషన్, డిజైన్, కనస్ట్రక్షన్, టెస్టింగ్, ఉండవల్లి వద్ద ఫ్లడ్ పంపింగ్ స్టేషన్-2 వంటి పనులను 15 ఏళ్ల ఆపరేషన్, మెయింటెనెన్స్‌తో కాంట్రాక్టు (% టెండర్) ప్రాతిపాదికన ఎల్-1 బిడ్‌ను ఆమోదించడానికి ఏడీసీఎల్ ఛైర్మన్‌కు అధికారం.
- రాజధానిలో ల్యాండ్ పూలింగ్ స్కీంల లే ఔట్‌లలో ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో జోన్-8లోని కృష్ణాయపాలెం, వెంకటపాలెం, పెనమాక, ఉండవల్లి గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, వాటర్ సప్లయ్, సీవరేజ్, విద్యుత్ తదితర పనులకు ఎల్1 బిడ్ ఆమోదించడానికి ఏడీసీఎల్ ఛైర్మన్‌కు అనుమతి.
- మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో భూగర్భ డ్రెయినేజీ, మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణానికి రూ.1,673.51 కోట్ల కేటాయింపు
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ (ఐఐపీఎం) ఏర్పాటు కోసం ఏలూరు జిల్లా నూజివీడులోని 9.96 ఎకరాల ప్రభుత్వ భూమి 33 ఏళ్ల లీజుకు బదిలీ.
- కోనసీమ జిల్లా కాట్రేనికోనలో వేదాంత లిమిటెడ్‌కు ఆన్‌షోర్ డ్రిల్లింగ్ పనుల కోసం 9.88 ఎకరాల భూమిని లీజును మూడేళ్లకు పునరుద్ధరించడానికి ఆమోదం.
- స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు తిరుపతి జిల్లా దామినేడులో 28.37 ఎకరాల ప్రభుత్వ భూమి 'శాప్'కు ఉచితంగా బదిలీ.
- తిరుపతి జిల్లా శెట్టిపల్లి ల్యాండ్ పూలింగ్ స్కీం కింద తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అమలు చేసిన అన్ని కన్వేయెన్స్ డీడ్స్‌కు సంబంధించిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు.
- సీఆర్‌డీఏ ప్రాంతంలో వివిధ సంస్థలకు భూమి కేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం సిఫారసులు, తదుపరి చర్యలకు ఆమోదం.
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 2024 జనవరి1 నుంచి డీఏ/డీఆర్ 3.64%(33.67శాతం నుంచి 37.31శాతానికి) పెంపుదల అమల్లోకి వచ్చేలా ఆర్థిక శాఖ ఉత్తర్వులకు ఆమోదం (2025 అక్టోబరు నెల జీతం నుంచి ఈ ప్రయోజనం అందేలా ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది).
- లైఫ్ ట్యాక్స్ వర్తించే మోటార్ వెహికల్స్‌పై ఆ పన్నులో 10% రోడ్డు భద్రత సెస్‌గా వసూలుకు ఆర్డినెన్స్ జారీ చేసేందుకు ఆమోదం.
- గ్రామ/వార్డు సచివాలయాల పేర్లు స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామ సచివాలయాలుగా మారుస్తూ ఆర్డినెన్స్ జారీకి అంగీకారం.
- ఈ-కోర్టు ప్రాజెక్ట్ కింద రాష్ట్రంలోని 13 జిల్లా కోర్టుల్లో 13 సిస్టమ్ ఆఫీసర్ పోస్టులు, 26 సిస్టమ్ అసిస్టెంట్ పోస్టుల కల్పనకు ఆమోదం. ప్రస్తుతం కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న సిబ్బంది కొత్త పోస్టుల్లో నియామకం. మిగిలిన ఖాళీలకు కాంట్రాక్టు పద్ధతిలో ఎంపిక.
- అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల బిగింపునకు ఆమోదం.
- దొరవానిసత్రం, తడ మండలాల్లో కాళంగి నది ఎడమ ఒడ్డున ఉన్న ఫ్లడ్ బ్యాంక్ అభివృద్ధికి సంబంధించి ప్యాకేజీ-1 పనుల రద్దు.
- తిరుపతి జిల్లా పేరూరులోని ప్రభుత్వ భూమిలో 'హయత్ రీజెన్సీ' పేరుతో ఫైవ్‌స్టార్ లగ్జరీ హోటల్ ఏర్పాటుకు ఎంఆర్‌కేఆర్ నిర్మాణ సంస్థతో 2024 ఫిబ్రవరి 14న కుదిరిన లీజు ఒప్పందం రద్దు. కంపెనీ చెల్లించిన చట్టబద్ధ రుసుము తిరిగి చెల్లించే ప్రతిపాదనకు ఆమోదం.
- తిరుపతి జిల్లా దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ డెవలప్‌మెంట్ స్కీం కింద గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, షిప్ బిల్డింగ్ క్లస్టర్ ఏర్పాటుకు ఏపీ మెరైన్ బోర్డు అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఆమోదం.
- దగదర్తి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం నెల్లూరు జిల్లా దామవరంలో 418.14 ఎకరాల భూమిని సేకరించేందుకు రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థకు అనుమతి. శాశ్వత లీజు హోల్డర్‌కు ఎకరా రూ.13 లక్షల చొప్పున పరిహారం చెల్లించేందుకు ఆమోదం.
- విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గుడివాడలో 18.57 ఎకరాల ప్రభుత్వ భూమి రాష్ట్రీయ సేవా సమితికి బదిలీ. ఎకరానికి రూ.80 లక్షల చొప్పున చెల్లించాలన్న కలెక్టర్ ప్రతిపాదన మేరకు భూస్వామ్య హక్కుల బదిలీకి అనుమతి.
- పశ్చిమ బాపట్లలో రెండెకరాల ప్రభుత్వ భూమి బాపట్ల టీడీపీ జిల్లా అధ్యక్షుడికి లీజు పద్ధతిలో కేటాయింపు. అందులో జిల్లా టీడీపీ కార్యాలయ భవన నిర్మాణానికి అనుమతి. ఎకరానికి ఏటా రూ.వెయ్యి చొప్పున 33 ఏళ్ల పాటు లీజుకు.
- హైకోర్టు ఆదేశాల మేరకు అటవీ శాఖలో కె.సురేశ్ కుమార్‌ను అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా నియమించడానికి ఆమోదం.

ప్రపంచ స్థాయికి క్వాంటమ్ వ్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

శరవేగంగా అడుగులు పడుతున్నాయని, నూతన సంవత్సరం తొలి నెలలోనే అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ పనిచేయడం ప్రారంభిస్తుందని మంత్రివర్గ సహచరులకు వివరించారు. సోమవారం సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఎజెండా అంశాలపై చర్చ తర్వాత సీఎం చంద్రబాబు పలు అంశాలపై మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి 2025ను ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీగా ప్రకటించిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. 2026లో అంతర్జాతీయ క్వాంటమ్ కంప్యూటింగ్ కాన్ఫరెన్సులకు, క్వాంటమ్ ఫెయిర్‌లకు అమరావతి వేదికగా నిలుస్తుందని, ఆ దిశగా రాజధానిని సన్నద్ధం చేస్తామని అన్నారు. ఇక రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రులకు స్పష్టం చేశారు. ఓడరేవులకు అనుకూలమైన మన రాష్ట్రంలో ప్రతి కోస్తా జిల్లాకు ఒక పోర్టు ఉండాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. ప్రస్తుతానికి పశ్చిమగోదావరి మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో పోర్టులు ఏర్పాటు జరుగుతోందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పోర్టు ఏర్పాటుకు ఉన్న సమస్యలు ఏమిటో పరిశీలించాలని మంత్రి రామానాయుడిని, సీనియర్ ఐఏఎస్ అధికారి కృష్ణబాబును సీఎం ఆదేశించారు. అదే సమయంలో విమానాశ్రయాల అభివృద్ధి కూడా ఊపందుకోవాలని సూచించారు. కుప్పం, దగదర్తితో పాటు మరో రెండు ప్రాంతాల్లో విమానాశ్రయాల పనులు ఎంత వరకు వచ్చాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. దొనకొండ, బొబ్బిలి, నాగార్జునసాగర్ ప్రాంతాల్లో ఎయిర్ స్ట్రిప్స్ ఉన్నాయని, వాటిని కూడా అభివృద్ధి చేయాలన్నారు.

జిల్లాల మార్పులు చేర్పులపై..

రాయచోటిని జిల్లా కేంద్రంగా తీసి, మదనపల్లెను పెట్టాల్సిన అంశంపైనా క్యాబినెట్‌లో సుదీర్ఘ చర్చ నడిచింది. రాజంపేట వాసులు కడపలో, రైల్వే కోడూరు వాసులు తిరుపతిలో కలుస్తామని అనడంతో రాయచోటి ఒక్కటే మిగిలిపోయిందని, మరోవైపు రాయచోటి జిల్లా కేంద్రంగా ఉండాల్సిందేనని మంత్రి మండిపల్లి గట్టిగా అడుగుతున్నా ఏం చేయలేని పరిస్థితి ఏర్పడిందని సీఎం వ్యాఖ్యానించారు. ఒక్క నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రంగా చేయలేం కదా అని సీఎం అన్నారు. అదే సమయంలో.. నెల్లూరు జిల్లాలో కొన్ని మార్పులను మంత్రి నారాయణ ప్రస్తావించారు. రెవెన్యూ డివిజన్ పరిధి ఒకలా.. పోలీసు సబ్ డివిజన్ పరిధి మరోలా ఉందని కొత్త మార్పులు చేర్పులు చేస్తే రెండింటి పరిధి ఒకేలా ఉండేలా చూడొచ్చని నారాయణ సూచించారు. ఇలాంటి అంశాలను మరోసారి చూద్దామని సీఎం పేర్కొన్నారు. ఆదోనిని రెండు మండలాల నుంచి మూడు మండలాలుగా చేయాలన్న డిమాండ్‌పైనా క్యాబినెట్‌లో చర్చ జరిగింది. అయితే ప్రస్తుతానికి రెండు మండలాలుగా కొనసాగించడానికి నిర్ణయించారు. అలాగే ఆదోని 1, 2 అని కాకుండా రెండు మండలాలకు రెండు పేర్లు ఉంటే బాగుంటుందని పయ్యావుల సూచించారు. అన్నీ చిన్న చిన్న పల్లెలే ఉండటం వల్ల ఏ పేరు పెట్టాలన్నది నిర్ణయించడం కష్టమైందని, అందుకే అలా చేశామని అధికారులు చెప్పారు.


అధికారుల ఆలస్యంపై సీఎం అసహనం

మంత్రి మండలి సమావేశానికి అధికారులందరూ నిర్ణీత సమయానికి హాజరవ్వాల్సిందేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మున్సిపల్ అంశాలపై చర్చ సమయంలో సంబంధిత అధికారులు లేకపోవడంపై సీఎం అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ సబ్జెక్ట్ ఆలస్యంగా వస్తుందనే ఉద్దేశంతో హాజరుకాకపోవడాన్ని తప్పుబట్టారు. ఇక పోలవరం మండలం లేకుండా పోలవరం జిల్లా ఏమిటని మంత్రి కందుల దుర్గేశ్ ప్రస్తావించడంతో.. నిర్వాసితులు ఉన్నారన్న ఉద్దేశంతో జిల్లాకు ఆ పేరు పెట్టాల్సి వచ్చిందని సీఎం వివరించారు. ఎన్టీఆర్ ఊరు లేకుండా ఎన్టీఆర్ జిల్లా అని పేరు పెట్టారు కదా, జిల్లాలకు ప్రముఖుల పేర్లను పెట్టడం అనేది వారిని గౌరవించుకోవడమే తప్ప లోతుగా ఆలోచన చేయాల్సిన అవసరం లేదని సీఎం అన్నారు.

2026 మరింత కలిసొస్తుంది

ఈ ఏడాదిలో ప్రభుత్వ పరంగా చాలా బాగా చేశామన్న సంతృప్తి ఉందని సీఎం అన్నారు. ప్రజలకు ఉపయోగపడే 23 పాలసీలను తీసుకొచ్చామని, సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమపాళ్లలో ముందుకు తీసుకెళ్లగలిగామని చెప్పారు. 2026 మరింత కలిసివస్తుందన్న నమ్మకం ఉందన్నారు. 2025లో ప్రభుత్వం సాధించిన విజయాలను మంత్రులకు సీఎం వివరించారు.

- తల్లికి వందనం కింద 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10,090 కోట్లు సాయం చేశాం
- స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలను ఆగస్టు 15న ప్రారంభిస్తే ఇప్పటి వరకు 3.25 కోట్ల ప్రయాణాలను మహిళలు ఉచితంగా చేశారు.
- అన్నదాత సుఖీభవ కింద 46 లక్షల మంది రైతులకు రూ. 6,310 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశాం.
- దీపం-2 పథకాన్ని అమలు చేస్తున్నాం.
- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద ఇప్పటి వరకు రూ.50 వేల కోట్ల పంపిణీ చేశాం.
- మెగా డీఎస్సీ, కానిస్టేబుళ్ల నియామకాలు చేపట్టాం.
- గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది విద్యుత్తుశాఖలో ట్రూడౌన్ విధానాన్ని తీసుకొచ్చాం.
- వినియోగదారులపై విద్యుత్తు బిల్లుల భారాన్ని సుమారు రూ. 1,000 కోట్లమేర తగ్గించగలిగాం.




గండికోట లోయలో జాలీగా...



కడప జిల్లాలోని గండికోట లోయ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇయర్ ఎండింగ్ కావడం... వరుస సెలవులు రావడంతో భారీ సంఖ్యలో తరలివస్తున్న పర్యాటకులు ఇక్కడ సందడి చేస్తున్నారు. గండికోట లోయ(గ్రాండ్ కెన్యాన్)లోని నీటిలో బోటు షికార్ చేస్తున్నారు. జిప్‌లైన్‌లో జారుతూ ఉర్రూతలూగుతున్నారు.



ఏప్రిల్ నుంచి వీబీ జీరామ్‌జీ!

- పాత 'ఉపాధి' చట్టం కటాఫ్ తేదీపై త్వరలోనే కేంద్రం నోటిఫికేషన్
- కొత్త చట్టం అమలుకు రాష్ట్రాల అసెంబ్లీలో విధివిధానాలకు ఆమోదం
- రాష్ట్రాలు 40% వాటా భరించాల్సి రావడమే కారణం

హైదరాబాద్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): దేశంలో పేదలకు ఉపాధి హామీకి సంబంధించి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్రం తెచ్చిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ గ్రామీణ్ (వీబీ-జీరామ్‌జీ)' ఏప్రిల్ నుంచే అమల్లోకి రానుంది. దీనిపై త్వరలోనే కేంద్రం నుంచి ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఇటీవలే పార్లమెంటులో ఆమోదం పొందిన ఈ చట్టంలో.. రాష్ట్ర ఆరునెలల్లోపు దీని అమలుకు అనుగుణంగా విధివిధానాలు రూపొందించుకోవాలని పేర్కొన్నారు. కానీ పాత ఉపాధి హామీ పథకం కింద పనులను ఎప్పటివరకు కొనసాగించవచ్చు? కొత్త నిబంధనల మేరకు పనులు ఎప్పటి నుంచి చేపట్టాలన్న దానిపై స్పష్టత ఇవ్వలేదు. దీనిపై కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. పాతచట్టం కింద పనులను నిలిపేయాల్సిన తేదీ 2026 మార్చి 31గా ఉండవచ్చని పేర్కొంటున్నాయి. ఆ తర్వాత కొత్త వీబీ-జీరామ్ జీ నిబంధనల ప్రకారమే పనులు జరగాల్సి ఉంటుందని స్పష్టం చేశాయి.

వ్యతిరేకిస్తున్నా.. ముందుకు వెళ్లాల్సిందేనా?

వీబీ జీరామ్‌జీ చట్టం ప్రకారం ఉపాధి హామీ పథకం వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వాలు 40శాతం వాటా భరించాల్సి ఉంటుంది. దీనిని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రతిపక్షాలు పోరాటం కూడా మొదలుపెట్టాయి. అయితే రాష్ట్రాలు తమ పోరాటాన్ని కొనసాగిస్తూనే.. కొత్త చట్టం అమలుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవడం అనివార్యమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్త చట్టం ఆధారంగా రాష్ట్రంలో అమలుచేసే పథకం, విధి విధానాలు, నిధుల కేటాయింపు తదితర అంశాలతో బిల్లును శాసనసభలో పెట్టి ఆమోదించుకోవాల్సి ఉంటుంది. కొత్త చట్టంతో ఉపాధి వేతన నిధుల్లో 40శాతం భరించాల్సి రావడంతో.. రాష్ట్రాలు ఇంతకుముందులా ఉత్సాహంగా పనులు చేస్తాయా? అందుకు ఎన్ని రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి సహకరిస్తుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పథకం కోసం ఖర్చు చేసే మొత్తం, ఉపాధి కల్పించే రోజులు, జరిగే పనులు తగ్గిపోతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. పనిదినాలు తగ్గిపోతే.. మహిళలకు వేతనాల విషయంలో వ్యత్యాసం పెరిగే ప్రమాదమూ ఉందన్న అభిప్రాయం వస్తోంది.



మంటల్లో బోగీలు

(మొదటి పేజీ తరువాయి)

నిలిపివేశారు. అప్పటికే అప్రమత్తమైన ప్రయాణికులంతా రైలు ఆగిన వెంటనే బోగీల నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ఎలమంచిలికి ముందు 5 కిమీ దూరంలో బీ1 కోచ్ బ్రేకులు పట్టేయడంతో (బ్రేక్ బైండింగ్) తొలుత పొగ వచ్చిందని, తర్వాత మంటలు చెలరేగాయని ప్రయాణికులు తెలిపినట్టు అధికారులు చెబుతున్నారు. బీ1 కోచ్‌లో 76 మంది, ఎం2 కోచ్‌లో 82 మంది ప్రయాణం చేస్తున్నారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే ఎలమంచిలి, అనకాపల్లి కేంద్రాల నుంచి 4 అగ్నిమాపక శకటాలు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాయి. మూడున్నర గంటలు శ్రమించి మంటలను అదుపు చేశాయి. ప్రమాదం జరిగిన రెండు బోగీల్లోనూ సామగ్రి చెల్లాచెదురుగా పడ్డాయి.



రైళ్ల రాకపోకలకు అంతరాయం

ఈ ప్రమాదంతో రైళ్లరాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అటు విశాఖ నుంచి ఇటు విజయవాడ నుంచి సామర్లకోటకు చేరాల్సిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంటలు ఆలస్యంగా చేరుకున్నాయి. పూరీ-తిరుపతి ఎక్స్‌ప్రెస్, హౌరా-హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖ-లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు ఆలస్యంగా ప్రయాణించాయి. ప్రయాణికులకు రైళ్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజెప్పేందుకు సామర్లకోట స్టేషన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటుచేశారు. రైల్వే శాఖ డీఐజీ సత్యయేసుబాబు, అనకాపల్లి ఎస్పీ తుహిన్‌సిన్హా, రైల్వే ఎస్పీ షణ్ముఖ వడివేలు, అనకాపల్లి కలెక్టరు విజయ కృష్ణన్, రైల్వే సాంకేతిక సిబ్బంది, విద్యుత్ తదితర విభాగాల అధికారులు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్ఎం మోహిత్ సోనంక్య, సీఆర్ఎస్ ఛైర్మన్ మాధవి ఘటనా స్థలం వద్దనే ఉండి సహాయ చర్యలు పర్యవేక్షించారు. దెబ్బతిన్న రెండు బోగీలను కట్ చేసి, మిగిలిన బోగీలతో రైలును సామర్లకోట రైల్వేస్టేషన్‌కు సోమవారం ఉదయం 9గంటలకు తీసుకొచ్చారు. ఆ రెండు బోగీల్లోని 158 మందిని ప్రయాణికులను ఆర్టీసీ బస్సుల్లో సామర్లకోట తరలించారు. అక్కడ ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌కు రెండు బోగీలను కొత్తగా తగిలించి.. వారిని ఎక్కించారు. వారిని తీసుకుని ఉదయం 11 గంటలకు సామర్లకోట నుంచి రైలు తిరిగి బయలుదేరింది.

ఏమిటీ బ్రేక్ బైండింగ్?

రైలు వేగం తగ్గించాలన్నా, ఆపాలన్నా లోకోపైలట్ బ్రేకు వేసినప్పుడు అది ప్రతి కోచ్ కింద ఉన్న అన్ని చక్రాలనూ ఆపుతుంది. ఆ క్రమంలో ఒక్కోసారి బ్రేక్‌పై బుష్ సరిగ్గా అప్లయ్ కాకపోతే రాపిడి ఏర్పడి పొగ వస్తుంది. బ్రేక్ రిలీజ్ చేసిన తర్వాత ఒక్కోసారి బుష్ చక్రం నుంచి వెనక్కి రాకుండా అతుక్కుని ఉండిపోతుంది. అది గమనించకుండా రైలును ముందుకు నడిపితే రాపిడి మరింత పెరిగి మంటలు వస్తాయి. అది ఎక్కువగా ఉంటే యాక్సిల్ బాక్స్‌లో ఉండే గ్రీజ్ కాలిపోతుంది. దీనినే రైల్వే పరిభాషలో 'బ్రేక్ బైండింగ్' అని అంటారు. ఇలా తరచూ జరుగుతూనే ఉంటుంది. కాకపోతే మంటలు ఏర్పడి కోచ్‌లు కాలిపోయే స్థాయిలో ప్రమాదం జరగడం చాలా అరుదు. బీ-1కోచ్‌లో బ్రేక్ బైండింగ్ జరిగిందని అధికారులు భావిస్తున్నారు. అయితే బ్రేకులు ఎందుకు పట్టేశాయనే దానిపై దర్యాప్తు చేస్తున్నారు.

బోగీలో వస్త్ర వ్యాపారి మృతదేహం

- ప్రమాదం ముందు వరకు కుమార్తెతో ఫోన్‌లో సంభాషణ




కాలిపోయిన నోట్ల కట్టలు

ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారనుకుంటున్న సమయంలో.. విశాఖ నుంచి ఓ మహిళ వచ్చారు. అదే రైలులోని బీ 1 కోచ్‌లో తన తండ్రి ప్రయాణిస్తున్నారని అధికారులకు ఆమె తెలిపారు. ప్రమాదం జరగడానికి ముందు కూడా తన తండ్రి తనతో మాట్లాడారని, ఆ తర్వాత ఫోన్ పని చేయలేదని తెలిపారు. ఆమె ఇచ్చిన వివరాలతో అధికారులు క్షుణ్ణంగా పరిశీలించగా, బీ 1 కోచ్‌లో ఓ మృతదేహం కనిపించింది. బెర్త్ పైనే మంటల్లో చిక్కుకుని ఆయన సజీవదహనం అయ్యాడు. ఆయనను విజయవాడకు చెందిన చంద్రశేఖర్ సుందర్ (70)గా గుర్తించారు. అది తన తండ్రి మృతదేహమేనని ఆమె ధ్రువీకరించారు. సుందర్ వద్ద గల బ్యాగులో రూ. 5.80 లక్షల నగదు, కొంత బంగారం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. నగదులో సగం కాలిపోయింది. సుందర్ వస్త్ర వ్యాపారం చేస్తుంటారని బంధువులు తెలిపారు.

ఎనిమిది గంటలపాటు టెన్షన్..

మంటల్లో చిక్కుకున్నది మొదలు సామర్లకోట స్టేషన్‌లో రైలు తిరిగి బయలుదేరేవరకూ సుమారు 8 గంటల పాటు ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు సౌజన్యంతో మూడు రకాల అల్పాహారం, 250 వాటర్ బాటిళ్లను సిబ్బంది ప్రయాణికులకు అందించారు. ఈ సందర్భంగా ప్రమాద సమయంలో ఏం జరిగిందనేది తమ అనుభవాలను కొందరు ప్రయాణికులు పంచుకున్నారు.

ఊపిరి తీసుకోవడం కష్టమైంది



"నేను అనకాపల్లిలో ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ బీ1 బోగీలో ఎక్కాను. నేను టాయ్‌లెట్‌కు వెళ్లి బయటకు వచ్చిన సమయంలో బోగీలో పొగలు రావడం గమనించాను. ఆ వెంటనే మంటలు వ్యాపించాయి. నేను, మరికొందరం కలిసి నిద్రలో ఉన్న సహ ప్రయాణికులను అప్రమత్తం చేశాం. రైలును ఆపేందుకు చైన్ లాగగా, ఎలమంచిలి స్టేషన్‌లో రైలు నిలిచిపోయింది. ప్రయాణికులు లగేజీలను వదిలిపెట్టి కిందికి దిగడంతో ప్రాణాపాయం తప్పింది. మంటలు ఎగిసి పడడంతో పరిసర ప్రాంతాలన్నీ దట్టమైన పొగలు వ్యాపించాయి. మేం ఊపిరి పీల్చుకునేందుకు చాలాసేపు ఇబ్బందిపడ్డాం."

- నాగేంద్ర, బీ 1 కోచ్ ప్రయాణికుడు

టాయ్‌లెట్స్ పక్కన బెడ్‌రోల్స్ వద్ద మంటలు



"నేను ప్రయాణిస్తున్న బోగీలో టాయ్‌లెట్స్ సమీపాన బెడ్‌రోల్స్ నుంచి మంటలు, దట్టమైన పొగలు వస్తుండడాన్ని గుర్తించాం. అయితే మంటలు ఎలా ప్రారంభమయ్యాయో తెలియదు."

- లాల్‌భయ్యా, పట్నా, బీ 1 కోచ్ ప్రయాణికుడు



మద్యం ముడుపుల నిల్వ, రవాణాలో..
చెవిరెడ్డిది ముఖ్య పాత్ర

- హైకోర్టుకు సిట్ నివేదన.. బెయిల్‌పై తీర్పు రిజర్వు

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మద్యం ముడుపుల ద్వారా వచ్చిన సొమ్మును నిల్వ చేసి.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలించడంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ముఖ్య పాత్ర పోషించారని సిట్ తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా సోమవారం హైకోర్టుకు నివేదించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో తుడా వాహనాలను వినియోగించి సొమ్మును వివిధ నియోజకవర్గాలకు తరలించారని.. సదరు తుడా వాహనాలు ఆ సమయంలో మరో ప్రాంతంలో ఉన్నట్లు లాగ్ బుక్‌లో తప్పుగా నమోదు చేశారని తెలిపారు. హైవే టోల్‌ప్లాజా సీసీ కెమెరాల రికార్డులను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమైందన్నారు. మద్యం కుంభకోణం కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చెవిరెడ్డి (ఏ-38) దాఖలుచేసిన వ్యాజ్యం సోమవారం విచారణకు వచ్చింది. లూథ్రా వాదనలు వినిపిస్తూ.. 'మద్యం ఉత్పత్తి కంపెనీల నుండి ప్రతి నెలా 60 నుండి 70 కోట్లు వసూలు చేశారు. అట్టపెట్టెల్లో ప్యాక్ చేసి సొమ్మును తరలించారు. ఆ సొమ్ముతో బంగారం కొనుగోలుతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టారు. చెవిరెడ్డి ఆదేశాలతోనే సొమ్మును తరలించినట్లు.. ఆయనకు వ్యక్తిగత సెక్యూరిటీ గార్డులుగా ఉన్న కానిస్టేబుళ్లు సీఆర్‌పీసీ సెక్షన్ 164 కింద వాంగ్మూలం ఇచ్చారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉండగా చెవిరెడ్డి ప్రోద్బలంతో తరలిస్తున్న రూ.8 కోట్లను అధికారులు సీజ్ చేశారు. ఈ కేసు దర్యాప్తును కూడా సిట్‌కు బదలాయిస్తున్నాం. పిటిషనర్‌కు పూర్వనేర చరిత్ర ఉంది. ఆయనపై దాదాపు 70 కేసులు ఉన్నాయి. దేశం విడిచి పారిపోయేందుకూ ప్రయత్నించారు. రాజకీయ కక్షతో కేసు నమోదు చేశామన్న పిటిషనర్ ఆరోపణల్లో వాస్తవం లేదు. కేసు నమోదు చేసిన వెంటనే ఆయన్ను నిందితుడిగా చేర్చలేదు. సరైన ఆధారాలు లభించిన తర్వాతే నిందితుడిగా చేర్చాం. ఆయనపై మోపిన ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయని సంతృప్తి చెందాకే ట్రయల్ కోర్టు ఆయన బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. బెయిల్ మంజూరు చేయొద్దు' అని కోరారు. చెవిరెడ్డి తరపు సీనియర్ న్యాయవాది ఆర్.బసంత్ వాదనలు వినిపిస్తూ.. వ్యక్తిగత సెక్యూరిటీ అధికారి(పీఎస్‌వో) ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా నిందితుడిగా చేర్చారని.. దర్యాప్తు సంస్థకు అనుకూలంగా వాంగ్మూలం ఇచ్చినందుకు అ అధికారానికి అధిక జీతం వచ్చే ఆక్టోపస్‌కు డిప్యుటేషన్‌పై బదిలీ చేశారని తెలిపారు. చెవిరెడ్డి విషయంలో దర్యాప్తు ముగిసిందని.. చార్జిషీటు కూడా దాఖలైందని.. నిరవధికంగా జైల్లో ఉంచడానికి వీల్లేదని పేర్కొన్నారు. కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటామని.. బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించారు.

అడ్డం తిరిగిన అద్దేపల్లి!

- కస్టడీ విచారణ నివేదికపై సంతకం పెట్టని జనార్దనరావు
- నివేదిక మార్చారంటూ వాగ్వాదం
- ఎట్టకేలకు రిపోర్టుపై సంతకం చేసిన నకిలీ మద్యం కేసు సూత్రధారి
- మదనపల్లె ఎక్సైజ్ ఆఫీసులో హైడ్రామా

రాయచోటి/ములకలచెరువు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన నకిలీ మద్యం కేసులో కింగ్ పిన్‌గా వ్యవహరించిన ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు ఎక్సైజ్ ఉన్నతాధికారులపై అడ్డం తిరిగారు. మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయంలో చోటుచేసుకున్న ఈ వ్యవహారం తీవ్ర చర్చకు దారితీసింది. విచారణలో తాను చెప్పినట్లు కాకుండా.. ఎక్సైజ్ అధికారులు నివేదికను మార్చారని ఆరోపిస్తూ.. సదరు నివేదికపై సంతకం చేసేది లేదని భీష్మించారు. ఆ తర్వాత ఎక్సైజ్ అధికారులు ఆయన చెప్పిన విధంగానే నివేదికను రూపొందించడంతో.. ఎట్టకేలకు అద్దేపల్లి సంతకం చేశారు. ఈ సంతకం విషయమై జనార్దనరావు, ఎక్సైజ్ అధికారుల మధ్య తీవ్ర స్థాయిలో వాదోపవాదాలు జరిగినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ములకలచెరువు నకిలీ మద్యం కేసుకు సంబంధించి కోర్టు ఉత్తర్వుల మేరకు ఈ నెల 26న ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావుతో పాటు ఆయన తమ్ముడు జగన్‌మోహన్‌రావు, అనుచరులు తాండ్ర రమేశ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, షేక్ అల్లాబక్షులను ఎక్సైజ్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. మదనపల్లె సబ్‌జైలులో ఉన్న ఐదుగురిని మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి మూడు రోజుల పాటు విచారించారు. కస్టడీ గడువు సోమవారం ఉదయంతో ముగిసింది. అయితే, మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు హైడ్రామా చోటచేసుకుంది. విచారణ అనంతరం ఎక్సైజ్ అధికారులు నివేదిక రూపొందించారు. దీనిపై సంతకం చేయాలని జనార్దనరావును కోరారు. అయితే, నివేదికను పూర్తిగా చదివిన తర్వాతే సంతకం చేస్తానని జనార్దనరావు చెప్పారు. విచారణ నివేదికను చదివిన జనార్దనరావు సంతకం పెట్టేందుకు నిరాకరించారు. తాను చెప్పిన విధంగా కాకుండా మరోలా విచారణ నివేదిక తయారు చేశారని, తాను సంతకం పెట్టనని తేల్చిచెప్పారు. అంతేకాదు, కస్టడీ విచారణ రిపోర్టును మార్చారంటూ జడ్జికి ఫిర్యాదు చేస్తానని జనార్దనరావు హెచ్చరించారు. దీంతో ఎక్సైజ్ అధికారులు చివరకు జనార్దనరావు చెప్పిన విధంగా రిపోర్టును మార్చడంతో సంతకం చేశారు. కాగా, కస్టడీ విచారణ రిపోర్టులో దాసరిపల్లి జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డి పేర్లు ఉండడంతో సంతకం చేసేందుకు అద్దేపల్లి నిరాకరించినట్లు తెలిసింది.



జనార్దనరావును తంబళ్లపల్లె కోర్టుకు తీసుకొస్తున్న ఎక్సైజ్ పోలీసులు

మరో 14 రోజులు

ఐదుగురు నిందితుల కస్టడీతో పాటు రిమాండ్ గడువు కూడా ముగియడంతో సోమవారం మధ్యాహ్నం ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో వీరిని హాజరుపరిచారు. మరో 14 రోజులు రిమాండ్ పొడిగించడంతో మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. ఉదయం 10.30కే కస్టడీ గడువు ముగిసినా నిందితులను మధ్యాహ్నం 1.41కు కోర్టుకు తీసుకురావడంపై కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు జనార్దనరావు సన్నిహితులు తెలిపారు. ములకలచెరువు నకిలీ మద్యం కేసులో 33 మంది నిందితులుగా ఉన్నారు. వీరిలో దాసరిపల్లి జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డి మినహా 31 మందిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటి వరకు 23 మందిని కస్టడీకి తీసుకుని విచారించారు.

భేష్... వేగంగా స్పందించారు: చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): టాటానగర్ - ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాద ఘటనపై పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు వేగంగా స్పందించారని సీఎం చంద్రాబాబు ప్రశంసించారు. రెండు శాఖ అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఆర్పీఎఫ్, రైల్వే సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టడంతోపాటు ముందు, వెనుక కోచ్‌లను వెంటనే వేరు చేయడం ద్వారా పెద్ద ప్రమాదాన్ని తప్పించారని అన్నారు. సమర్థవంతమైన క్రౌడ్ మేనేజ్‌మెంట్‌తో పరిస్థితి అదుపులోకి తెచ్చారని అభినందించారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందడం దురదృష్టకరమన్న సీఎం... మృతుని కుటుంబానికి సంతాపం తెలిపారు.

మావోయిస్టులకు రిమాండ్ పొడిగింపు

- వీడియో కాన్ఫరెన్సు ద్వారా కోర్టు ఎదుట హాజరుపరిచిన పోలీసులు

విజయవాడ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): విజయవాడలో పటమట, పెనమలూరు పోలీసులకు చిక్కిన మావోయిస్టులకు న్యాయస్థానాలు రిమాండ్‌ను పొడిగించాయి. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో నలుగురు మావోయిస్టులను పటమట పోలీసులు గత నెలలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వారు నెల్లూరులోని కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వారిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జైలు అధికారులు సోమవారం స్థానిక నాలుగో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి యు.రామ్మోహన్ వారికి 12వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగించారు. అలాగే, పెనమలూరు పోలీసులకు చిక్కి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న 26 మంది మావోయిస్టులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వియవాడ ఆరో అదనపు జ్యుడిషయల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. వారికి ఎనిమిదో తేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి జి.లెనిన్‌బాబు ఉత్తర్వులు ఇచ్చారు.

చాణక్య బెయిల్ తిరస్కరణ

మద్యం స్కాంలో బూనేటి చాణక్య బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టేసింది. న్యాయాధికారి పి.భాస్కరరావు దీనిపై సోమవారం తీర్పు వెలువరించారు. చాణక్య ప్రస్తుతం విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఇప్పటికే పలుమార్లు ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను కోర్టు కొట్టేసింది. తాజాగా దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేస్తూ తీర్పిచ్చింది.

రాష్ట్రంలో పక్కాగా పోలీసింగ్

ప్రజలకు మరింత చేరువ: డీజీపీ



అమరావతి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో పటిష్ఠ పోలీసింగ్ కారణంగా ఈ ఏడాది నేరాలు తగ్గుముఖం పట్టాయి. మహిళలపై హింస, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు కూడా తగ్గాయి." అని డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా తెలిపారు. ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు వచ్చే సంవత్సరంలో నూతన ప్రణాళికలు అమలు చేయనున్నట్టు చెప్పారు. ప్రస్తుత సంవత్సరం(2025)లో రాష్ట్ర పోలీసుల పనితీరును మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఐజీలు సీహెచ్ శ్రీకాంత్, ఆకే రవికృష్ణ, పాలరాజుతో కలిసి సోమవారం ఆయన మీడియాకు వివరించారు. రాష్ట్రంలో ఈ ఏడాది సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు పెరిగాయని, వాటిని ఎలా కట్టడి చేయాలనే దానిపై జనవరిలో ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామన్నారు. సాంకేతికత సాయంతో నేరాలను కట్టడి చేశామని, గత ఏడాదితో పోల్చితే 6.17శాతం మేరకు నేరాలు తగ్గుముఖం పట్టాయని వివరించారు. గంజాయి సాగు నిర్మూలనలో విజయం సాధించామన్నారు. 'మహిళల రక్షణ కోసం 164 శక్తి బృందాలను ఏర్పాటు చేశాం. బాధితుల నుంచి ఫోన్ కాల్ వచ్చిన పది నిమిషాల్లోనే రక్షించాం. దీంతో మహిళలపై గృహ హింస తగ్గింది. ఎస్సీ, ఎస్టీలపై దాడులు తగ్గాయి. అయితే, సైబర్ నేరాలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. మేం స్పందించేలోపే సైబర్ నేరస్తులు కొట్టేసిన మొత్తాన్ని చైనాలోని క్రిప్టోలోకి మళ్లించేస్తున్నారు. దీంతో రికవరీ కష్టంగా మారింది. ఈ వ్యవహారంపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు కొత్త సంవత్సరంలో ప్రణాళిక సిద్ధం చేస్తాం. ఆర్థిక మోసాలను కూడా కట్టడి చేస్తాం. రాబోయే పదేళ్లలో పోలీసింగ్ ఎలా ఉంటుందనే దానిపై సంక్రాంతి తర్వాత రెండు రోజులు వర్క్‌షాప్ నిర్వహించి.. పోలీసింగ్‌లో మార్పులు చేయనున్నాం. సంక్లిష్టమైన కేసులు ఎలా చేధించారు.. పోలీసు విధుల్లో వచ్చిన మార్పులు, సాంకేతికత వినియోగం, ఏఐ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంపై పోలీసు అధికారులకు వివరిస్తాం. రాష్ట్రంలో గతంలో సెల్ ఫోన్ల రికవరీ ఆశాజనకంగా ఉండేది కాదు. ఈ ఏడాది 35,116 ఫోన్లను రికవరీ చేశాం. సైబర్ ముఠాలను గుర్తించాం. అంతర్జాతీయ ముఠాలను సైతం కట్టడి చేస్తున్నాం" అని డీజీపీ వివరించారు.

పేకాటపై పీడీ యాక్టులు..

రాష్ట్రంలో ఎక్కడైనా పేకాట క్లబ్బులు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని డీజీపీ హెచ్చరించారు. అవసరాన్ని బట్టి పీడీ యాక్టు నమోదు చేస్తామని తెలిపారు. చట్టానికి అందరూ సమానమేనని, హద్దులు మీరితే ఉపేక్షించబోమన్నారు.

అల్లర్లకు అడ్డుకట్ట

రాష్ట్రవ్యాప్తంగా తగ్గిన నేరాల్లో అత్యధికంగా అల్లర్లు 54 శాతం ఉన్నాయని డీజీపీ వెల్లడించారు. ఆర్థిక నేరాలు 4.78%, సైబర్ మోసాలు 18.94%, హత్యాయత్నాలు 11.6% పెరిగినట్లు చెప్పారు. ప్రజల్లో భయం సృష్టించేందుకు ప్రయత్నించిన 154 మందిపై రౌడీ షీట్లు తెరిచామన్నారు. రాష్ట్రంలో నమోదైన 26,518 రౌడీ షీట్లు కొనసాగిస్తున్నామని చెప్పారు. 'ఆపరేషన్ ట్రేస్' కింద 80 శాతం మంది బాలికలు, 47శాతం మంది మహిళలను గుర్తించామని తెలిపారు. 112 ఎమర్జెన్సీ సేవల స్పందన సమయాన్ని 30 నిముషాల నుంచి 16 నిముషాలకు తగ్గించామన్నారు.

డ్రగ్స్ లింకులు తెంపేస్తున్నాం: రవికృష్ణ



డ్రగ్స్ అమ్మకాలకు సంబంధించి బెంగళూరుతో పాటు కొన్ని రాష్ట్రాల్లోని లింకులను తెంపేస్తున్నామని 'ఈగల్' ఐజీ ఆకే రవికృష్ణ వెల్లడించారు. రాష్ట్రంలో గంజాయి సాగు అరికట్టినా సరఫరా జరుగుతోందని, ఏపీలో గంజాయి సరఫరాలో 12 రాష్ట్రాలకు చెందిన 343 మంది పాత్ర ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆయా రాష్ట్రాల టాస్క్‌ఫోర్స్‌తో సమన్వయం చేసుకుని మూలాలను పెకిలించబోతున్నట్లు తెలిపారు. ఎఫ్ఎస్ఎల్ నివేదికల్లో నాణ్యత, వేగం పెరిగిందని ఫలితంగా కేసుల పరిష్కారం, శిక్షలు పెరిగాయని వివరించారు.

ఏపీ కేడర్‌కు 8మంది ఐపీఎస్‌లు..

ఏపీ కేడర్‌కు 8 మంది యువ ఐపీఎస్ అధికారులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. 2023 బ్యాచ్‌కు చెందిన కాకుమాను అశ్విన్ మణిదీప్, జె. జశ్వంత్ చంద్ర, జీబీఎల్ అన్నపూర్ణ ప్రత్యూష, తరుణ్, జయశర్మ, జాధవ్ రావ్ నిరంజన్, బన్నా వెంకటేశ్, తరుణ్ ప్రతాప్ మౌర్యను రాష్ట్రానికి కేటాయించినట్టు కేంద్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.